రామమందిరం..
## స్పిరిచ్యువల్ స్మగ్లింగ్



ప్రొ. కంచ ఐలయ్య షఫర్డ్ రాసిన ప్రత్యేక కథనం
**రామమందిరం.. స్పిరిచ్యువల్ స్మగ్లింగ్**
లైఫ్ సప్లిమెంట్‌లో


ప్రభాత
ఆదివారం
# వెలుగు
12.07.2026
హైదరాబాద్
సంపుటి: 12 సంచిక: 148 పేజీలు: 10+4
₹6
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL
www.v6velugu.com
Follow: v6velugu




# మూగబోయిన గానకోకిల

- 88 ఏళ్ల వయసులో అనారోగ్య సమస్యలతో కన్నుమూత
- మైసూర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో తుదిశ్వాస
- 20 భాషల్లో 48 వేలకుపైగా పాటలకు గాత్రం
- పుట్టింది ఏపీలో, పెరిగింది తెలంగాణలో..
- 'దక్షిణ భారత నైటింగేల్', 'జానకి అమ్మ'గా ప్రసిద్ధి
- ఇయ్యాల మైసూర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్న కర్నాటక ప్రభుత్వం.. దక్షిణాది రాష్ట్రాల సీఎంలు, సినీ ప్రముఖుల సంతాపం

04 10 పేజీల్లో

# అర్ధరాత్రి నరమేధం

**ఆరుగురిని అతి కిరాతకంగా చంపిన రాక్షసుడు**



భార్య సరిత (ఫైల్)



పరీక్షిత్, దైవీక్షిత్





తల్లి లక్ష్మితో బాలిక, నాయనమ్మ రుక్కమ్మ

### పోక్సో కేసు పెట్టిన బాలిక ఫ్యామిలీపై కక్షతో మారణకాండ

- ముందుగా బాలిక ఇంట్లోకి వెళ్లి ఆమె తల్లి, నానమ్మ హత్య
- అక్కడి నుంచి బాలికను ఎత్తుకెళ్లి మర్డర్
- ఆ తర్వాత తన సొంత ఇంట్లో కిరాతకం
- భార్య, ముక్కుపచ్చలారని ఇద్దరు పిల్లల ఊచకోత
- తానూ ఆత్మహత్య చేసుకోబోతున్నట్టు తండ్రికి ఫోన్
- రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో దారుణం
- జాడలేని కిల్లర్.. ఆచూకీ కోసం పోలీసుల గాలింపు
- ఉన్నతాధికారులు సీరియస్.. ఎస్ఐ సస్పెన్షన్

**హైదరాబాద్/షాబాద్:** తనపై పోక్సో కేసు పెట్టిందనే కారణంతో ఓ బాలికపై కక్ష పెట్టుకొని సైకోలా మారిన వ్యక్తి మారణహోమం సృష్టించాడు. అర్ధరాత్రి కత్తితో ఇంట్లో చొరబడి బాలిక కళ్ల ముందే ఆమె తల్లిని, నానమ్మను పొడిచి చంపాడు. అక్కడి నుంచి బాలికను కారులో తీసుకెళ్లి హత మార్చాడు. అనంతరం తన ఇంటికి వెళ్లి.. తన సొంత భార్యా పిల్లల గొంతుకోశాడు. ''ఆరుగురినీ చంపేశాను..నేనూ చస్తున్నాను'' అంటూ తండ్రికి ఫోన్ చేసి చెప్పి, మొబైల్ స్విచ్ఛాఫ్ చేశాడు. రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఈ దారుణం జరిగింది.

మిగతా 4లో



నిందితుడు రాజ్‌కుమార్

శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, పొన్నం



# గేట్లు తెరిచి పంపులు నడపడం అసాధ్యం



### కాళేశ్వరంపై ప్రతిపక్షాలవి శుద్ధ అబద్ధాలు: సీఎం రేవంత్ రెడ్డి

- ప్రాజెక్టును ముంచిన దొంగల చేతికి మళ్లీ తాళాలు ఇచ్చే ప్రసక్తే లేదు
- బినామీల వెనుక దాక్కోకుండా ఎల్ అండ్ టీ సబ్ కాంట్రాక్ట్ తీసుకోవాలని హరీశ్‌కు సవాల్
- నీటిని నిల్వ చేసి ఎత్తిపోసేందుకు ఎన్‌డీఎస్‌ఏ అనుమతులు తేవాలని ఈటలకు సీఎం సవాల్
- జైలు భయంతోనే 'కిలాడీ కమిటీ' డ్రామాలు.. తప్పు చేసిన ప్రతి ఒక్కరినీ బోనులో నిలబెడతాం
- ఆంధ్రా కాలేజీల యాజమాన్యాలపై హరీశ్ బ్లాక్ మెయిల్ రాజకీయం
- చేసిన పాపాలు బయటపడేసరికి కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో దాక్కుండని విమర్శ
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, పొన్నంతో కలిసి మీడియా సమావేశం

**హైదరాబాద్, వెలుగు:** కాళేశ్వరం బ్యారేజీల్లో నీరు నిల్వ చేయకుండా పంపుహౌస్‌ల ద్వారా నీటిని ఎత్తిపోస్తామంటూ ప్రతిపక్షాలు చెప్పడం శుద్ధ అబద్ధమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'కుంగిపోయిన మేడిగడ్డ, పునాదులు దెబ్బతిన్న అన్నారం, సుందిళ్ల రిజర్వాయర్ల గేట్లు మూయలేం.. గేట్లు తెరిచి పంపులు నడపడం అసాధ్యం' అని స్పష్టం చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) కూడా ఇదే విషయం చెప్పిందని, టెస్టులు, రిపేర్లు అయ్యేవరకు గేట్లు వేయలేమని సీఎం తేల్చి చెప్పారు. ఎంసీహెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి శనివారం సీఎం మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టును సర్వనాశనం చేసి, వేల కోట్ల ప్రజాధనాన్ని ముంచేసిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు రిటైర్డ్ ఇంజినీర్ల ముసుగులో వచ్చి నీటిని ఎత్తిపోయాలంటూ ఉచిత సలహాలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) నివేదికను పక్కనబెట్టి రాజకీయ లబ్ధి కోసం రైతులను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ కుప్పకూలిపోవడానికి కేసీఆర్ అనాలోచిత నిర్ణయాలు, హరీశ్ రావు అవినీతి దాహమే కారణమన్నారు. లక్ష కోట్ల ప్రజాధనాన్ని గోదావరి పాల్జేసి, ప్రాజెక్టును శ్మశానంగా మార్చిన మాయల మరాఠీలు ఇప్పుడు తామేదో పత్తి గింజల మన్నట్లు ఫోజులు కొడుతున్నారని మండిపడ్డారు. తిమ్మిని బమ్మిని చేస్తూ, అబద్ధాలతో ప్రజలను నమ్మించాలని చూస్తే బొందపెడతామని హెచ్చరించారు.

**ఎత్తిపోయాలంటే కనీస నిల్వలు ఉండాల్సిందే..**

మేడిగడ్డ బ్యారేజీ బెడ్ లెవెల్ 89.5 మీటర్లు కాగా, కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు కనీసం 93.5 మీటర్ల మేర నీటి నిల్వ ఉండాలని, అంటే బ్యారేజీలో ఐదు టీఎంసీల నీటిని నిల్వ చేయాల్సి ఉంటుందని సీఎం తెలిపారు.

మిగతా 2లో

వియత్నాంలో టూరిస్టు బోటు బోల్తా..
# 15 మంది ఇండియన్స్ మృతి



### మరణించిన వారిలో ముగ్గురు ఏపీ వాసులు

- పదిమంది తమిళనాడు, ఇద్దరు కేరళ పర్యాటకులు
- ఉవ్వెత్తున ఎగిసిపడ్డ అలల ధాటికి బోల్తా పడ్డ బోటు
- తీరానికి 400 మీటర్ల దూరంలో ప్రమాదం
- ప్రమాద సమయంలో బోటులో 36 మంది
- 21 మందిని కాపాడిన వియత్నాం కోస్ట్ గార్డ్
- తెలంగాణ నుంచి వెళ్లిన 40 మంది టూరిస్టులు సేఫ్

**హోచిమిన్ సిటీ:** వియత్నాంలోని ఫూ క్వాక్ ద్వీపంలో శనివారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. భారత పర్యాటకులతో వెళుతున్న స్పీడ్ బోటు ఒకటి అలల ధాటికి అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో పదిహేను మంది పర్యాటకులు దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో ముగ్గురు ఆంధ్రప్రదేశ్‌వాసులు కాగా పదిమంది తమిళనాడుకు చెందిన వారు, మరో ఇద్దరు కేరళ వాసులని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. ప్రముఖ మొబైల్ సంస్థ 'లావా' నిర్వహించిన బిజినెస్ టూర్‌లో భాగంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి మొత్తం 110 మంది డిస్ట్రిబ్యూటర్లు వియత్నాం వెళ్లారు. టూర్ లో భాగంగా ఫూ క్వాక్ ద్వీపం సందర్శించారు. అక్కడి నుంచి స్పీడ్ బోట్‌లో తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో బోటులో 36 మంది ఉన్నారని సమాచారం. కాగా, విహారయాత్రకు వెళ్లిన వారు విగతజీవులుగా మారడంతో బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

**ప్రమాదం ఎలా జరిగింది?**

ఫూ క్వాక్ ద్వీపంలో పర్యటిస్తున్న భారత పర్యాటకులు హాన్ మే రుట్ ఎన్గోయ్ ద్వీపం సందర్శించాక మధ్యాహ్నం అన్ థోయ్ పోర్టుకు బయలుదేరారు. ఓ స్పీడ్ బోట్‌లో 32 మంది భారతీయులు, నలుగురు సిబ్బంది ప్రయాణం ప్రారంభించారు. తీరం సమీపిస్తుండగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. దాదాపు 400 మీటర్ల దూరంలో ఉన్నపుడు అలలు ఎగసిపడటంతో పాటు బలమైన గాలులు వీచాయి.

మిగతా 6లో






## రైతు డిస్కంకు ఈఆర్సీ పచ్చ జెండా

**టీజీఆర్‌పీడీసీఎల్‌కు లైసెన్స్ జారీ చేసిన రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి**

- 4 నెలల్లో కార్యకలాపాలు ప్రారంభించుకోవాలని ఆదేశాలు
- విద్యుత్ కనెక్షన్లను మార్చుతూ ఉత్తర, దక్షిణ డిస్కంలకు కొత్త లైసెన్స్‌లు జారీ
- వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కొనసాగింపు.. మోటార్లకు మీటర్లు ఉండవు
- సర్కారు హామీ ఇచ్చినట్టు ఈఆర్సీ వెల్లడి

09



సెమీ కండక్టర్ సెక్టార్‌లో
## 10 లక్షల జాబ్స్

- హైదరాబాద్ నుంచి 3 బుల్లెట్ ట్రైన్ కారిడార్లు: రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్
- విజయవాడకు 70 నిమిషాలు, ముంబైకి 2.20 గంటల్లోనే
- ఎలక్ట్రానిక్స్ తయారీ పరిశ్రమ 30 లక్షల కోట్లకు చేరిందని వెల్లడి.. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి హెచ్ఐసీసీ పారిశ్రామికవేత్తలతో భేటీ

02

మేడిగడ్డను ముట్టుకోకుండానే..
## కన్నెపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేయొచ్చు

- 96 మీటర్ల ఎత్తులో నీళ్లు పోతున్నయ్: కేటీఆర్
- రోజూ 2 టీఎంసీల చొప్పున వంద రోజుల్లో 200 టీఎంసీలు ఎత్తిపోసుకోవచ్చు
- గోదావరిలో పైన ఎక్కడా నీళ్లు లేవు.. కన్నెపల్లి దగ్గర్నే ఉన్నయ్
- అది మేడిగడ్డ కాదు.. మేటిగడ్డ.. 28 లక్షల క్యూసెక్కుల వరదనూ తట్టుకుందని కామెంట్

04

# జిల్లాల్లో ఫర్టిలిటీ ఓపీ క్లినిక్‌లు

**జీజీహెచ్, జిల్లా హాస్పిటళ్లలో ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయం**

### వారంలో ఒకరోజు సంతాన సమస్యలకు స్పెషల్ ఓపీ
### ఆయా హాస్పిటళ్లలో సీనియర్ గైనకాలజిస్టుల సేవలు వినియోగం

**హైదరాబాద్, వెలుగు:** సంతానం లేక ఏండ్ల తరబడి ఎదురు చూస్తున్న నిరుపేద దంపతులకు ఇకపై జిల్లా స్థాయిలోనే ప్రాథమిక ఫర్టిలిటీ చికిత్సలు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సాధారణ సమస్యలు అయితే జిల్లా హాస్పిటళ్లలోనే మందులతో ట్రీట్మెంట్ అందించాలని, ఐవీఎఫ్, ఐయూఐ వంటి చికిత్సలు అవసరమైనోళ్లనే హైదరాబాద్‌లోని గాంధీ, పేట్లబుర్జు వంటి ప్రభుత్వ హాస్పిటళ్లకు రిఫర్ చేసేలా చూడాలని వైద్య ఆరోగ్య శాఖ భావిస్తోంది. ఇందులో భాగంగా సంతానానికి సంబంధించి చిన్న చిన్న సమస్యలకు ప్రైవేట్ సెంటర్లను ఆశ్రయించకుండా జిల్లాల్లోనే ఫర్టిలిటీ ఓపీ క్లినిక్‌లను ఏర్పాటు చేసేలా ప్లాన్ చేస్తున్నది. ఒకవేళ ఐవీఎఫ్, ఐయూఐ వంటి సేవలు అవసరం పడితే.. జిల్లా క్లినిక్స్ నుంచి గాంధీ, పేట్ల బుర్జు హాస్పిటళ్లలో ఉన్న ప్రభుత్వ ఐవీఎఫ్ సెంటర్లకు రిఫర్ చేసేలా వ్యవస్థను సిద్ధం చేస్తున్నది. జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్, జిల్లా హాస్పిటల్స్ లో ఒక చోట ప్రత్యేకంగా ఫర్టిలిటీ ఓపీ క్లినిక్‌లను ప్రారంభించనున్నారు.

మిగతా 2లో

## సంగీతాభిమానులకు తీరని లోటు

- గాయని జానకి మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

**హైదరాబాద్, వెలుగు:** ప్రముఖ గాయని ఎస్. జానకి మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. దక్షిణ భారత సినీ సంగీత ప్రపంచంలో జానకి తన గళమాధుర్యంతో సంగీతాభిమానుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. అనేక చిత్రాల్లో పాత్ర సన్నివేశాలు, సందర్భాలకు అనుగుణంగా నవరసాలను పలికిస్తూ ఆమె పాడిన పాటలు శ్రోతలను మంత్రముగ్ధులను చేశాయని వివరించారు. అలాంటి గొప్ప గాయని మన తెలుగు వారు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. జానకమ్మ మరణం భారతీయ చలనచిత్ర పరిశ్రమకే కాకుండా కోట్లాది సంగీతాభిమానులకు తీరని లోటు అని సీఎం పేర్కొన్నారు. భగవంతుడు ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, జానకి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**వియత్నాం బోటు ప్రమాదంపై దిగ్భ్రాంతి**

వియత్నాం బోటు ప్రమాదంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన కొందరు టూరిస్టులు మరణించారనే సమాచారంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలిసిన వెంటనే స్పందించి అధికా రులను అప్రమత్తం చేశారు. ప్రమాదానికి సం బంధించిన పూర్తి వివరాలను తక్షణమే తెలుసు కోవాలని ఆదేశించారు. సహాయక చర్యలను ముమ్మరం చేసేందుకు కేంద్ర విదేశాంగ మం త్రిత్వ శాఖతో మాట్లాడాలన్నారు. అలాగే వియత్నాంలోని భారతీయ ఎంబసీ కార్యాలయ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సీఎస్‌ను ఆదేశించారు. ఈ ప్రమాదంలో తెలుగువారు కూడా ఉన్నారని ప్రాథమిక సమాచారం అందిన నేపథ్యంలో బాధితుల పూర్తి వివరాలను సేకరించాలని చెప్పారు. ఘటనలో గాయపడినవారికి అక్కడికక్కడే అవసరమైన మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రమాదానికి గురైన బాధితులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు.

## 'బోధి' ఆఫీసును మీడియాకు చూపించిన సీఎం

**హైదరాబాద్, వెలుగు:** ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లోని సీఎం కార్యాలయాన్ని రూ.100 కోట్లతో నిర్మించారని, కేవలం గేట్ల కోసమే రూ.17 కోట్లు ఖర్చు పెట్టారంటూ వచ్చిన ఆరోపణలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. శనివారం మీడియా సమావేశం అనంతరం జర్నలిస్టులకు తన కార్యాలయంలోని అన్ని రూమ్‌లను కలియ తిప్పి చూపించారు. ఇందులో ఖరీదైనవి ఏమున్నాయో చెప్పాలని మీడియా ప్రతినిధులను అడిగారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీకి సీఎం చైర్ పర్సన్ అని అదే హోదాలో ఇక్కడ ఆఫీస్ ఉంటుందని చెప్పారు. తాను సీఎంగా దిగిన తర్వాత కూడా అది అలాగే ఉంటుందని తాను వచ్చి సొంతం చేసుకునేది కాదని స్పష్టం చేశారు.

# ..పంపులు నడపడం అసాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

గేట్లు ఓపెన్‌గా ఉంచినప్పుడు నీరు నిలబడదని, నీరు నిలబడకుండా పంపులు నడవడం అసాధ్యమని వివరించారు. కేవలం ట్రయల్ రన్ లేదా డ్రై రన్ కోసం కొద్ది నిమిషాలు నీటిని ఎత్తిపోయవచ్చేమో కానీ, పంటలకు సరిపడా నిరంతరాయంగా నీటిని తోడటం అస్సలు కుదరదని సీఎం సాంకేతిక అంశాలతో సహా తేల్చిచెప్పారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిధిలో కూడా ఇదే విధమైన టెక్నికల్ అడ్డంకులు ఉన్నాయని సీఎం వివరించారు. అన్నారం బ్యారేజీ బెడ్ లెవెల్ 106 మీటర్లు కాగా, సరస్వతి పంప్ హౌస్ పనిచేయాలంటే 116.5 మీటర్ల ఎత్తు వరకు నీరు నిల్వ ఉండాలని, అలాగే సుందిళ్ల బెడ్ లెవెల్ 118 మీటర్లు కాగా, పార్వతి పంప్ హౌస్ కోసం 126.5 మీటర్ల వరకు నీటిని నిల్వ చేయాలని పేర్కొన్నారు. ఈ మూడు బ్యారేజీల పునాదులు బలహీనపడ్డాయని ఎన్‌డీఎస్‌ఏ చెప్పినందున గేట్లు మూసే పరిస్థితి లేదన్నారు. ఒకవేళ అన్నారం గేట్లు మూయకుండా మేడిగడ్డ నుంచి నీటిని పంప్ చేస్తే, ఆ నీరంతా అన్నారం నుంచి తిరిగి వెనక్కి మేడిగడ్డకే కొట్టుకుపోతుందని, ఇది గానుగ ఎద్దు తిరిగినట్లు వృథా ప్రయాస అవుతుందని సీఎం వివరించారు.

**బందిపోట్ల కంటే ప్రమాదకరం**

"ప్రాజెక్టును నిలువునా ముంచేసిన దొంగల చేతికి మళ్లీ తాళాలు ఇవ్వడానికి మేమేం అమాయకులం కాదు.. దొంగల చేతికి తాళాలు ఇచ్చే ప్రసక్తే లేదు" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హరీశ్ రావు, కేసీఆర్ ముఠా సాదాసీదా దొంగలు కారని, వారు గజదొంగలని, బందిపోట్ల కంటే ప్రమాదకరమైన దోపిడీదారులని విమర్శించారు. ప్రాజెక్టును కూల్చేసి, వందల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసిన కిలాడీ కమిటీకి మళ్లీ గేట్ల తాళాలు అప్పగిస్తే ఉన్నది కాస్తా గంగలో కలిసిపోతుందని హెచ్చరించారు. మూడు నెలల సమయం ఇస్తే హరీశ్ రావు చేసేది రిపేర్లు కాదని, మళ్లీ కాంట్రాక్టర్లను బెదిరించి కమీషన్లు వసూలు చేయడమేనన్నారు. హరీశ్ రావుకు ప్రాజెక్టులపై గానీ, రైతులపై గానీ ఏమాత్రం ప్రేమ లేదని, ఆయన ఆరాటమంతా పాత కమీషన్ల బకాయిల కోసమేనన్నారు. "హరీశ్ రావు బ్లాక్‌మెయిల్ పాలిటిక్స్‌లో నిష్ణాతుడు. గతంలో చేసిన పనులకు సంబంధించి కొంతమంది కాంట్రాక్టర్లు ఇవ్వాల్సిన కమిషన్లు ఇంకా మిగిలిపోయాయి. ఇప్పుడు మూడు నెలల పాటు ప్రాజెక్టును చేతికి ఇస్తే, ఆ కాంట్రాక్టర్లను భయపెట్టి, బ్లాక్‌మెయిల్ చేసి, పాత బకాయిలు వసూలు చేసుకుని పారిపోవాలని చూస్తున్నాడు" అని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రాజెక్టును ధ్వంసం చేసిన వ్యక్తి, ఇప్పుడు మూడు నెలల్లో బాగు చేస్తాననడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉందన్నారు. హరీశ్ రావుకు అంతగా నైపుణ్యం ఉంటే, బినామీల వెనుక దాక్కోకుండా నేరుగా ఎల్అండ్‌టీ దగ్గరకు వెళ్లి అధికారికంగా సబ్‌కాంట్రాక్ట్ తీసుకుని పనులు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు.

**ఎంపీ ఈటల తీరు సిగ్గుచేటు..**

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అనుసరిస్తున్న ద్వంద్వ విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామని సీఎం అన్నారు. "బీజేపీలో ఉంటూ బీఆర్ఎస్ ప్రయోజనాల కోసం పని చేస్తున్న 'కిలాడీ కమిటీ'తో ఈటల చేతులు కలపడం సిగ్గుచేటు. నిజంగా మీకు రైతులపై ప్రేమ ఉంటే, ఢిల్లీకి వెళ్లి మీ కేంద్ర ప్రభుత్వ జలశక్తి మంత్రి వద్ద, ఎన్‌డీఎస్‌ఏ అధికారుల వద్ద మాట్లాడి బ్యారేజీలలో తాత్కాలికంగా నీటిని నిల్వ చేసి ఎత్తిపోసేందుకు అనుమతులు తీసుకురండి" అని సవాల్ విసిరారు. బీజేపీ నేత ఈటల రాజేందర్ నిజాయితీపరుడైతే, ఢిల్లీకి వెళ్లి ఎన్‌డీఎస్‌ఏ అధికారులతో మాట్లాడి బ్యారేజీలలో నీటి నిల్వకు అనుమతులు తీసుకురావాలన్నారు. అనుమతి పత్రాలు తెస్తే ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల పర్యవేక్షణలోనే తాము నీటిని ఎత్తిపోసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అలాగే, కేంద్రం వద్ద మూలుగుతున్న కాళేశ్వరం అవినీతి ఫైళ్లను కదిలించి, సీబీఐ విచారణను వేగవంతం చేయించి కేసీఆర్ కుటుంబ దోపిడీని శిక్షించేలా ఈటల రాజేందర్ ఒత్తిడి తేవాలన్నారు. అంతేకానీ తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఇక్కడ చౌకబారు బురద రాజకీయాలు చేయవద్దన్నారు. జైలు భయంతోనే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్ కలిసి "కిలాడీ కమిటీ"గా ఏర్పడి డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. ఈటల రాజేందర్ కూడా బీఆర్ఎస్ నేత హరీశ్



రాసిచ్చిన స్క్రిప్టు ను పట్టుకుని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. "మేం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ బాగోతాన్ని బయటపెట్టకుండా జైలుకు పంపకుండా వదిలేయడమే మేం చేసిన తప్పు. అందుకే ఈరోజు రిటైర్డ్ ఇంజినీర్ల ముసుగులో వచ్చి మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. కానీ ఈ ప్రభుత్వం ఎవరికీ లొంగదు.. ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ సూచనల ప్రకారమే ప్రతి అడుగూ వేస్తాం. తప్పు చేసిన ప్రతి ఒక్కరినీ బోనులో నిలబెడతాం" అని సీఎం స్పష్టం చేశారు.

**ఆంధ్ర కాలేజీల యాజమాన్యాలకు పాలు అమ్ముకుంటున్నడు**

"హరీశ్‌రావు ఆంధ్ర కాలేజీల యాజమాన్యాలను బ్లాక్ మెయిల్ చేసి, బెదిరించి తన వ్యాపారాలు సాగిస్తున్నాడు. నాడు ఆంధ్రోళ్ల రక్తం తాగుతున్నారని తిట్టిన నోటితోనే, నేడు అదే నారాయణ, చైతన్యల దగ్గర మోచేతి నీళ్లు తాగుతూ పాలు పిండుకుంటున్నాడు. ఇంతకంటే నీచమైన, హీనమైన బతుకు ఇంకేమైనా ఉంటుందా హరీశ్‌రావు?" అని సీఎం ప్రశ్నించారు. నాడు ప్రజలను భావోద్వేగాలతో రెచ్చగొట్టి, నేడు అదే దోపిడీదారులతో చేతులు కలిపి వాళ్లకు పాలు అమ్ముతూ రూ.వేల కోట్లు వెనకేసుకున్న హరీశ్‌రావు నైజాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు.

**11 నెలల్లోనే బ్యారేజీలో లోపాలు బయటపడ్డాయి**

కేసీఆర్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రాజెక్టును ప్రారంభించిన కేవలం 11 నెలల లోపే మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో తీవ్రమైన లోపాలు బయటపడ్డాయని సీఎం తెలిపారు. 18 మే 2020 నాడు అప్పటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) బి.వి.రమణారెడ్డి బ్యారేజీ నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీకి అధికారికంగా ఒక లేఖ రాశారని గుర్తుచేశారు. ఆ లేఖలో సీసీ బ్లాకులు, వేరింగ్ కోట్ దెబ్బతిన్నాయని, వర్షాకాలం రాకముందే అత్యవసరంగా రిపేర్లు చేయకపోతే బ్యారేజీకి ప్రమాదం పొంచి ఉందని స్పష్టంగా హెచ్చరించినప్పటికీ, నాటి ప్రభుత్వం ఆ హెచ్చరికలను పూర్తిగా బేఖాతరు చేసిందని సీఎం ఆరోపించారు. ఆనాడే స్పందించి ఉంటే నేడు బ్యారేజీ ఈ దుస్థితికి వచ్చేది కాదన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఉన్న లోపాలు, నిర్లక్ష్యానికి కన్నెపల్లి పంప్ హౌస్ మునిగిపోవడమే నిదర్శనమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 14 జులై 2022 నాడు గోదావరిలో వచ్చిన వరదలకు కన్నెపల్లి, అన్నారం పంప్ హౌస్‌ల సేఫ్టీ వాల్స్ పూర్తిగా బద్దలై, కన్నెపల్లి పంప్ హౌస్ నీట మునిగిపోయిందన్నారు. ఆ సమయంలో కూడా నష్టాన్ని శాశ్వతంగా నివారించేలా శాస్త్రీయంగా రిపేర్లు చేపట్టలేదని, కేవలం తాత్కాలిక పనులతో సరిపెట్టారని విమర్శించారు. నేటికీ కన్నెపల్లి పంప్ హౌస్ 100 శాతం వినియోగంలోకి తీసుకురావడానికి వీల్లేని విధంగా దెబ్బతిని ఉందన్నారు. అక్టోబర్ 24, 2023 నాడు, అంటే ప్రాజెక్టు ప్రారంభించిన కేవలం నాలుగేళ్లలోనే మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయని, ఇది కేసీఆర్ ప్రభుత్వ అసమర్థతకు పరాకాష్ట అని సీఎం దుయ్యబట్టారు. బ్యారేజీ కుంగిపోయిన వెంటనే అక్టోబర్ 22న ఎన్‌డీఎస్‌ఏ కమిటీని నియమించగా, వారు నవంబర్ 1, 2023 నాడు కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే ప్రాథమిక నివేదిక ఇచ్చారని తెలిపారు. ఆ నివేదికలోనే మేడిగడ్డ నిర్మాణంలో ప్లానింగ్, డిజైనింగ్, కన్‌స్ట్రక్షన్, క్వాలిటీ కంట్రోల్ వైఫల్యాలు ఉన్నాయని నిపుణులు తేల్చిచెప్పారన్నారు. బ్యారేజీకి ఉన్న సీకెంట్ పైల్స్ ఫౌండేషన్ లోపభూయిష్టంగా ఉందని, ఏ క్షణంలోనైనా బ్యారేజీ కొట్టుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తూ గేట్లను తెరిచి ఉంచాలని నాడే ఆదేశించారని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంటు ఆమోదించిన డ్యామ్ సేఫ్టీ యాక్ట్ 2021 ప్రకారం దేశంలోని అన్ని బ్యారేజీల భద్రతా బాధ్యతలు, తనిఖీలు ఎన్‌డీఎస్‌ఏ పరిధిలోకి వస్తాయని సీఎం వివరించారు. డ్యామ్ యజమాని అయిన రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాలను పాటించాల్సి ఉంటుందని, లేనిపక్షంలో క్రిమినల్ చర్యలకు బాధ్యుల వుతారని చట్టం చెబుతోందన్నారు. ఎన్‌డీఎస్‌ఏ w బృందం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వీటిలో నీటిని నిల్వ చేయడం ఎంతమాత్రం సురక్షితం కాదని స్పష్టంగా చెప్పిందన్నారు.

**కేసీఆర్ మోహం చెల్లకనే ఫామ్‌హౌస్‌లో దాక్కున్నడు!**


ఎనభై వేల పుస్తకాలు చదివానని చెప్పుకునే కేసీఆర్ తెలివితేటల వల్లే కాళేశ్వరం కాస్తా కూలేశ్వరంగా మారిందని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రాజెక్టు నాశనమై దేశవ్యాప్తంగా ఛీత్కారాలు ఎదురవుతుండటంతో కేసీఆర్ మొహం చెల్లక ఫామ్‌హౌస్‌లో దాక్కున్నాడని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా, అధికారుల హెచ్చరికలను లెక్కచేయకుండా ప్రాజెక్టును కేవలం దోపిడీ కోసమే కట్టారని ఆరోపించారు. తాము చేసిన ఘోరమైన పాపాలు బయటపడటంతో సమాధానం చెప్పలేక కేసీఆర్ పారిపోయాడని, ఇప్పుడు కొడుకును, అల్లుడిని జనాల మీదకు వదిలి అబద్ధాల ప్రచారం చేయిస్తున్నాడని మండిపడ్డారు. దోపిడీ దొంగలకు, బందిపోట్లకు ఈ సమాజంలో ఎలాంటి గౌరవం దక్కదని, కేసీఆర్ పాపాలను ప్రజలు ఎన్నటికీ క్షమించరని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### ఎత్తిపోయాలంటే ఇవీ లెక్కలు..

మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోసుకునే అవకాశమున్నప్పటికీ కావాలనే కాంగ్రెస్ ప్రభుత్వం పంప్ చేయడం లేదన్న బీఆర్ఎస్ నేతల ఆరోపణలకు సీఎం గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ఇంజినీరింగ్ నిపుణులతో కలిసి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయా టెక్నికల్ అంశాలను సామాన్యులకు సైతం అర్థమయ్యేలా వివరించారు.

**ఆ వివరాలు ఇవీ..**

- మేడిగడ్డ బ్యారేజీ ఎత్తు (ఎఫ్ఆర్ఎల్) 100 మీటర్లు కాగా.. బెడ్ లెవెల్ 89 మీటర్లు. బ్యారేజ్ బ్యాక్ వాటర్ నుంచి నీటిని ఎత్తిపోసేలా 17 పంపులతో కన్నెపల్లి పంప్‌హౌస్‌నిర్మించారు. బ్యారేజీలో 93.5 మీటర్ల ఎత్తులో నీళ్లు ప్రవహిస్తే ఆ నీటిని పంపుల ద్వారా ఎత్తిపోసే వీలుంటుంది. అలా జరగాలంటే గేట్లు వేసి నీటిని కనీసం 93.5 మీటర్లు, ఆపైన నిర్వహించాలి. ఒకవేళ ఆ ఎత్తులో నీళ్లు పారుతున్నాయని అనుకున్నా ఎత్తి ఎక్కడ పోయాలన్నది మరో సమస్య.
- బీఆర్ఎస్‌వాళ్లు చెప్పినట్లు ఒకవేళ కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని అన్నారం బ్యారేజీలోకి లిఫ్ట్




చేశామనుకుందాం. ఇక్కడ, అన్నారం బ్యారేజీ ఫుల్ రిజర్వాయర్ లెవెల్ 119 మీటర్లు కాగా, బెడ్ లెవెల్ 106 మీటర్లు. అదే సమయంలో 12 పంపులున్న అన్నారం పంప్‌హౌస్ దగ్గరి నుంచి నీటిని డ్రా చేయాలంటే నీటి ప్రవాహ ఎత్తు 116.50 మీటర్లు ఉండాలి. అంటే అన్నారం గేట్లు పూర్తిగా మూసేస్తే తప్ప ఇది సాధ్యం కాదు.

- సుందిళ్ల బ్యారేజీ ఫుల్ రిజర్వాయర్ లెవెల్ 130 మీటర్లుకాగా.. బెడ్‌లెవెల్ 118.70 మీటర్లు. బ్యారేజీకి ఎగువన 17 పంపులతో నీటిని ఎత్తిపోసేందుకు పంప్‌హౌస్‌ను నిర్మించారు. అక్కడ నీటిని లిఫ్ట్ చేయాలంటే కనీస నీటి ప్రవాహ ఎత్తు 126 మీటర్లుండాలి. సుందిళ్ల గేట్లు మూస్తే తప్ప ఇది కూడా సాధ్యం కాదు. కానీ మేడిగడ్డతోపాటు అటు అన్నారం, ఇటు సుందిళ్ల బ్యారేజీల పునాదుల్లో సమస్య ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లో నీటిని నిల్వ చేయవద్దని నేషనల్‌డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) స్పష్టంచేసినట్లు సీఎం వివరించారు.

### ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకోలేం..

కేంద్ర ప్రభుత్వం జూన్ 30, 2024 నాడు కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ పర్యవేక్షణ కోసం ఒక ఉన్నత స్థాయి టెక్నికల్ ఓవర్‌సైట్ కమిటీ నియమించిందని సీఎం వెల్లడించారు. ఈ కమిటీలో ఎన్‌డీఎస్ఏ సాంకేతిక సభ్యుడు చైర్మన్‌గా ఉండగా, సీడబ్ల్యూసీ డిజైన్ల డైరెక్టర్, సీడబ్ల్యూసీ గేట్ల డైరెక్టర్, సీఎస్ఎంఆర్ఎస్ సీడబ్ల్యూపీఆర్ఎస్ ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారని, తెలంగాణ ప్రభుత్వం తరఫున ముగ్గురు సీనియర్ ఇంజినీర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపారు. ఈ జాతీయ స్థాయి నిపుణుల కమిటీ పర్యవేక్షణలోనే బ్యారేజీల పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని కేంద్ర జలశక్తి శాఖ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకోవడానికి వీల్లేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### హరీశ్ రావును మామ కేసీఆరే నమ్మలేదు

హరీశ్ రావు కేవలం కమీషన్ల కోసమే పనిచేసే ఒక బ్లాక్‌మెయిలర్ అని సీఎం దుయ్యబట్టారు. గతంలో సాగునీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో హరీశ్‌రావు వ్యాప్కోస్ నివేదికలను పక్కనబెట్టి, షీట్ పైల్స్ ఫౌండేషన్ స్థానంలో సీకెంట్ పైల్స్ ఫౌండేషన్ మార్చడం వల్లే బ్యారేజీల పునాదులు దెబ్బతిన్నాయని ఆరోపించారు. హరీశ్‌రావు అవినీతి బుద్ధి తెలిసే సొంత మామ కేసీఆరే అతన్ని నమ్మలేదని, అందుకే రెండోసారి అధికారంలోకి రాగానే అతని నుంచి సాగునీటి శాఖను లాక్కున్నాడన్నారు. కేసీఆర్ అవినీతి లక్కీ నంబర్ 6 శాతం కాగా, హరీశ్ రావుది 3 శాతం, కేటీఆర్‌ది 1 శాతం అని.. ఇలా మొత్తం 10 శాతం కమీషన్లను పిండుకున్నారని మండిపడ్డారు. అమెరికాలో చదువుకున్నానని, ఐటీ గిరి గిర తిప్పగలనని చెప్పుకునే కేటీఆర్ తెలివితేటలు కేవలం కమీషన్లు వసూలు చేయడానికే పరిమితమయ్యాయా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కనీస శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం లేకుండా, గేట్లు ఓపెన్ చేసి ఉంచినప్పుడు పంపుల ద్వారా నీటిని ఎలా ఎత్తిపోస్తారో కేటీఆర్ చెప్పాలని నిలదీశారు. ప్రవాహం ఉన్నప్పుడు నీరు నిలవదని, నీరు నిలవకుండా పంపులు నడపడం కుదరదని తెలిసినా కేటీఆర్ ప్రజలను మభ్యపెట్టేందుకు బురద రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించా రు. తండ్రి కేసీఆర్ అప్రతిష్టను కప్పిపుచ్చడానికి, హరీశ్ అవినీతిని దాచడానికి కేటీఆర్ శతవిధాలా ప్రయత్నిస్తు న్నాడని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం నాశనానికి కేటీఆర్ కూడా సమాన భాగస్వామి అని, ఆయన 1 శాతం కమీషన్ల లెక్కలను త్వరలోనే బయటపెడతామని చెప్పారు

**కమీషన్ల కోసం ఇష్టారాజ్యం: ఉత్తమ్ కుమార్ రెడ్డి**

అప్పటి సాగునీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్ రావు కమీషన్ల కోసం ప్రాజెక్టు డిజైన్లను ఇష్టారాజ్యంగా మార్చారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. గత కాంగ్రెస్ హయాంలో నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి, నాగార్జున సాగర్, శ్రీశైలం వంటి ప్రాజెక్టుల వల్లే తెలంగాణ సాగునీటి రంగానికి స్థిరత్వం చేకూరిందన్నారు. కాళేశ్వరం కింద ఒక్క ఎకరాకు కొత్తగా శాశ్వత నీరు ఇవ్వలేకపోయారని, కేవలం అప్పుల భారాన్ని మాత్రమే మిగిల్చారని విమర్శించారు. ప్రభుత్వం ప్రస్తుతం ఐఐటీ బాంబే నిపుణులతో సమగ్ర టెస్టింగ్ ప్రక్రియను నిర్వహిస్తోందని, ఈ నెల చివరి నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. ఆగస్టు చివరి నాటికి నిపుణుల తుది డిజైన్ల ఆధారంగా అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీల పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి, రైతాంగాన్ని ఆదుకుంటామన్నారు.

హెచ్ఐసీసీలో పారిశ్రామికవేత్తల సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్




## సెమీ కండక్టర్ సెక్టార్‌లో 10 లక్షల జాబ్స్

**హైదరాబాద్ నుంచి 3 బుల్లెట్ ట్రైన్ కారిడార్లు: రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్**

**హైదరాబాద్, వెలుగు:** సెమీ కండక్టర్ రంగంలో రాబోయే రోజుల్లో 10 లక్షల మంది ఉద్యోగుల అవసరం ఉందని, ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి స్టూడెంట్లు రెడీగా ఉండాలని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. తెలంగాణ నుంచి ఇప్పటికే ఐదు వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని, త్వరలోనే మరిన్ని రైళ్లతో పాటు కొత్తగా వందే భారత్ స్లీపర్ రైళ్లను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరిగిన పారిశ్రామికవేత్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తోందన్నారు. 'ఐటీ పరిశ్రమ కొత్త పుంతలు తొక్కుతోంది. సెమీకండక్టర్ రంగానికి ప్రధాని మోదీ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. దేశంలోని 350 యూనివర్సిటీల్లో విద్యార్థులు సెమీ కండక్టర్ల అభివృద్ధిపై పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఈ రంగంలో 10 లక్షల ఉద్యోగుల లోటుంది. ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పరిశ్రమ రూ.30 లక్షల కోట్లకు చేరుకుంది. ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో దేశం ప్రపంచంలోనే 3వ స్థానంలో ఉంది. తెలంగాణలో ఇప్పటికే 104 ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీలు పనిచేస్తుండటం గర్వకారణం' అని అన్నారు.

**రైల్వే బడ్జెట్‌లో భారీ కేటాయింపులు**

కేంద్ర ప్రభుత్వం ఏడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లను ప్రకటిస్తే, అందులో తెలంగాణకే మూడు దక్కాయని వైష్ణవ్ తెలిపారు. వచ్చే ఏడాది ముంబై-పుణే మధ్య తొలి బుల్లెట్ ట్రైన్ ప్రారంభమవుతుందనీ, ఆ తర్వాత తెలంగాణ హబ్‌గా మారుతుందని చెప్పారు. బుల్లెట్ ట్రైన్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం 1 గంట 10 నిమిషాల్లో, ముంబైకి 2 గంటల 20 నిమిషాల్లో, చెన్నైకి 2 గంటల్లోనే చేరొచ్చనీ, ఈ క్రెడిట్ అంతా ప్రధాని మోదీ విజన్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి రూ.5వేల కోట్లు కేటాయించిందని వైష్ణవ్ అన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో పునర్నిర్మిస్తున్నామని, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

**తెలంగాణకు పెద్దపీట: కిషన్ రెడ్డి**

వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా మోదీ ప్రభుత్వం పని చేస్తోందని, తెలంగాణ రవాణా రంగానికి పెద్దపీట వేస్తున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల కోసం రూ.1.75 లక్షల కోట్లు, బుల్లెట్ రైళ్ల కోసం రూ.5 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని చెప్పారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను విమానాశ్రయం తరహాలో రీడెవలప్ చేస్తున్నామని, హైటెక్ సిటీ స్టేషన్‌ను కూడా అద్భుతంగా తీర్చిదిద్దామని గుర్తుచేశారు. బెంగళూరు, పుణే, నోయిడా తరహాలో తెలంగాణలోని టైర్ 2 సిటీల అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు సహకరించాలని ఆయన కోరారు. ప్రస్తుతం భారత్ విదేశీ టెక్నాలజీని వాడుకోవడమే కాకుండా, కొత్త టెక్నాలజీని సృష్టించే స్థాయికి ఎదిగిందని.. హైదరాబాద్‌లోనే రాకెట్ ఇంజిన్లు తయారవుతుండటం ఇందుకు నిదర్శనమన్నారు.

## జిల్లాల్లో ఫర్టిలిటీ ఓపీ క్లినిక్‌లు

(మొదటి పేజీ తరువాయి)

దీనివల్ల ప్రైవేట్ ఐవీఎఫ్ సెంటర్ల దోపిడీకి గురికాకుండా.. ప్రభుత్వ సెంటర్లలోనే ఉచితంగా, నాణ్యమైన సేవలను పొందుతారని ప్రభుత్వం భావిస్తున్నది.

**ప్రైమరీ చికిత్స.. జిల్లాల్లోనే**

జిల్లాల్లో ప్రారంభమయ్యే ఈ ఓపీ క్లినిక్‌లలో సంతానలేమితో బాధపడే దంపతులకు అవసరమైన అన్ని రకాల ప్రాథమిక పరీక్షలు ఉచితంగా చేస్తారు. పురుషులకు వీర్యకణాల పరీక్ష, మహిళలకు హార్మోన్ లోపాలను గుర్తించే రక్త పరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ వంటి కీలకమైన డయాగ్నస్టిక్స్ సేవలను ఇక్కడే అందిస్తారు. చాలా మందికి కేవలం హార్మోన్ల అసమతుల్యత, చిన్నపాటి ఆరోగ్య సమస్యల వల్ల సంతానం కలగదు. అలాంటి వారికి జిల్లా స్థాయిలోనే ఫాలిక్యులర్ మానిటరింగ్ చేస్తూ, అవసరమైన మందులు ఇవ్వడం ద్వారా సహజ గర్భధారణకు అవకాశం కల్పిస్తారు. పీసీఓడీ వంటి సమస్యలతో బాధపడే మహిళలకు డైట్, వ్యాయామంపై అవగాహన కల్పిస్తూ ప్రాథమిక చికిత్సను జిల్లా కేంద్రాల్లోనే పూర్తి చేస్తారు.

**గైనకాలజిస్టుల సేవలు..**

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ హాస్పిటల్స్ లో పని చేస్తున్న గైనకాలజిస్టులకు ప్రసవాలు, మెటర్నల్ సర్వీసుల్లో అపారమైన అనుభవం ఉంది. వారి నైపుణ్యాన్ని కేవలం డెలివరీలకే పరిమితం చేయకుండా, పెరుగుతున్న సంతానలేమి సమస్యల పరిష్కారానికి కూడా వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఇందులో భాగంగా ఆసక్తి ఉన్న గైనకాలజిస్టులను గుర్తించి, వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి, వారంలో కనీసం ఒకరోజు ప్రత్యేకంగా ఫర్టిలిటీ ఓపీ క్లినిక్ నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు.

**అవసరమైతేనే గాంధీ, పేట్లబుర్జుకు..**

జిల్లాల్లోని ఓపీ క్లినిక్‌లలో ప్రాథమిక చికిత్సలు, మందులు వాడినా ఫలితం లేకపోతే.. ఐవీఎఫ్, ఐయూఐ వంటి అధునాతన పద్ధతులు అవసరమని డాక్టర్లు భావిస్తేనే వారిని హైదరాబాద్ కు రిఫర్ చేస్తారు. దీని వల్ల హైదరాబాద్‌లోని సెంటర్లపై రోగుల ఒత్తిడి తగ్గుతుంది. ఫలితంగా నిజంగా ఐవీఎఫ్ అవసరమైన వారికి వేగంగా సేవలు అందుతాయి. గాంధీ, పెట్లబుర్జు ఐవీఎఫ్ సెంటర్లు ఇప్పటికే మంచి ఫలితాలు ఇస్తున్నాయి. ఇప్పటి వరకు 37,300 మందికి సేవలు అందించారు. 23 మందికి ప్రెగ్నెన్సీ కన్ఫమ్ అయిందని ఇటీవలే అధికారులు వెల్లడించారు. ఇదే స్ఫూర్తితో రెండో దశలో వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో పూర్తిస్థాయి ఐవీఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది. త్వరలోనే ఈ ప్రత్యేక ఓపీ సేవలు జిల్లాల్లో అందుబాటులోకి రానున్నాయి.

## ఫీజు బకాయిలు తక్షణమే చెల్లించాలి

- రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని గవర్నర్‌కు బీసీ జేఏసీ నేతల వినతి

**హైదరాబాద్, వెలుగు:** గత నాలుగేండ్లుగా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు బీసీ జేఏసీ నేతలు విజ్ఞప్తి చేశారు. పాత పద్ధతి ప్రకారమే ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని, నాలుగేండ్ల బకాయిలు రూ. 7 వేల కోట్లు తక్షణమే చెల్లించాలని కోరారు. శనివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బీసీ ప్రతినిధులు లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరి బాధాకరమన్నారు. ఒకవైపు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాక, ఇంకొక వైపు కళా శాల యజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వక, పరీక్షలు రాయనీయక, కోర్సు పూర్తి చేసినా ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు.

ఖైరతాబాద్‌లోని చింతల్‌బస్తీలో నిరాహార దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి



## రోస్టర్ విధానం సవరించే వరకు పోరాటం

- ఎస్సీ రిజర్వేషన్లు 18 శాతానికి పెంచాలి: మంత్రి వివేక్ వెంకటస్వామి

**పంజాగుట్ట, వెలుగు:** తనకు పదవుల కంటే మాలల హక్కులే ముఖ్యమని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. రోస్టర్ పాయింట్ల విధానాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ ఖైరతాబాద్‌లోని చింతల్‌బస్తీలో ది నేషనల్ అంబేద్కర్ సేన అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష శిబిరాన్ని మంత్రి శనివారం సందర్శించి, సంఘీభావం తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మాలలు ఐక్యంగా ఉద్యమించి తమ హక్కులు సాధించుకోవాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణ కారణంగా మాలలు అన్యాయానికి గురవుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. రోస్టర్ పాయింట్లు సవరించి, మాలలకు దక్కాల్సిన ఐదు శాతం రిజర్వేషన్లు సాధించేందుకు తాను పోరాటంలో ముందుంటానని భరోసా ఇచ్చారు. ఎస్సీ గ్రూప్3 లోని మాలలతో పాటు 25 ఉపకులాలకు మొదటి రోస్టర్ పాయింట్‌ను ప్రస్తుతం ఉన్న 22వ స్థానం నుంచి 16వ స్థానానికి మార్చాలన్నారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లను 15 శాతం నుంచి 18 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. మన్నె శ్రీధర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. నిరాహార దీక్షకు మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, మాల మహానాడు సీనియర్ నాయకులు రాజు వస్తాద్, మాల సంక్షేమ సంగం అధ్యక్షులు బత్తుల రాంప్రసాద్, శ్రీనివాస్ రావు, హైకోర్టు న్యాయవాది కవల్‌కుమార్ మద్దతు ప్రకటించారు. అంబేద్కర్ సేన నాయకులు తాలూకా రాజేశ్, కడారం యాదగిరి, శాస్త్రి ప్రవీణ్ కుమార్, గుమ్మల కమల్ కుమార్, చెట్లపల్లి అరుణ్ కుమార్, దేవదాస్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీధర్‌రావు నిరాహార దీక్ష భగ్నం

మన్నె శ్రీధర్‌రావు చేపట్టిన నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. శనివారం రాత్రి 8.45 గంటల సమయంలో పోలీసులు దీక్షా శిబిరంలో ఉన్న మన్నె శ్రీధర్ రావుతోపాటు అంబేద్కర్ సేన కార్యకర్తలను, ఆయన అనుచరులను బలవంతంగా వాహనాల్లో ఎక్కించి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు తోపులాట జరిగింది. ఈ క్రమంలో అక్కడున్న మహిళలు పోలీసులు వాహనాలు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్న పోలీసులు వారిని అడ్డు తొలగించి శ్రీధర్‌రావు తదితరులను సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

V6 NEWS వెలుగు
వెలుగు దినపత్రికపై మీ విలువైన అభిప్రాయాలు, ఫిర్యాదులు మరియు సూచనలు ఏవైనా ఉంటే ఇ-మెయిల్ ద్వారా తెలుపండి
E-Mail: contact@v6velugu.com

ఆదివారం | హైదరాబాద్
12.07.2026
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu
03

# రామగుండానికి కేంద్రం అన్యాయం

## ఈఎస్ఐ హాస్పిటల్, ఎయిర్‌పోర్టు రాకుండా బీజేపీ కుట్ర: పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ

- తాడిచర్ల 2 కోల్‌బ్లాక్ మా నిరంతర పోరాట ఫలితమే
- రాష్ట్ర కోల్ బ్లాక్‌లన్నీ వేలం లేకుండా సింగరేణికే ఇవ్వాలని కేంద్రానికి డిమాండ్



మంచిర్యాల జిల్లా తాండూర్‌లో ఓటర్లతో కలిసి 'సర్' ఫామ్‌ను బీఎల్‌ఓకు అందజేస్తున్న ఎంపీ వంశీకృష్ణ

**గోదావరిఖని, కోల్‌బెల్ట్/బెల్లంపల్లి/ఆసిఫాబాద్, వెలుగు:** పెద్దపల్లి జిల్లా రామగుండంలో 150 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి, ఎయిర్‌పోర్టు ఏర్పాటును బీజేపీ అడ్డుకుంటోందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆరోపించారు. ఆస్పత్రి ఏర్పాటుపై కేంద్రాన్ని పలుమార్లు కోరినా స్పందన లేదన్నారు. అంతర్గాంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ఫీజిబిలిటీ స్టడీ పూర్తయినా కేంద్రం నిర్ణయం తీసుకోవడం లేదని విమర్శించారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. గతంలో తెలంగాణకు రావాల్సిన సెమీ కండక్టర్ పరిశ్రమను ఏపీకి తరలించినట్లే, ఇప్పుడు ఈఎస్ఐ ఆస్పత్రి, ఎయిర్‌పోర్టు విషయంలోనూ కుట్ర జరుగుతోందని ఆరోపించారు. తాడిచర్ల 2 కోల్‌బ్లాక్‌ను సింగరేణికే కేటాయించడం తమ నిరంతర పోరాట ఫలితమేనని ఎంపీ చెప్పారు. ఈ బ్లాక్ ద్వారా ఏటా 60 లక్షల టన్నుల బొగ్గు తీయడంతో పాటు సుమారు వెయ్యి మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. తెలంగాణలోని అన్ని కోల్‌బ్లాక్‌లను వేలం లేకుండా సింగరేణికే కేటాయించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గతంలో బీఆర్ఎస్, ప్రస్తుత బీజేపీ ఎంపీలు ఈ అంశాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. సింగరేణి కార్మికుల పెర్క్స్‌పై ఆదాయపన్ను మినహాయింపు, రిటైర్డ్ కార్మికులకు కనీసం రూ.15 వేల పింఛన్ వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో రెండేండ్లలో వివిధ అభివృద్ధి పనులకు సుమారు రూ.8 వేల కోట్ల నిధులు తీసుకొచ్చామని చెప్పారు. రామగుండం-మణుగూరు రైల్వే లైన్, ధర్మపురి-చెన్నూరు రహదారి, పలు ఆర్‌ఓబీలు, ఎన్ఓబీలకు నిధులు మంజూరు చేయించామని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గుమ్మడి కుమారస్వామి, పి.మల్లికార్జున్, రాచకొండ కోటేశ్వర్లు, దుబాసి మల్లేష్, పాకాల గోవర్ధన్ రెడ్డి, కామ విజయ్, బొగే తిరుపతి, మల్లేశ్ యాదవ్, తిప్పారపు మధు, నరేందర్‌రెడ్డి, నర్సింగ్ దొర, గద్దం మధు, అనుమాస శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**అర్హుల ఓట్లు పోకుండా చూడాలి..**

ఓటరు జాబితా నుంచి అర్హుల పేర్లు తొలగిపోకుండా చూడాలని కాంగ్రెస్ శ్రేణులకు వంశీకృష్ణ సూచించారు. శనివారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని 13వ వార్డు, తాండూర్ మండలంలో పర్యటించి 'సర్' ప్రక్రియను పరిశీలించారు. సర్వే తీరు, ఓటర్ల వివరాలను పరిశీలించి స్వయంగా సర్ ఫారమ్ నింపారు. అనంతరం తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారికి పోలియో చుక్కలు వేశారు. ప్రజాస్వామ్యానికి ఓటే బలమని, ప్రతి అర్హుడికీ ఓటు హక్కు సురక్షితంగా ఉండేలా అందరూ బాధ్యత వహించాలని సూచించారు. సర్ ప్రక్రియ పారదర్శకంగా, న్యాయబద్ధంగా నిర్వహించాలని అధికారులను కోరారు. అంతకుముందు బెల్లంపల్లి పట్టణంలోని అండర్‌బ్రిడ్జిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీసీ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు బండి సదానందం యాదవ్, తాండూర్ కాంగ్రెస్ నాయకులు ఇప్పా, అబ్బు తదితరులు పాల్గొన్నారు.

**తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పూర్తి చేస్తాం..**

కాక వెంకటస్వామి కలల ప్రాజెక్టు అయిన తుమ్మిడిహెట్టి ప్రాణహిత ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతామని వంశీకృష్ణ స్పష్టం చేశారు. ఆసిఫాబాద్‌లోని ఒడ్డేపల్లి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సర్ అవగాహన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తుమ్మిడిహెట్టిని పక్కనపెట్టి కాళేశ్వరం ప్రాజెక్ట్ చేపట్టి లక్షల కోట్లు ఖర్చు చేసినా ఆశించిన ఫలితాలు రాలేదన్నారు. తుమ్మిడిహెట్టి ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఉత్తర తెలంగాణ రైతుల భవిష్యత్తు ఈ ప్రాజెక్టుతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. సర్ ప్రక్రియ ద్వారా కాంగ్రెస్ అనుకూల వర్గాల ఓట్లకు ముప్పు పొంచి ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బీఎల్ఏలు, పార్టీ నాయకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్, ఏఐసీసీ జాతీయ మహిళా కార్యదర్శి అదితి, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగా, డీసీసీ అధ్యక్షురాలు సుగుణ, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్యామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### తాడిచర్ల -2కు వెంటనే పర్యావరణ అనుమతులివ్వాలి



**జయశంకర్ భూపాలపల్లి/మల్హర్, వెలుగు:** తాడిచర్ల -2 బొగ్గు గనికి ఎలాంటి అడ్డంకులు సృష్టించకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే పర్యావరణ అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ఎంపీ వంశీకృష్ణ కోరారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్ల 2 బ్లాక్ ప్రాంతాన్ని సింగరేణి అధికారులతో కలిసి పరిశీలించారు. చాత్రాజ్‌పల్లికి చెందిన బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతో పాటు ఉద్యోగాలు ఇవ్వాలని సూచించారు. ప్రాజెక్టును రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకెళ్లాలని, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెంటనే అవసరమైన అనుమతులు ఇచ్చి మూడు నెలల్లో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రాజెక్టు అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డిని ఎంపీ ఆదేశించారు.

# తొమ్మిది నెలల్లో భూ రీసర్వే పూర్తి చేయాలి

- మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రీ-సర్వే పూర్తి చేయాలి
- సాదాబైనామా దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్లతో వీసీలో మంత్రి పొంగులేటి ఆదేశాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ఖమ్మం టౌన్, వెలుగు:** భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్రంలో ల్యాండ్ రీసర్వేను అత్యంత ప్రాధాన్యతగా చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కలెక్టర్లకు సూచించారు. భూముల రీసర్వే, భూ భారతి అమలు, సదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, డబుల్‌బెడ్రూమ్ ఇండ్ల పంపిణీ, స్కూల్ స్టూడెంట్లకు యూనిఫామ్‌ల అందజేత తదితర అంశాలపై మంత్రి, శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డీఎస్. లోకేశ్ కుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో అందుకోలేకపోయామని మంత్రి చెప్పారు. ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సా దాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి, హైకోర్టు సమస్య కూడా పరిష్కరించినప్పటికీ అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. ఇందుకు కారణాలేంటో గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూముల రీసర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇందు కోసం శిక్షణ పొందిన లైసెన్సుడ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్సుడ్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లైసెన్సుడ్‌సర్వేయర్లకు ఉద్యోగం లేదా రెగ్యులరైజేషన్ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీసర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి ములుగుమాడు గ్రామ రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారని గుర్తు చేశారు. తొలి విడత ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే చేపట్టినట్లు తెలిపారు. కలెక్టర్లు భూ రీసర్వేకు అవసరమైన సిబ్బంది, పరికరాలు, మౌళిక వసతులు సమకూర్చాలని ఆదేశించారు. ప్రతి నెలా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షిస్తామని, మార్చి2027 నాటికి మూడు విడతల్లో రీసర్వే పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

**లైసెన్స్ సర్వేయర్లకు ఎకరాకు రూ.60 చెల్లింపు**

రీసర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 చొప్పున మొత్తం రూ.60 అందజేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. చెల్లింపులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. విధుల్లో చేరని లైసెన్స్ సర్వేయర్లకు గడువిచ్చి, గడువులోగా చేరని వారి లైసెన్సులు రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. లైసెన్స్‌ఉన్న సర్వేయర్లకు బీమా, సామాజిక భద్రత కల్పించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఒక సర్వే నంబరులో కొంత భూమి మాత్రమే ప్రభుత్వ అవసరాలకు సేకరించినప్పటికీ మొత్తం భూమిని నిషేధిత జాబితాలో ఉంచడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

**సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరిస్తాం..**

సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించి నోటీసులు త్వరితగతిన జారీ చేయాలని సూచించారు. పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన 6,500 రెవెన్యూ సమస్యల్లో 98 శాతం సమస్యలకు భూ రీసర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు.

**రీసర్వే పూర్తయితే సాదాబైనామాల క్లియరెన్స్ ఈజీ: లోకేశ్‌కుమార్**

తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూ రీసర్వేను నవంబర్ లోపు పూర్తి చేయాలని, రెండో విడతలో మరో 70 గ్రామాల్లో (మార్చి2027)లోపు పూర్తి చేయాలని లోకేశ్ కుమార్ ఆదేశించారు. రీసర్వే పూర్తయితే సాదాబైనామా దరఖాస్తుల తిరస్కరణ గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో గుడిసెలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ఆగస్టు నాటికి రెండు లక్షల ఇండ్లు లక్ష్యాన్ని చేరుకోవాలని, పెండింగ్‌లో ఉన్న డబుల్‌బెడ్రూమ్ ఇండ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని సూచించారు. సెర్ప్ సీఈవో దివ్య మాట్లాడుతూ, ప్రభుత్వ స్కూళ్లు, గురుకులాల విద్యార్థుల యూనిఫామ్‌లన్నీ స్వయం సహాయక సంఘాల మహిళా టైలర్ల ద్వారానే కుట్టిస్తున్నామని తెలిపారు. జులై 15లోపు రెసిడెన్షియల్ బాలికలకు, జులై 30లోపు బాలురకు యూనిఫాంలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### మొదటి విడత ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తిచేయాలి..

మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇండ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్ధిదారులకు అందజేసి, మిగిలిన పనులకు నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. నిధులు విడుదలైనా పనులు చేపట్టని చోట్ల బాధ్యులైన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను వెంటనే పూర్తి చేసి గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, మొదటి విడతలో మంజూరు కాని అర్హుల ఇండ్లను కూడా రెండో విడతలో చేర్చి మంజూరు చేయాలని సూచించారు.

# సమర్థులైన యువతకే కాంగ్రెస్‌లో పెద్దపీట




- కాంగ్రెస్ ట్యాలెంట్ హంట్‌ను పరిశీలించిన పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్
- జీఎస్ రావు, గాయని జానకి మృతి పట్ల సంతాపం

**హైదరాబాద్, వెలుగు:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సమర్థులైన యువతను అధికార ప్రతినిధులుగా నియమించేందుకు పీసీసీ శనివారం 'ట్యాలెంట్ హంట్' ఇంటర్వ్యూలను ప్రారంభించింది. ఇందిరా భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్వయంగా హాజరై ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాల మేరకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రతిభావంతులైన, ముఖ్యంగా తటస్థ యువతకు ఇందులో ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇంటర్వ్యూలకు వచ్చిన అభ్యర్థుల విద్యా అర్హతలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పీసీసీ చీఫ్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సమాజ సేవ పట్ల నిబద్ధత, క్రమశిక్షణ, అంకితభావంతో ప్రజల కోసం పనిచేసే యువతకే కాంగ్రెస్ పార్టీలో పెద్దపీట వేస్తామని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డితో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఉమ్మడి ఏపీ పీసీసీ మాజీ అధ్యక్షుడిగా, కొవ్వూరు మాజీ ఎమ్మెల్యేగా సేవలందించిన సీనియర్ నేత జీఎస్ రావు మృతి పట్ల మహేశ్ గౌడ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బషీర్‌బాగ్‌లోని ఆయన నివాసానికి వెళ్లి, జీఎస్ రావు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే,దక్షిణ భారత స్వరకోకిల, ప్రముఖ గాయని ఎస్. జానకి మరణం పట్ల కూడా తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. గత ఆరు దశాబ్దాలుగా తన అద్భుతమైన మధుర గానంతో కోట్లాది మంది సంగీతాభిమానులను అలరించిన జానకమ్మ మృతి తీరని లోటని పేర్కొన్నారు.

# హైకమాండ్ ఆదేశిస్తే సిద్దిపేటలో హరీశ్‌పై పోటీకి సిద్ధం

- ఇక సంగారెడ్డిలో నేను పోటీ చేయను: జగ్గారెడ్డి




**హైదరాబాద్, వెలుగు:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశిస్తే.. సిద్దిపేటలో హరీశ్ రావుపై పోటీ చేసేందుకు తాను సిద్ధమని కాంగ్రెస్ సీనియర్ నేత, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన గాంధీ భవన్ లో మీడియాతో చిట్ చాట్ చేశారు. తాను సంగారెడ్డిలో మాత్రమే పోటీ చేయబోనని చెప్పానని.. ఇతర చోట పోటీచేయనని చెప్పలేదన్నారు. రాబోయే పదేండ్ల పాటు సంగారెడ్డిలో తన భార్య నిర్మలా జగ్గారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తారని, ఆ తర్వాత తన కొడుకా.. లేదంటే తన అనుచరులా.. అనేది చూడాలని అన్నారు. ఎంత పెద్దపులి అయినా సరే వేటగాడి వ్యూహానికి చిక్కి బోనులో పడాల్సిందేనని.. అలాగే, పార్టీలో ఎంత పెద్ద లీడర్ అయినా సరే తాను తోపును అంటే నడవదని, పార్టీ హైకమాండే తోపు అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ కాంగ్రెస్ లీడర్ అయినా సరే సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, పార్టీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ చెప్పినట్టు నడుచుకోవాల్సిందేనని, రాష్ట్ర కాంగ్రెస్ లో వారే తోపులని చెప్పారు. డి లిమిటేషన్ ను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ కు 117 సీట్లు వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని, రాష్ట్రంలో రెండోసారి కాంగ్రెస్ అధికారంలోకి రావడం కోసం ఆయన ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నారని అన్నారు. . ఎమ్మెల్యేల పనితీరుపై సీఎం రేవంత్ కు రిపోర్టులు వస్తాయని, ఆయన హెచ్చరించిన తర్వాతనైనా వారు తమ పనితీరును మార్చుకోవాలని, లేదంటే వచ్చే ఎన్నికల్లో పక్కనపెట్టే అధికారం రేవంత్ కు ఉంటుందన్నారు. పార్టీని కాదని, అంతా నేనే అని ఎవరైనా అనుకుంటే రాజకీయంగా కనుమరుగు కావాల్సిందేనని చెప్పారు. అధికార పార్టీపై బురదజల్లడమే ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ పని అని జగ్గారెడ్డి విమర్శించారు.

# ఆర్టీసీలో ఎన్నికలైన వెంటనే విలీన ప్రక్రియ



**జేఏసీ నేతలకు మరోసారి స్పష్టం చేసిన మంత్రి పొన్నం**

**హైదరాబాద్, వెలుగు:** ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలను త్వరగా పూర్తి చేయిస్తామని, ఆ వెంటనే విలీన ప్రక్రియను ప్రారంభిస్తామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఇందుకు సహకరించాలని ఆర్టీసీ జేఏసీ నేతలను కోరారు. జేఏసీ నేతలు ఈదురు వెంకన్న, థామస్ రెడ్డి, యాదగిరి, మౌలానా, యాదయ్య, బాబు, విశాల్, రాములు, ఇతర నేతలు శనివారం ఉదయం మినిస్టర్స్ క్వార్టర్‌లో మంత్రి పొన్నంను కలిశారు. ఈ సందర్భంగా ముందు విలీన ప్రక్రియ ప్రారంభించాలని, ఆ తర్వాతే ఎన్నికలు జరిపించాలని కోరారు. గుర్తింపు సంఘం ఎన్నికలను సాధ్యమైనంత త్వరగా జరిపించి, ఆ వెంటనే విలీన ప్రక్రియను చేపడ్తామని, ఈ విషయంలో తన మాటను నమ్మాలని జేఏసీ నేతలకు మంత్రి స్పష్టం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఇప్పటికే సమ్మె విరమణ ఒప్పందంలో భాగంగా ఒక్కో హామీని అమలు చేస్తున్నామన్నారు. విలీన ప్రక్రియను ప్రారంభించాలని మొండికిపోతే అటు గుర్తింపు సంఘం ఎన్నికలు జరగక, ఇటు విలీన ప్రక్రియ ప్రారంభం కాకా.. నష్టపోయేది ఆర్టీసీ కార్మికులేనన్నారు. తమ మాటను విశ్వసించి గుర్తింపు సంఘం ఎన్నికలకు సహకరించాలని కోరారు. దీంతో సంతృప్తి చెందిన జేఏసీ నేతలు మంత్రి ప్రకటనకు సంబంధించి మీడియాకు ఒక లేఖ విడుదల చేశారు. సమ్మె విరమణ సందర్భంలో జేఏసీ నేతలకు ఇచ్చిన ఇతర హామీలపై మంత్రితో చర్చించామన్నారు. 2021 వేతన సవరణ ఏరియర్స్ చెల్లింపులపై సానుకూలంగా స్పందించారని చెప్పారు. కార్మికుల నుంచి వసూలు అయిన డబ్బులను సమ్మె సందర్భంగా ఆత్మబలిదానం చేసుకున్న శంకర్ గౌడ్ కుటుంబానికి ఇవ్వాలని, ఆయన కుమారుడికి సూపర్ న్యూమరరీ ఉద్యోగం ఇవ్వాలని మంత్రిని కోరారు. వీటిపై కూడా మంత్రి సానుకూలంగా స్పందించారని జేఏసీ నేతలు చెప్పారు.

# పటాన్ చెరు - ఆదిలాబాద్ రైల్వే లైన్ మంజూరు చేయండి

- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు బీజేఎల్పీ నేత ఏలేటి వినతి

**హైదరాబాద్, వెలుగు:** పటాన్ చెరు (నాగలాపల్లి) – ఆదిలాబాద్ మధ్య కొత్త రైల్వే లైన్ నిర్మాణాన్ని మంజూరు చేయాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. శనివారం హైదరాబాద్ లో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను మహేశ్వర్ రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. పటాన్ చెరు నుంచి ఆదిలాబాద్ వరకు ప్రతిపాదించిన ఈ కొత్త లైన్‌కు సంబంధించి దక్షిణ మధ్య రైల్వే ఇప్పటికే ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తి చేసిందని, 136.503 కిలోమీటర్ల మేర డీపీఆర్ ను 2025 అక్టోబర్‌లోనే రైల్వే బోర్డుకు సమర్పించిందని గుర్తుచేశారు. నివేదిక అందించి ఏడాది కావస్తున్నా ఇంకా అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ ప్రాజెక్టును త్వరగా ఆమోదించి రైల్వే 'పింక్ బుక్'లో చేర్చాలని ఆయన కోరారు. ఈ కొత్త రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే నిర్మల్, ఆర్మూర్, ఆదిలాబాద్ ప్రాంతాల ఆర్థిక, పారిశ్రామిక స్థితిగతులు మారిపోతాయని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా నిర్మల్ కొయ్యబొమ్మలకు దేశవ్యాప్తంగా కొత్త మార్కెట్లు లభిస్తాయని, వ్యవసాయ రంగంలో వినూత్న ఆవిష్కరణలు చేస్తూ 'మినీ యూఎస్‌ఏ'గా పేరుగాంచిన అంకాపూర్ గ్రామానికి ఈ లైన్ ఎంతో మేలు చేస్తుందని వివరించారు. విద్యార్థులకు హైదరాబాద్, కరీంనగర్, నాందేడ్ యూనివర్సిటీలకు చేరుకోవడం సులభమవుతుందని తెలిపారు. అలాగే, పశ్చిమ తీరం నుంచి ఈశాన్య భారత్‌కు వెళ్లే సరుకు రవాణాకు ఇది అత్యంత తక్కువ దూరంతో కూడిన మార్గమవుతుందని, ప్రాంతీయ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
(తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ)
(గతంలో సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్)
కార్పొరేట్ కార్యాలయం, 6-1-50, మింట్ కాంపౌండ్ :: హైదరాబాద్-63 (తెలంగాణ రాష్ట్రం, ఇండియా)
CIN : U40109TG2000SGC034116
ఇ.-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన (పేపర్ నోటిఫికేషన్)
మేడ్చల్ మరియు RR జోన్ ఏరియాలలో 33KV మరియు 11KV కాంపాక్ట్ కమ్యూనికబుల్ ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్స్ (FPIs) సరఫరా, స్థాపన మరియు పనిచేయించుట కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై టెండర్లను విడుదలచేయుటకు TGSPDCL ఉద్దేశిస్తోంది. పై వాటి తదుపరి వివరాల కొరకు https://tgsouthernpower.org మరియు www.tender.telangana.gov.in వెబ్‌సైట్లను దర్శించగలరు. ఫోన్ : 040-23431321
సం/- చీఫ్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్)
DIPR R.O. No. 5931-PP/CL/ADVT/2026-27, Dt. 10-07-2026

SIR Special Intensive Revision
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ప్రత్యేక సమగ్ర సవరణ)
జూన్ 25, 2026 నుండి
ప్రధాన ఎన్నికల అధికారి తెలంగాణ
భారత ఎన్నికల సంఘం అర్హులైన పౌరులను ఓటర్ల జాబితాలో చేర్చి, అనర్హులు జాబితాలో లేకుండా ఉండేందుకు జూన్ 25, 2026 నుండి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) నిర్వహిస్తుంది.
ఎన్యూమరేషన్ ఫారంలో మీ వివరాలను తెలియజేయండి
— ఎన్యూమరేషన్ ఫారం —
జూన్ 25 నుండి జూలై 24, 2026 వరకు బిఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారంను పంపిణీ చేస్తారు. ఓటర్లకు సంబంధించిన వివరాలను నింపుటకు సహాయం చేసి ఎన్యూమరేషన్ ఫారంను తీసుకుంటారు.
ఫారంలో మీ ప్రస్తుత ఫోటో జతచేసి పుట్టినతేది, ఆధార్ నంబరు (Optional), ఫోన్ నంబరు, మీ తల్లిదండ్రుల మరియు మీ భాగస్వామి యొక్క వివరాలను తెలపండి.
2002లో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, జాబితాలోని మీ తల్లిదండ్రుల లేదా మీ గ్రాండ్‌పేరెంట్స్ యొక్క వివరాలను ఎన్యూమరేషన్ ఫారంలో నింపవలసి ఉంటుంది. వివరాలకు https://voters.eci.gov.in లాగిన్ అయి వివరాలను పొందవచ్చును.
ఆన్‌లైన్ అప్‌డేషన్: ఎన్యూమరేషన్ ఫారంను https://voters.eci.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొని, నింపిన ఫారంను (జూన్ 25 నుండి జూలై 24, 2026 లోగా) అప్‌లోడ్ చేసి ఎక్నాలెడ్జిమెంట్ బిఎల్‌ఓలకి అందజేయాలి.
Website: https://voters.eci.gov.in / https://ecinet.eci.gov.in / https://www.eci.gov.in
వివరాలకు: బూత్ లెవల్ ఆఫీసర్‌ను సంప్రదించండి (BLO)/AERO/ERO/DEO
CEOTelangana CEOTelangana ChiefElectoralOfficerTelangana CEO_Telangana
వివరాలకు, టోల్‌ఫ్రీ 1950 ఉ. 10:30 - సా.5:00 వరకు
మీ ఓటు.. మీ బాధ్యత
ఓటర్ల జాబితాలో మీ వివరాలను అప్‌డేట్ చేసుకోండి - పటిష్టమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి




# అర్ధరాత్రి నరమేధం

(మొదటి పేజీ తరువాయి)




నిందితుడు ఉపయోగించిన కారు, కత్తి



బాధితురాలి అక్క

అరగంట వ్యవధిలో ఆరుగురిని అతి కిరాతంగా చంపి జాడలేకుండా పోయిన ఆ ఉన్మాది కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. షాబాద్ మండలం దైవాలగూడలో జరిగిన ఊచకోత.. స్థానికంగా తీవ్ర భయాందోళన రేకెత్తించింది. పోక్సో కేసులో పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే నిందితుడు బయట తిరుగుతూ 6 హత్యలకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ స్థానికులు ఆందోళనకు దిగారు. దీంతో చేవెళ్ల -షాద్ నగర్ హైవేపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. ఆగ్రహంతో ఉన్న జనం.. ఘటనాస్థలానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్యపై దాడికి యత్నించారు. దీంతో కలెక్టర్ స్వయంగా రంగంలోకి దిగి, బాధితులకు నచ్చజెప్పారు. కాగా, పోక్సో కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్ఐ రమేశ్‌ను ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్‌జోషి సస్పెండ్ చేశారు. సీఐ కాంతారెడ్డికి చార్జ్‌మెమో ఇచ్చారు.

**సైకో రాజ్‌కుమార్ ప్రేమ పెళ్లి**

దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్‌కుమార్(29) ఇంటర్ వరకు చదువుకున్నాడు. మొదటి నుంచి జులాయిగా తిరిగేవాడు. ఈ క్రమంలోనే తమ ఇంటి సమీపంలోని యువతి సరిత(35)తో పరిచయం ఏర్పడింది. ఆమెను 2018 లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. తర్వాత దైవాలగూడ నుంచి షాబాద్‌కు మకాం మార్చాడు. పీఆర్ఆర్ స్టేడియం సమీపంలో ఓ ఇంటిని కొనుగోలు చేసి సరితతో కలిసి అక్కడే నివాసం ఉంటున్నాడు. వీరికి పరీక్షిత్ (4), దైవీక్షిత్ (2) ఇద్దరు కుమారులు. బీఈడీ పూర్తిచేసిన సరిత టెట్‌కు సిద్ధం అవుతోంది. కాగా, రాజ్‌కుమార్ ఇంటి పక్కనే ఓ మైనర్ బాలిక కుటుంబం నివాసం ఉంటోంది. తండ్రి కొంత కాలం క్రితం అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా తల్లి లక్ష్మి(45), నాయనమ్మ రుక్కమ్మ(65), మానసిక వైకల్యం కలిగిన అక్కతో కలిసి బాలిక నివాసం ఉంటోంది. శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది.

**లైంగిక వేధింపులు.. పోక్సో కేసులో బెయిల్**

పోలీసుల ప్రకారం.. ఇరుగుపొరుగున ఉండడంతో రాజ్‌కుమార్ , బాలిక కుటుంబాలకు పరిచయం ఏర్పడింది. అప్పటికే చెడు వ్యసనాలకు బానిసైన రాజ్‌కుమార్ బాలికను లైంగికంగా వేధించడం మొదలు పెట్టాడు. ఆ కుటుంబం కదలికలను గుర్తించేందుకు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నాడు. బాలిక కాలేజీకి వెళ్తున్న సమయంలో వెంబడించేవాడు. అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. విషయం రాజ్‌కుమార్ భార్యకు తెలియడంతో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. కాగా, రాజ్‌కుమార్ భూమి అమ్మిన పైసలు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పెట్టి రూ.2.5 కోట్లు నష్టపోయాడు. లక్షల్లో అప్పులు చేశాడు. దీంతో భార్య సరితతో గొడవలు తీవ్రం అయ్యాయి. ఈ క్రమంలోనే తన పేరిట ఉన్న 3 ఎకరాల్లో ఎకరా అమ్మేశారు. దీంతో కోటిన్నర రాజ్‌కుమార్ చేతికి వచ్చింది. ఆ తర్వాత విచ్చలవిడిగా ఖర్చు పెట్టడంతోపాటు బాలికపై వేధింపులు తీవ్రతరం చేశాడు. మే 16న శంషాబాద్‌లోని బాలిక కాలేజీకి వెళ్లి అమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక తల్లి షాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

**అరెస్ట్ చేయకుండా పోలీసుల నిర్లక్ష్యం..**

బాలిక తల్లి ఫిర్యాదుతో పోలీసులు 78,351(2) బీఎన్ఎస్‌తో పాటు పోక్సో చట్టంలోని 11 రెడ్ విత్ 12 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ సెక్షన్లన్నీ ఏడేండ్లలోపు శిక్ష పడేవే కావడంతో రాజ్‌కుమార్ తన అన్న సహకారంతో హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నాడు. పోక్సో కేసు నమోదైన తర్వాత రాజ్‌కుమార్ బాలిక కుటుంబాన్ని మరింత వేధించసాగాడు. ఈ క్రమంలో బాలిక తల్లి మరోసారి ఫిర్యాదు చేయడంతో రాజ్‌కుమార్‌ను తన సొంతూరు దైవాలగూడకు వెళ్లిపోవాలని పోలీసులు సూచించారు. దీంతో గత 2 నెలలుగా రాజ్‌కుమార్ తన భార్య, పిల్లలతో సహా దైవాలగూడలోనే నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో భార్యతో విభేదాలు తీవ్రం కావడం, బాలిక తల్లి తనపై పోక్సో కేసు పెట్టడం వల్లే ఇదంతా జరుగుతోందన్న కక్షతో అవకాశం కోసం ఎదురుచూశాడు. బాలికతోపాటు ఆమె తల్లిని చంపుతానని బెదిరించడం మొదలు పెట్టాడు. బాలిక తండ్రిని కూడా తనే చంపానని భయాందోళనకు గురిచేశాడు. ఇలావారం రోజులుగా బాలిక కుటుంబంతో పాటు భార్యను హతమార్చేందుకు పక్కా ప్లాన్ రెడీ చేసుకున్నాడు.

**అరగంటలో ఆరు హత్యలు చేసి..**

శుక్రవారం రాత్రి సెల్ఫ్ డ్రైవ్ కారు తీసుకున్నాడు. రాత్రి 11.10 గంటలకు బాలిక ఇంటికి వచ్చాడు. గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించాడు. తలుపు కొట్టడంతో బాలిక తల్లి డోర్ ఓపెన్ చేసింది. బాలికను తనతో లాక్కెళ్లే ప్రయత్నం చేయడంతో తల్లి అడ్డుపడింది. దీంతో తన చేతిలో కత్తితో కడుపు, ఛాతిలో ఆరు పోట్లు పొడిచాడు. నిద్రిస్తున్న బాలిక నాయనమ్మ రుక్కమ్మను పొడిచి చంపాడు. అరిస్తే చంపేస్తానని బెదిరిస్తూ.. బాలికను బలవంతంగా ఇంటి నుంచి బయటకు తీసుకెళ్లాడు. సమీపంలోని అఖిల్‌సాగర్ చెరువు వద్ద ఆమె గొంతు కోసి దారుణంగా హతమార్చాడు. అనంతరం దైవాలగూడలోని తన ఇంటికి వెళ్లాడు. తలుపు తట్టడంతో భార్య డోర్ ఓపెన్ చేసింది. దీంతో ఆమెపై దాడి చేసి కడుపులో బలంగా మూడు పోట్లు పొడిచాడు. అరవకుండా గొంతుకోశాడు. పక్కనే బెడ్‌పై నిద్రిస్తున్న పరీక్షిత్, దైవీక్షిత్ గొంతులు కోశాడు. ఇలా రాత్రి 11.10 గంటల నుంచి 11.45 గంటల మధ్య సమయంలో కేవలం అరగంట వ్యవధిలో ఆరు ప్రాణాలను తీశాడు.

**ఆరుగురిని చంపాను.. నేనూ చస్తాను..**

**తండ్రికి రాజ్‌కుమార్ ఫోన్**

ఆరు హత్యలు చేసిన అనంతరం 11.50 గంటల సమయంలో తండ్రి అరుణ్‌కుమార్‌కు ఫోన్ చేశాడు. "సరితతోపాటు ఆరుగురిని చంపాను.. నేను కూడా చనిపోతున్నా. మీరు అక్కడి నుంచి వెళ్లిపోండి"అని చెప్పాడు. దీంతో అరుణ్‌కుమార్ ఒక్కసారిగా హడలిపోయాడు. వెంటనే బాలిక ఇంట్లోకి వెళ్లి చూశాడు. అక్కడ బాలిక తల్లి లక్ష్మీ, నాయనమ్మ రుక్కమ్మ రక్తపు మడుగులో చనిపోయి కనిపించారు. వెంటనే తన భార్యతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. అదే రూమ్‌లో ప్రాణాలతో మిగిలి ఉన్న బాలిక అక్కను అక్కడి నుంచి తరలించారు. మృతదేహాలను అక్కడి నుంచి ఉస్మానియా హాస్పిటల్‌కు పంపించారు. అనంతరం దైవాలగూడలోని రాజ్‌కుమార్ ఇంటికి వెళ్లారు. చిన్నారులతోపాటు రక్తపు మడుగులో ఉన్న సరిత డెడ్‌బాడీలను గుర్తించారు. రాజ్‌కుమార్ తీసుకెళ్లిన బాలిక కోసం వెతికారు. సమీపంలోని చెరువు వద్ద పడి ఉన్న ఆమె మృతదేహాన్ని గుర్తించారు. అక్కడే కత్తిని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న రాజ్‌కుమార్ కోసం 7 స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. రాజ్‌కుమార్ పారిపోయిన కారును కొత్తూరు తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలోని గూడూరుకు వెళ్లే దారిలో గుర్తించారు.

**పోలీసులే కాపాడుతున్నారు**

రాజ్‌కుమార్‌ను పోలీసులే కాపాడుతున్నారు. నా మేనకోడలిని లైంగికంగా వేధించాడని ఫిర్యాదు చేసినా పోలీసులు సీరియస్‌గా తీసుకోలేదు. ఈ ఏడాది మార్చి 4న బాలిక తండ్రి మల్లేశ్ చనిపోయాడు. "మల్లేశ్‌ను చంపినట్టే మిమ్మల్నీ చంపుతాను' అని రాజ్‌కుమార్ మా కుటుంబాన్ని బెదిరించాడు. ఈ కేసులో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దర్యాప్తును తప్పుదోవ పట్టించారు. ఎస్ఐ రమేశ్, సీఐ కాంతారెడ్డి కేసును విచారించలేదు. పోలీసులపై చర్యలు తీసుకొని, మా కుటుంబానికి న్యాయం చేయాలి.

**- రాజు, బాలిక మేనమామ**

**బాధిత కుటుంబాలను ఆదుకుంటం**

బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటాం. ఇందిరమ్మ ఇల్లుతో పాటు రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందిస్తాం. బాధితులు ఇచ్చిన కంప్లైంట్‌లో ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటాం. సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటాం. బాధితులకు పూర్తి న్యాయం చేస్తాం.

**- నారాయణరెడ్డి, కలెక్టర్, రంగారెడ్డి జిల్లా**

**లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేశాం**

రాజ్‌కుమార్ రాత్రి 11 నుంచి 11:30 గంటల సమయంలో ఆరుగురిని హతమార్చాడు. 11.51 గంటలకు తండ్రికి ఫోన్ చేసి తానూ ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. కారును గుర్తించాం. రాజ్‌కుమార్‌పై లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేశాం. 7 ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నాం. అతని ఆచూకీ తెలిపిన వారికి రూ.2 లక్షలు రివార్డ్ అందిస్తాం. రాజ్‌కుమార్‌పై మే 16న కేసు నమోదైంది. పోక్సో కేసులో ఏడేండ్లలోపు జైలు శిక్ష ఉండటంతో అతనికి ముందస్తు బెయిల్ లభించింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిపై చర్యలు తీసుకున్నాం.

**- తరుణ్ జోషి, సీపీ, ఫ్యూచర్ సిటీ**

# పోలీసుల నిర్లక్ష్యం వల్లే..

- **షాబాద్ సీఐ, ఎస్ఐలపై మానవ హక్కుల కమిషన్ సీరియస్.. కేసు నమోదు**

**పద్మారావునగర్, వెలుగు:** పోక్సో బాధితురాలితో పాటు మొత్తం ఆరుగురిని ఓ కిరాతకుడు పొట్టనబెట్టుకున్న ఉదంతంలో పోలీసుల వైఫల్యంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) తీవ్రంగా స్పందించింది. బాధితుల ఫిర్యాదులను బేఖాతరు చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించిన షాబాద్ సీఐ కాంతారెడ్డి, ఎస్ఐ రమేశ్‌పై కమిషన్ కేసు నమోదు చేసింది. తెలంగాణ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మనేని సాగించిన న్యాయపోరాటంతో ఈ వ్యవహారం వెలుగుచూసింది. గతంలో బాధితురాలి తండ్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినప్పుడే బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే నాటి షాబాద్ సీఐ కాంతారెడ్డి, ఎస్ఐ రమేశ్ ఆ ఫిర్యాదును పూర్తిగా పక్కనబెట్టి, ఘోరమైన నిర్లక్ష్యం వహించారని న్యాయవాది రామారావు ఇమ్మనేని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. పోలీసుల ఈ ఉదాసీనతే నిందితుడికి ఆసరాగా మారి, చివరకు ఆరుగురి ప్రాణాలు పోవడానికి కారణమైందని ఆయన కమిషన్ ముందు బలంగా వాదించారు. ఈ నేపథ్యంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సదరు పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని న్యాయవాది రామారావు డిమాండ్ చేశారు. నిందితుడికి కోర్టు ద్వారా కఠిన శిక్ష పడేలా చూడటంతో పాటు బాధితురాలి కుటుంబంలో బతికి ఉన్న మిగిలిన సభ్యులకు తక్షణమే పోలీస్ రక్షణ కల్పించాలని కోరారు. అలాగే, బాధితుల కుటుంబానికి ప్రభుత్వం తరపున తగిన నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే

- **హోంమంత్రిగా, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలం.. తక్షణమే రాజీనామా చేయాలి: హరీశ్ రావు**



**హైదరాబాద్/సిద్దిపేట రూరల్, వెలుగు:** షాబాద్‌లో జరిగిన ఆరు హత్యలు ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. హోంమంత్రిగా, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని, ఆయన తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్‌చేశారు. శనివారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. మే 16న మైనర్ బాలికను వేధించిన నిందితుడిని అరెస్ట్ చేయడంలో పోలీసులు ఘోరంగా విఫలమయ్యారని, అవినీతికి, రాజకీయ ఒత్తిళ్లకు లొంగిపోయి, నిందితుడికి కేవలం ఏడేండ్లలోపు శిక్షపడే సాధారణ సెక్షన్లు పెట్టి కాపాడే ప్రయత్నం చేశారని ఆరోపించారు. నెలరోజుల పాటు అతన్ని అరెస్ట్ చేయకుండా వదిలేయడంతో.. అతను కోర్టు నుంచి యాంటిసిపేటరీ బెయిల్ తెచ్చుకుని ఆ కుటుంబాన్నే అంతం చేశాడన్నారు. తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని, ఆ బాధిత కుటుంబం పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగి మొత్తుకున్నా పోలీసులు పట్టించుకోలేదని.. సరైన సమయంలో ఏసీపీ, డీసీపీ, కమిషనర్ స్థాయిలో సమీక్ష చేసి, కఠిన సెక్షన్లు పెట్టి ఉంటే ఈరోజు ఈ ఆరు హత్యలు జరిగి ఉండేవి కావన్నారు. ఆ కుటుంబంలో కేవలం ఒకే ఒక అమ్మాయి మిగిలిందని, ఆ అమ్మాయికి మాటలు రావు, చెవులు వినబడవు, నడవలేని వికలాంగురాలని, ఆమె పేరు మీద ప్రభుత్వం వెంటనే రూ. కోటి రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని, ఆ అమ్మాయిని పెంచి, సంరక్షించే పూర్తి బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**సీఎం డైవర్షన్ డ్రామాలు**

ప్రభుత్వ పాలనా వైఫల్యాలు బయటపడ్డప్పుడు ప్రజల దృష్టిని మళ్లించడానికి డైవర్షన్ డ్రామాలకు తెరలేపడం సీఎం రేవంత్‌రెడ్డికి పరిపాటిగా మారిందని హరీశ్‌రావు ఆరోపించారు. శనివారం మీడియా సమావేశంలో సీఎం మాట్లాడిన తీరు అత్యంత జుగుప్సాకరంగా ఉందని విమర్శించారు. రైతులు నీళ్లు అడిగితే, రిటైర్డ్ ఇంజనీర్లు నీళ్లు ఇవ్వమని చెప్పితే.. ప్రతిపక్షాల రక్తాన్ని పంటలపై చల్లాలి అనడం, బెల్టుతో కొట్టాలి అని మాట్లాడటం దారుణమని మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఇలాంటి వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి.. రాష్ట్ర ప్రజలకు, రైతులకు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు.

## పెండింగ్ అప్పీళ్లను త్వరగా పరిష్కరించండి

- **సమాచార కమిషన్‌కు హైకోర్టు ఆదేశం**
- **మూడు నెలల్లోపు విచారణ పూర్తి చేయాలని సూచన**

**హైదరాబాద్, వెలుగు:** ఒకే వ్యక్తికి సంబంధించిన 404 ఆర్టీఐ పెండింగ్ అప్పీళ్లను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సమాచార కమిషన్‌ను హైకోర్టు ఆదేశించింది. ప్రతి అప్పీల్‌కు విడివిడిగా నోటీసులు జారీ చేయాలని పేర్కొంది. ఈ కేసుల విచారణను మూడు నెలల్లోపు పూర్తి చేయాలని స్పష్టం చేసింది. జన తెలంగాణ రైట్స్ సొసైటీ కార్యదర్శి వి.శ్యామ్ దాఖలు చేసిన 404 ఆర్టీఐ అప్పీళ్లపై సమాచార కమిషన్ ఒకేసారి నోటీసులు జారీ చేసి, ఉమ్మడిగా విచారణ చేపట్టడాన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. గతంలోనే ప్రతి అప్పీల్‌ను విడివిడిగా విచారించాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ, ఆ ఉత్తర్వులు అమలు కాలేదని పేర్కొంటూ ఆయన మరోసారి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ సూరేపల్లి నంద విచారించారు. కేసులవారీగా తిరిగి నోటీసులు జారీ చేసి, మూడు నెల్లల్లోపు అన్ని అప్పీళ్లను పరిష్కరించాలని సమాచార కమిషన్‌ను ఆదేశించారు. అవసరమైతే ఆన్‌లైన్ విధానంలో కూడా విచారణ చేపట్టాలని సూచించారు. దీంతో ఈ పిటిషన్‌పై విచారణను ముగిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

## రాష్ట్రంలో యూరియా స్టాక్ 74.29 లక్షల బస్తాలు

- **వ్యవసాయ శాఖ వెల్లడి**

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలో యూరియా నిల్వలపై వ్యవసాయశాఖ బులెటిన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా స్టాక్ 74.29 లక్షల బస్తాలు ఉన్నట్లు స్పష్టం చేసింది. రీటెయిలర్స్ వద్ద 15.65 లక్షల బస్తాలు అందుబాటులో ఉండగా, సహకార సంఘాల వద్ద 6.50 లక్షల బస్తాలు నిల్వలు ఉన్నాయి. గోదాముల్లో 1.98 లక్షల యూరియా బస్తాల నిల్వలు ఉన్నట్లు స్పష్టం చేసింది. నోడల్ ఏజెన్సీ మార్క్‌ఫెడ్ వద్ద అత్యధికంగా 50.16 లక్షల యూరియా బస్తాలు ఉన్నట్లు వెల్లడించింది. ఇప్పటి వరకు 75.03 లక్షల బస్తాలు బుక్ చేసుకోగా వాటిలో 67.89 లక్షల బస్తాలను ఇప్పటికే కొనుగోలు చేసినట్టు పేర్కొంది. మరో 21.70 లక్షల యూరియా బస్తాలను యూరియా యాప్ ద్వారా రైతులు తాజాగా బుక్ చేసుకున్నట్లు తెలిపింది. యూరియా యాప్ ద్వారా మొత్తం 90.48 శాతం రైతులు యూరియా కొనుగోలు చేసినట్టు వివరించింది.

# గాన కోకిల జానకి ఇకలేరు

## 88 ఏళ్ల వయసులో అనారోగ్య సమస్యలతో కన్నుమూత



**మైసూర్:** దక్షిణ భారత సినీ సంగీత ప్రపంచంలో తన అమృత గాత్రంతో కోట్లాది మంది హృదయాలను రంజింపజేసిన ప్రముఖ నేపథ్య గాయని, గానకోకిల ఎస్. జానకి శనివారం ఉదయం కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమె.. మైసూర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారని కుటుంబసభ్యులు ప్రకటించారు. ఎస్. జానకి వయసు 88 సంవత్సరాలు. నిన్న రాత్రి ఆమెకు శ్వాసకోస సమస్యలు తలెత్తడంతో ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మరణించారని ఎస్. జానకి మనవరాలు అప్సరా వైద్యుల వెల్లడించారు. ఎస్(శిష్లా) జానకి 1938 ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పల్లపట్లలో జన్మించారు. ఆమెకు తెలంగాణతోనూ ప్రత్యేక అనుబంధం ఉంది. ఆమె పుట్టింది ఏపీలో అయినా, పెరిగింది మాత్రం తెలంగాణలోనే. ఉద్యోగం కోసం తండ్రి సిరిసిల్లకు రావడంతో జానకి బాల్యం, విద్యాభ్యాసం ఇక్కడే సాగింది. బాల్యం నుంచే సంగీతం పట్ల ఆసక్తి ఉన్న ఆమె.. మూడేండ్ల వయసులోనే సినిమా పాటలను అనుకరిస్తూ ముద్దుముద్దుగా పాడేవారు. పదేండ్ల వయసులో నాదస్వర విద్యాంసుడు పైడిస్వామి వద్ద సంగీతంలో ప్రాథమిక శిక్షణ పొందారు. తర్వాత సినిమాల్లో పాడటం కోసం మద్రాస్ వెళ్లారు. ఎస్. జానకి 1957లో తన 19వ ఏట 'విధియిన్ విలయాట్టు' అనే తమిళ చిత్రం ద్వారా గాయనిగా ప్రస్థానాన్ని ప్రారంభించారు. తన మధురమైన గాత్రంతో 48 వేల పాటలు పాడిన ఆమె 'దక్షిణ భారత నైటింగేల్'గా ప్రసిద్ధి చెందారు. ఆమెను శిష్యులు, అభిమానులు ప్రేమగా 'జానకి అమ్మ' అని పిలుచుకునేవారు. 1997లో తన భర్త వి. రాంప్రసాద్ మరణించినప్పటి నుంచి కేవలం తెల్లటి చీరలు కట్టుకోవడం, సాధారణ వేషధారణలో ఉండటం అనుసరించారు. కాగా, ఆమె కుమారుడు మురళీ కృష్ణ ఈ ఏడాది జనవరి 22న కన్నుమూశారు.

**మైసూర్‌లో అంత్యక్రియలు**

ఎస్. జానకి మృతిపై కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ 'ఎక్స్' వేదికగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "జానకి అమ్మ తన బంగారు స్వరంతో కోట్లాది మంది హృదయాలలో, ఇళ్లలో స్థానం సంపాదించుకున్నారు. ఈ బహుభాషా గాన దిగ్గజం మరణంతో సంగీత ప్రపంచం మూగబోయింది. ఎంతో మంది గాయకులను ప్రోత్సహించి, తీర్చిదిద్దిన గురువు, సరళత్వానికి నిలువెత్తు రూపమైన జానకి అమ్మ అసమాన స్వరం కర్నాటక సాంస్కృతిక వారసత్వంలో ఎప్పటికీ అమరంగా ఉంటుంది "అని డీకే కొనియాడారు. జానకి అంత్యక్రియలను పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం తరపున హాజరుకావాల్సిందిగా మంత్రి యతీంద్ర సిద్ధరామయ్యను నియమించారు. జానకి భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఆదివారం ఉదయం మైసూర్ లోని మహారాజా కాలేజీ మైదానంలో ఉంచనున్నట్లు యతీంద్ర సిద్ధరామయ్య తెలిపారు. తన అంతిమ సంస్కారాలు మైసూర్‌లోనే జరగాలని జానకి కోరుకున్నారని, కుటుంబసభ్యుల నిర్ణయం ప్రకారం మైసూర్ లోని కనియనహుండి గ్రామంలో ఉన్న ఒక ఫామ్‌హౌస్‌లో అంత్యక్రియలు జరుగుతాయని, దానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కాగా, జానకి మరణవార్త తెలియగానే మంత్రి యతీంద్ర సిద్ధరామయ్య, మాజీ ఎంపీ ప్రతాప్ సింహా, జేడీఎస్ ఎమ్మెల్యే జీటీ దేవేగౌడ సహా భారీ సంఖ్యలో అభిమానులు, ప్రజలు ఆసుపత్రికి చేరుకున్నారు.

**ప్రముఖుల సంతాపం**

ఎస్. జానకి మృతి పట్ల కర్నాటక సీఎం డీకేతోపాటు ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, జోసెఫ్ విజయ్, వీడీ సతీశన్, తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి సంతాపం ప్రకటించారు. జానకి మరణం పట్ల మెగా స్టార్ చిరంజీవి, కమల్ హాసన్, ఇతర సినీ రంగ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దక్షిణాది భాషల్లో వేలాది పాటలు పాడిన ఆమె చిరకాలం చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు.

**20 భాషల్లో 48 వేలకుపైగా పాటలు**

ఆరు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో జానకి తన అద్భుత స్వర వైవిధ్యంతో కన్నడ, తమిళం, తెలుగు, మలయాళం వంటి దక్షిణాది భాషలతో పాటు హిందీ, ఒడియా, తులు, ఉర్దూ, పంజాబీ, బెంగాలీ సహా దాదాపు 20 భారతీయ భాషల్లో 48 వేలకు పైగా పాటలను పాడారు. ఇతర భాషల్లో ఎంత పాపులర్ అయినప్పటికీ, ఆమె తన కెరీర్‌లో అత్యధిక పాటలు కన్నడలోనే పాడారు. కర్నాటక అభిమానులు ఆమెను 'గాన కోకిలె' అని పిలుచుకునేవారు. ఆమె ఇంగ్లీష్, జపనీస్, జర్మన్, సింహళ భాషల్లోనూ పాడటం విశేషం. పీబీ శ్రీనివాస్, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ రాజ్‌కుమార్ వంటి దిగ్గజాలతో ఆమె పాడిన డ్యూయెట్లు ఎప్పటికీ నిలిచిపోయే హిట్ సాంగ్స్‌గా మారాయి.

# సీఎంతో ఎమిరేట్స్ వైస్ ప్రెసిడెంట్ భేటీ

- **హైదరాబాద్ నుంచి ఎమిరేట్స్ ఏ-380 సర్వీసులకు సుముఖత**



**హైదరాబాద్, వెలుగు:** భారత్‌లో ఎమిరేట్స్ వైమానిక సంస్థ తన 25 వసంతాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా సంస్థ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సర్హాన్ శనివారం సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. హైదరాబాద్ మహానగరం నుంచి ప్రపంచ ప్రసిద్ధి గాంచిన 'ఎమిరేట్స్ ఏ380' భారీ విమాన సర్వీసులను ప్రారంభించేందుకు సంస్థ వైస్ ప్రెసిడెంట్ సంపూర్ణ సుముఖత వ్యక్తం చేశారు. దీనికి సీఎం స్పందిస్తూ..హైదరాబాద్ నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని సర్హాన్ ను కోరారు. అంతేకాకుండా రాష్ట్రంలో త్వరలో రాబోతున్న మరో రెండు కొత్త విమానాశ్రయాల్లో ఎమిరేట్స్ సంస్థ తన ఎమ్ఆర్ఓ ( మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్) ఆపరేషన్స్ ప్రారంభించాలని సీఎం ప్రతిపాదించారు. ఎమిరేట్స్ సంస్థ విస్తరణకు, సర్వీసుల నిర్వహణకు కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతులు, సౌకర్యాలను కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అలాగే, గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీలో తెలంగాణ క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించేందుకు ఎమిరేట్స్ సంస్థ స్పాన్సర్‌షిప్‌తో ముందుకు రావాలని కోరారు. ముఖ్యమంత్రి చేసిన ప్రతిపాదనలకు మహమ్మద్ సర్హాన్ సానుకూలంగా స్పందించారు.

## రేపు హైదరాబాద్‌కు ఎన్‌సీఎస్‌సీ చైర్మన్ రాక

**హైదరాబాద్, వెలుగు:** రేపు హైదరాబాద్‌కు జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిశోర్ మక్వానా రానున్నారు. ఈ నెల 13న హైదరాబాద్‌లోని కవాడిగూడ సీజీజీ టవర్స్ లో రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఆఫీస్ ను ఆయన ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, వివిధ షెడ్యూల్డ్ కుల సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నారు. ఇందులో భాగంగా జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ ప్రజలను స్వయంగా కలిసి మాట్లాడుతారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో రివ్యూ చేపట్టనున్నారు. రాష్ట్రంలో షెడ్యూల్ కులాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై అధికారులతో చర్చిస్తారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అధికారులను అడిగి తెలుసుకోనున్నారు.

# మేడిగడ్డను ముట్టుకోకుండానే.. కన్నెపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేయొచ్చు

## 96 మీటర్ల ఎత్తులో నీళ్లు పోతున్నయ్: కేటీఆర్



**హైదరాబాద్, వెలుగు:** మేడిగడ్డలో నీళ్లు నిల్వచేయకుండానే.. ఆ బ్యారేజీని ముట్టుకోకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయొచ్చని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కన్నెపల్లి వద్ద 93 మీటర్ల ఎత్తులో నీళ్లుంటే నీటిని లిఫ్ట్ చేయొచ్చని రిటైర్డ్ ఇంజినీర్లు చెప్పారని, కన్నెపల్లి వద్ద ప్రస్తుతం 96 మీటర్ల ఎత్తులో నీళ్లు పోతున్నాయని అన్నారు. ఇంకో వంద రోజుల పాటు వరద ఉంటుందని, కాబట్టి రోజూ 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీలు లిఫ్ట్ చేయొచ్చని తెలిపారు. శనివారం తెలంగాణభవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. అన్నారం, సుందిళ్లలో ఏర్పడిన బుంగలకు గ్రౌటింగ్ చేశారని అధికారులే చెప్తున్నారని, అన్నారం 5.1, సుందిళ్లలో 3.7 టీఎంసీలు నింపొచ్చని అంటున్నారని పేర్కొన్నారు. అక్కడ నీళ్లతో ఎల్లంపల్లికి నీటిని తీసుకెళ్లొచ్చన్నారు. పైన గోదావరిలో నీళ్లు లేకున్నా.. ప్రాణహిత నుంచి వరద వస్తున్నదని తెలిపారు. నీటిని లిఫ్ట్ చేయకపోవడం వల్ల రోజూ 9 టీఎంసీలు వృథాగా కిందకు పోతున్నాయన్నారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ కక్షతో తెచ్చిన కరువు అని మండిపడ్డారు. దేవాదులలో ఫుల్ కెపాసిటీతో మోటార్లను నడిపే అవకాశం ఉన్నా.. రెండు పంపులే నడుపుతున్నారని చెప్పారు. రైతులు మొగులుదిక్కు.. కన్నెపల్లి దిక్కు చూస్తున్నారని వ్యాఖ్యానించారు. పంపులు ఆన్ చేయకుంటే రేవంత్‌రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోతారన్నారు. బ్యారేజీల్లో నీళ్లు నింపాలని ఎవరు అడిగారని, ఎత్తిపోయాలని చెబుతున్నామని మంత్రి ఉత్తమ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

**కరువు వచ్చినప్పుడే కాళేశ్వరం విలువ తెలుస్తది..**

కరువు వచ్చినప్పుడే కాళేశ్వరం ప్రాజెక్టు విలువ తెలుస్తుందని కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం కూలేశ్వరం అని చెప్తున్న రేవంత్‌రెడ్డి.. తాను చేపట్టిన మూసీ పునరుజ్జీవానికి నీళ్లు తెస్తామంటున్న మల్లన్నసాగర్ ఎక్కడిదని ప్రశ్నించారు. "మేడిగడ్డ గేట్లు దించితే భద్రాచలం రాముడికి ప్రమాదం అని సీఎం రేవంత్ అంటున్నడు. 2022 లో 28 లక్షల క్యూసెక్కుల వరద వస్తే 3 బ్యారేజీలకు ఏం కాలేదు. రోజూ 240 టీఎంసీల వరద 15 రోజుల పాటు వచ్చినా భద్రాచలానికి ఏం కాలేదు.. ఇప్పుడు లక్ష క్యూసెక్కులకే కొట్టుకుపోతదా? అది మేడిగడ్డ కాదు.. మేటిగడ్డ. పైన ఎక్కడా నీళ్లు లేవు.. ఒక్కటే చోట ఉన్నయ్.. కేవలం కన్నెపల్లి దగ్గరే ఉన్నయ్. ఇక్కడ నీళ్లు లేవని రేవంత్ చెప్తున్నాడు.. కానీ కింద పట్టిసీమ నుంచి ఏపీ నీళ్లు ఎత్తిపోస్తున్నది. ఏదైనా ఉంటే మమ్మల్ని తిట్టు.. కానీ రైతులపై కక్ష గట్టకు. భద్రాచలానికి మేడిగడ్డతో ముప్పు లేదు.. పోలవరం ఎత్తుతోనే ఉంది. అందుకే తెలంగాణ మండలాలను ఏపీలో కలిపారు కదా. కానీ, రేవంత్‌రెడ్డి మాత్రం సొంత ప్రాజెక్టులతోనే సొంత ప్రాంతాలకు ముప్పు అని మాట్లాడుతుండు. ఇప్పటికైనా జ్ఞానం తెచ్చుకోండి.. దేవుళ్లను రాజకీయాల కోసం వాడుకోవద్దు. ఎన్నికలప్పుడు నువ్వు అందరూ దేవుళ్ల మీద ఒట్టేసినవ్.. ఇప్పుడు ఆ దేవుళ్లే తలలుపట్టుకునే పరిస్థితి తెచ్చినవ్. ఇప్పుడు మళ్లీ రాములవారిపై ఆన అంటుండు.. జాగ్రత్త రేవంత్'' అని పేర్కొన్నారు.

**పైసలు ఎత్తిపోస్తడు.. నీళ్లు ఎత్తడు**

రేవంత్‌రెడ్డి ఈఎంఐ ముఖ్యమంత్రి అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఢిల్లీకి పైసలు ఎత్తిపోయడం తెలుసుగానీ.. రైతుల కోసం నీటిని ఎత్తిపోయడం తెలియదని అన్నారు. ఇక్కడ నోట్ల మూటలను ఢిల్లీకి పంపడం మాత్రమే తెలుసన్నారు. "దొంగ ఓట్లతోని గెలిచిన నీకు.. ఉద్యమకారులపైకి తుపాకీ ఎక్కుపెట్టిన నీకే అంతుంటే.. ఉద్యమకారుడైన కేసీఆర్‌కు ఎంతుంటుంది? మమ్మల్ని మొలవనివ్వమని చెప్తున్నావ్ కదా.. రా మరి ఎన్నికలకుపోదాం. అసెంబ్లీ రద్దు చెయ్యి మరి.. అక్కడిదాకా వద్దు మా దగ్గరి నుంచి తీసుకున్న 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు పోదాం. కాంగ్రెస్ కు 117 కాదు.. 7 సీట్లు కూడా రావు. మాకు ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే 78 సీట్లు వస్తాయని సర్వేలు చెప్తున్నాయి.. ఎంతసేపూ అదానీని మించి పోవాలనే తాపత్రయమే. ఎప్పటికీ అనుముల అన్నాదమ్ముల గురించే కాదు.. కాస్త అన్నారం గురించి కూడా పట్టించుకో. హరీశ్‌రావు.. కేసీఆర్ తయారు చేసిన సైనికుడు.. శీల పరీక్ష పెడితే రేవంత్‌కు పెట్టాలి. ఎందుకంటే ఢిల్లీకి పోయి పొద్దున కాంగ్రెస్.. రాత్రి బీజేపీ వాళ్లతో రేవంత్ కలుస్తాడు'' అని వ్యాఖ్యానించారు.

## పరిహారం, పునరావాసం తేల్చాకే
# మూసీ పనులు చేపట్టాలి

- డీపీఆర్, ఖర్చుపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలి: బండారు దత్తాత్రేయ
- టీఆర్ఎల్డీ చీఫ్ దిలీప్‌కుమార్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం


లక్డీకాపూల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బండారు దత్తాత్రేయ

**సైఫాబాద్, వెలుగు:** మూసీ పునరుజ్జీవ పనుల కన్నా ముందు నదిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేపట్టాలని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సూచించారు. నది అభివృద్ధి అవసరమే అయినా.. నిర్వాసితులకు పునరావాసం, నష్టపరిహారం కల్పించాకే ముందుకెళ్లాలని ప్రభుత్వానికి సూచించారు. శనివారం లక్డీకాపూల్‌లో తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ (టీఆర్ఎల్డీ) రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్‌కుమార్ అధ్యక్షతన మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో బండారు దత్తాత్రేయ, పౌర హక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్, ఎస్టీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు పాల్గొన్నారు. మూసీ పునరుద్ధరణ మంచి కార్యక్రమమని, కానీ ప్రజల భాగస్వామ్యం, నిపుణుల సూచనలతో ముందుకెళ్లాలని వక్తలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దత్తాత్రేయ మాట్లాడుతూ.. మూసీలోకి మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు నేరుగా చేరకుండా ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసి విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్రమణలను తొలగించే సమయంలో ప్రభుత్వం మానవత్వంతో వ్యవహరించాలని, ముందుగా నిర్వాసితులకు పునరావాసం కల్పించాలన్నారు. ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు, మేధావులతో కమిటీ ఏర్పాటు చేసి వారి సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ముందు పరిహారంపై తేల్చండి..**

మూసీ ప్రాజెక్టుపై ప్రభుత్వం ఇప్పటికీ పబ్లిక్ హియరింగ్ నిర్వహించలేదని, నిర్వాసితులకు న్యాయం జరుగుతుందని ఎలా నమ్మాలని హరగోపాల్ ప్రశ్నించారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ బాధితులకు దూర ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయిస్తే ఉపాధి కోల్పోతారని, వారికి అక్కడే పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. రవీందర్ రావు మాట్లాడుతూ.. జీతాలు, పింఛన్లు సకాలంలో చెల్లించలేని ప్రభుత్వం రూ.1.50 లక్షల కోట్ల అంచనా వ్యయంతో కూడిన ప్రాజెక్టును ఎలా పూర్తిచేస్తుందని ప్రశ్నించారు. ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ.. చెరువులు, కట్టలు కనుమరుగవడంతో మూసీ మురికి కూపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరిన్ని ఎస్టీపీల ఏర్పాటు, పారిశ్రామిక వ్యర్థాల నియంత్రణపై దృష్టి పెట్టాలని తాదూరి శ్రీనివాస్ సూచించారు. నిర్వాసితులకు ఆశ్రయం, నష్టపరిహారం కల్పించిన తర్వాతే ప్రాజెక్టు చేపట్టాలని బెల్లయ్య నాయక్ సూచించారు. వక్తల అభిప్రాయాలను సీఎంకు నివేదిస్తామని ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి తెలిపారు. దిలీప్‌కుమార్ మాట్లాడుతూ.. పునరావాసం, సరైన నష్టపరిహారం, ప్రజా సంఘాల సందేహాల నివృత్తి అనంతరమే మూసీ ప్రాజెక్టు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో అడ్వొకేట్ పాండురంగారెడ్డి, టీఆర్ఎల్డీ ఉపాధ్యక్షుడు కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సినిమా పిచ్చితో షాపింగ్ మాల్స్ లూటీ

## 32 చోరీల నిందితుడు అనంతపురంలో అరెస్ట్

- బెంగళూరుకు చెందిన నాగరాజుగారి ఆనంద్‌గా గుర్తించిన పోలీసులు
- హీరో అవ్వాలనే పిచ్చితో దొంగతనాలు
- చోరీ చేసిన రూ. 2.5 కోట్లతో హారర్ సినిమా స్టార్ట్
- బడ్జెట్ సరిపోకపోవడంతో 'ధూమ్' స్టైల్‌లో మళ్లీ దోపిడీలు
- పేదలు బాధపడతారని, వారి ఇండ్ల జోలికి వెళ్లని నిందితుడు
- విచిత్రమైన లాజిక్ తో మాల్స్‌నే టార్గెట్ చేసిన అంతర్రాష్ట్ర దొంగ



**అమరావతి:** తానే హీరోగా సొంతంగా సినిమా తీయాలనేది అతని కల. ఆ పిచ్చితో దొంగతనాలు చేసి రూ. 2.5 కోట్లు కూడబెట్టాడు. ఒక హారర్ సినిమా స్టార్ట్ చేసి అంతా ఖర్చు పెట్టాడు. బడ్జెట్ సరిపోకపోవడంతో సినిమా నిర్మాణం పూర్తవలేదు. ఎలాగైనా డబ్బు సంపాదించి సినిమా పూర్తి చేయాలనే ఉద్దేశంతో మళ్లీ దొంగతనాలు మొదలు పెట్టాడు. సామాన్యుల ఇండ్లను దోచుకుంటే వారు బాధపడతారని.. బాలీవుడ్ సినిమా ధూమ్ స్టైల్‌లో కేవలం షాపింగ్ మాల్స్‌నే టార్గెట్ చేశాడు. రీల్ లైఫ్‌లో హీరోగా మెరవడం కోసం రియల్ లైఫ్‌లో ఏకంగా మూడు రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా మారాడు. ఇప్పుడు ఊచలు లెక్కపెడుతున్నాడు. వివరాల్లోకి వెళితే..కర్నాటక రాజధాని బెంగళూరుకు చెందిన నాగరాజుగారి ఆనంద్‌కు సినిమాలంటే పిచ్చి. తానే స్వయంగా హీరోగా, దర్శకుడిగా మారి 'రిటర్న్ బై ఆనంద్.. పేజీ నంబరు 13' అనే హారర్ సినిమాను మొదలుపెట్టాడు. ఇందుకోసం గతంలో చేసిన దొంగతనాల సొమ్ముతో పాటు, తన తల్లి పేరిట ఉన్న సొంత ఇంటిని కూడా అమ్మేసి సుమారు 2.5 కోట్ల రూపాయలు ఖర్చు చేశాడు. దాదాపు 40 రోజుల పాటు షూటింగ్ కూడా జరిపాడు. అయితే, చివరి నిమిషంలో నిధుల కొరత వల్ల సినిమా విడుదల ఆగిపోయింది. దీనికి తోడు అప్పులు భారీగా పెరిగిపోవడంతో, వాటిని తీర్చడానికి ఆనంద్ మళ్లీ దొంగతనాల బాట పట్టాడు. అయితే దొంగతనానికి అతను సామాన్యుల ఇండ్ల జోలికి మాత్రం వెళ్లేవాడు కాదు. ఇండ్లలో దొంగతనం చేస్తే పేదలు, మధ్యతరగతి వారు బాధపడతారని ఆనంద్ భావించేవాడు. పెద్ద మాల్స్ అయితే ధనవంతులు నడుపుతారని, పైగా వాటికి ఇన్స్యూరెన్స్ (బీమా) ఉంటుంది కాబట్టి ఎవరికీ నష్టం జరగదనే విచిత్రమైన లాజిక్‌తో కేవలం షాపింగ్ మాల్స్‌ను మాత్రమే లూటీ చేసేవాడు.

### 32కి పైగా మాల్స్‌లో చోరీ

**ఇలా ఆనంద్..ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఏకంగా 32కి పైగా మాల్స్‌లో చోరీలకు పాల్పడి పోలీసులకు మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా మారాడు. ఈ క్రమంలోనే జూన్ 27న ఏపీ అనంతపురంలోని ప్రసిద్ధ 'డ్రెస్ సర్కిల్' మాల్‌లో భారీ దొంగతనానికి ఒడిగట్టాడు. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న అనంతపురం పోలీసులు..మాల్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌లను, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితుడిని గుర్తించారు. ప్రత్యేక బృందాలతో గాలించి ఆనంద్‌ను పట్టుకున్నారు. బాలీవుడ్ సినిమా 'ధూమ్' స్టైల్‌లో తప్పించుకు తిరుగుతున్న ఈ కిలాడీని పోలీసులు ఎట్టకేలకు కటకటాల్లోకి నెట్టారు. నిందితుడి నుంచి 5.25 లక్షల రూపాయల నగదు, దొంగతనానికి వాడిన ఒక కారు, మూడు నంబర్ ప్లేట్లు, ఇనుప రాడ్లు, కట్టర్లను స్వాధీనం చేసుకున్నారు.**

## మహిళల సాధికారతతోనే 'వికసిత భారత్' సాధ్యం

- గవర్నర్ శివప్రతాప్ శుక్లా వెల్లడి



**హైదరాబాద్, వెలుగు:** మహిళల సాధికారతతోనే 'వికసిత భారత్' సాధ్యమవుతుందని గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడంపై ప్రధాని మోదీ ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. శనివారం లోక్‌భవన్‌లో వికసిత్ వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రామ్( వీవీవీపీ ), వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ (వీబీవైపీ ) విజేతలతో గవర్నర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రాజకీయ సాధికారత దిశగా కేంద్ర ప్రభుత్వం 'నారీ శక్తి వందన్ అధినియం' పేరుతో 106వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లు కల్పించే ఈ నిర్ణయం చరిత్రాత్మకమని తెలిపారు. రాబోయే 2029 ఎన్నికల తర్వాత చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగాల కోసం యువత ఎదురుచూడకుండా ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం 'మై భారత్' పోర్టల్‌లో యువత నమోదు చేసుకునేందుకు రూపొందించిన ప్రచార పోస్టర్లను గవర్నర్ ఆవిష్కరించారు.

## కొలిక్కివస్తున్న 'తుంగతుర్తి' పంచాయితీ

- నియోజకవర్గ ముఖ్యనేతలతో పీసీసీ పరిశీలకుడు జగ్గారెడ్డి భేటీ
- ఎంపీ చామలతోపాటు ముఖ్యనేతల అభిప్రాయాల సేకరణ
- అసలైనవారికి పదవులివ్వాలంటూ గాంధీ భవన్ వద్ద నిరసన

**హైదరాబాద్, వెలుగు:** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య ఏర్పడ్డ వివాదాన్ని పరిష్కరించేందుకు.. పీసీసీ నియమించిన పరిశీలకుడు జగ్గారెడ్డి శనివారం గాంధీ భవన్‌లో జిల్లా ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ అసలు కాంగ్రెస్ కార్యకర్తలకు కాకుండా ఇతర పార్టీల నుంచి వచ్చినోళ్లకే మండల పార్టీ అధ్యక్ష పదవులు ఇచ్చారంటూ పలువురు పార్టీ నాయకులు వారం క్రితం గాంధీ భవన్‌కు వచ్చి ధర్నా నిర్వహించారు. ఇదే అంశంపై సామేల్‌తో స్థానిక ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి మధ్య వివాదం నెలకొంది. ఇది చినికి చినికి గాలివానలా మారి పంచాయితీ చివరకు పీసీసీ వరకు వెళ్లింది. దీంతో ఈ వివాదాన్ని పరిష్కరించే బాధ్యతను జగ్గారెడ్డికి పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ అప్పగించారు. జగ్గారెడ్డి శనివారం గాంధీ భవన్‌లో సూర్యాపేట జిల్లా ముఖ్యనేతలతో భేటీ అయ్యారు. ఎమ్మెల్యే సామేల్ ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పార్టీ పదవులు ఇప్పించుకున్నారని పలువురు జగ్గారెడ్డికి ఫిర్యాదు చేశారు. మరోవైపు జగ్గారెడ్డి ఓ వైపు నేతలతో వారి అభిప్రాయాలను తెలుసుకుంటున్న సమయంలోనే ఆ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు గాంధీ భవన్ ఎదుట నిరసనకు దిగారు. అసలైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఎమ్మెల్యే సామేల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో జగ్గారెడ్డి బయటకు వచ్చి కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సోమవారం ఈ వివాదంపై పీసీసీ చీఫ్‌మహేశ్ గౌడ్ కు జగ్గారెడ్డి నివేదిక ఇవ్వనున్నారు.


## భీంరావ్ వాడ బస్తీవాసులకు.. కొల్లూరులో 'డబుల్' ఇండ్లు కేటాయించాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

**హైదరాబాద్, వెలుగు:** హైదరాబాద్ నాంపల్లిలోని భీంరావ్ వాడ బస్తీవాసులకు కొల్లూరులో డబుల్ బెడ్రూమ్ ఇండ్లను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. నిరాశ్రయులైన కుటుంబాలకు పూర్తి హక్కులతో పట్టాలు ఇవ్వాలని స్పష్టం చేసింది. డబుల్ బెడ్రూమ్ ఇండ్లలో నివాసానికి అవసరమైన తాగునీరు, డ్రైనేజీ, లిఫ్ట్ తదితర అన్ని రకాల మౌలిక వసతులను కల్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. భీంరావ్ వాడను గుర్తింపు పొందిన మురికివాడల జాబితా నుంచి తొలగిస్తూ 2008లో ప్రభుత్వం జారీ చేసిన జీవో 251ను సవాల్ చేస్తూ కె. భారతితో పాటు మరో 70 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సుద్దాల చలపతిరావు విచారించారు. బాధితులు నాంపల్లిలో 60 ఏళ్లకు పైగా నివసిస్తున్నారని తెలిపారు. 1991లోనే ఈ ప్రాంతాన్ని మురికివాడగా గుర్తిస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ కూడా ఇచ్చిందన్నారు. ఆ తర్వాత ఒక్కో కుటుంబానికి 33.33 చదరపు మీటర్ల స్థలానికి పట్టాలు ఇచ్చి, తరువాత అవి పొరపాటున జారీ అయ్యాయని పేర్కొంటూ రద్దు చేయడం అన్యాయమన్నారు. 2007 జనవరి 2న పోలీసులతో బలవంతంగా ఇళ్లను ఖాళీ చేయించి కూల్చివేశారని కోర్టు దృష్టికి తెచ్చారు. దీనికి ప్రభుత్వం తరపు న్యాయవాది బదులిస్తూ తాము చట్టప్రకారమే ఖాళీ చేయించామని చెప్పారు. బస్తీవాసులకు కొల్లూరు, కీసర రాంపల్లి, అమీన్ పూర్, శంకరపల్లి, ఏదులనాగులపల్లిలో 2బీహెచ్‌కే ఇళ్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. ఇరుపక్షాల వాదనలను విన్న హైకోర్టు.. రెండు నెలల్లోగా భీంరావ్ వాడ బస్తీవాసులకు కొల్లూరులో ఇళ్లను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. బాధితులు దాదాపు 17 ఏళ్లుగా అద్దె ఇళ్లలోనే నరకం చూస్తున్నందున, వారికి కేటాయించే ఇళ్లను ఐదేళ్లపాటు విక్రయించరాదనే గట్టి షరతు విధించింది. పిటిషన్ దాఖలు చేసిన వారిలో ఇప్పటికే మరణించిన వారు ఉంటే, వారి కుటుంబ సభ్యులను గుర్తించి అర్హత ప్రకారం ఇళ్లు ఇవ్వాలని సూచించింది. అంతేకాకుండా ఈ కేసులో పిటిషనర్లుగా లేకపోయినా, అదే బస్తీకి చెందిన ఇతర అర్హులైన నిరాశ్రయులు ఎవరైనా ఉంటే వారు జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని కోర్టు తెలిపింది.



≡ క్విక్ బైట్స్



## నా ఓర్పును బలహీనతగా భావించవద్దు

**జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా**

**శ్రీనగర్:** రాష్ట్ర హోదా పునరుద్ధరణ విషయంలో తన ఓర్పును బలహీనతగా భావించవద్దని జమ్మూ కాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శ్రీనగర్‌లోని హజ్రత్‌బాల్‌లో శనివారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించడానికి కేంద్రం చెబుతున్న 'సరైన సమయం' అనే మాటలకు అసలు అర్థం ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర హోదా సాధనకై ఈ నెల 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నేషనల్ కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు.

## బెంగాల్‌లో యూసీసీ..

**ముసాయిదా బిల్లు పరిశీలనకు కమిటీ ఏర్పాటు చేసిన సర్కారు**

**కోల్‌కతా:** బెంగాల్‌లో యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ) అమలు దిశగా మరో అడుగుపడింది. ముసాయిదా బిల్లును పరిశీలించేందుకు సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ అధ్యక్షతన సువేందు సర్కారు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోని పౌరులందరికీ, వారి మతం, విశ్వాసం లేదా సమాజంతో సంబంధం లేకుండా, వ్యక్తిగత పౌర విషయాలను నియంత్రించే సమగ్ర చట్ట పరమైన చట్రాన్ని రూపొందించడమే ఈ బిల్లు యొక్క ముఖ్య ఉద్దేశ్యం. జూలై 2న జరిగిన మంత్రివర్గ భేటీలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రతిపాదిత చట్టం యొక్క విస్తృత ప్రభావాలు, లోతైన స్వభావం దృష్ట్యా, దీనిని సమగ్రంగా పరిశీలించడానికి ప్రభుత్వం ఈ కమిటీని నియమించింది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బీజేపీ ఇచ్చిన ప్రధాన ఎన్నికల హామీని అమలు చేసే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నారు.



## నేను గాంధీని, హీరోను కాదు!

**సోనమ్ వాంగ్‌చుక్**

**న్యూఢిల్లీ:** తాను ఆధునిక గాంధీనో, సినీ హీరోనో కాదని.. కేవలం ఒక సాధారణ పౌరుడిని మాత్రమేనని పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ అన్నారు. ప్రజలు నాయకత్వం కోసం ఇతరుల వైపు చూడకుండా.. ఎవరి జీవితాలకు వారే హీరోలు కావాలని ఆయన సూచించారు. నీట్ సహా పరీక్షల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసన శనివారం నాటికి 22వ రోజుకు చేరుకుంది. అందులో భాగంగా వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష 14వ రోజుకు చేరింది. ఈ క్రమంలో వాంగ్‌చుక్ ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. 'చాలామంది నన్ను 21వ శతాబ్దపు గాంధీ, మరికొందరు హీరో అని పిలుస్తున్నారు. అలా పిలవొద్దు. నేను కేవలం నా బాధ్యతలను నెరవేర్చడానికి ప్రయత్నించిన ఒక సామాన్యుడిని' అని అన్నారు.

**బహమాస్‌లో విమానం కూలి**

## 10 మంది మృతి

**నాసా:** బహమాస్‌లో ఉత్తర ఆండ్రోస్ సమీపంలోని జలాల్లో శుక్రవారం ఒక చిన్న విమానం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. దేశం 53వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం జరగడం పట్ల బహమాస్ ప్రధాని ఫిలిప్ బ్రేవ్ డేవిస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదానికి గురైన విమానాన్ని 'సెస్నా 402'గా అధికారులు గుర్తించారు. ఇది రాజధాని నాసా విమానాశ్రయం నుంచి శాన్ ఆండ్రోస్ వైపు వెళ్తుండగా కూలిపోయింది. మరోవైపు, ఫ్లెమింగో ఎయిర్‌కు చెందిన మరో విమానంలో కూడా సాంకేతిక లోపం తలెత్తింది. మాయాగువానా వెళ్లాల్సిన ఆ విమానాన్ని పైలట్ చాకచక్యంగా తిరిగి నాసాలో ల్యాండ్ చేశారు.

### 2030 నాటికి

# 35 వేల కోట్ల వాణిజ్యం

## భారత్-న్యూజిలాండ్ 'వ్యూహాత్మక' ద్వైపాక్షిక బంధం రెట్టింపు



- మోదీ-లక్సన్ మధ్య చరిత్రాత్మక ఒప్పందాలు
- ఉగ్రవాద నిరోధక చర్యల కోసం 'జాయింట్ వర్కింగ్ గ్రూప్'
- ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌ను వేగంగా అమలు చేయాలని నిర్ణయం

**అక్లాండ్:** భారత్, న్యూజిలాండ్ దేశాల మధ్య దౌత్య బంధం సరికొత్త శిఖరానికి చేరింది. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను 'స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్' స్థాయికి పెంచుతూ ఇరు దేశాలు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి భద్రతలే లక్ష్యంగా, చైనా దూకుడుకు అడ్డుకట్ట వేసేలా రక్షణ, వాణిజ్య రంగాల్లో సరికొత్త అధ్యాయానికి ఇరు దేశాలు శ్రీకారం చుట్టాయి. 3 దేశాల పర్యటనలో భాగంగా ఆఖరి విడతగా న్యూజిలాండ్ చేరుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీకి అక్లాండ్‌లో ఘనస్వాగతం లభించింది. శనివారం న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్‌తో ప్రధాని మోదీ జరిపిన ద్వైపాక్షిక చర్చలు అత్యంత ఫలప్రదంగా ముగిశాయి. ఈ భేటీలో ఇరు దేశాల ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేసేలా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుతం దాదాపు రూ. 18వేల కోట్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యాన్ని.. 2030 నాటికి రెట్టింపు చేసి రూ. 35వేల కోట్లకు (7 బిలియన్ న్యూజిలాండ్ డాలర్లు) చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతోపాటు రాబోయే 15 ఏండ్లలో భారత్‌లో 20 బిలియన్ డాలర్ల (1.90 లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టేందుకు న్యూజిలాండ్ సుముఖత వ్యక్తం చేసింది. ఇటీవల కుదిరిన ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ త్వరితగతిన అమలు చేయాలని ఇరుపక్షాలు నిర్ణయించాయి. ఇటీవల చైనా జరిపిన సబ్‌మెరైన్ లాంచ్డ్ లాంగ్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణి పరీక్షల నేపథ్యంలో, ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. అంతర్జాతీయ చట్టాలు, ప్రాంతీయ సార్వభౌమత్వాన్ని గౌరవించాలని మోదీ, లక్సన్ స్పష్టం చేశారు. అలాగే, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో (యూఎన్ఎస్‌సీ) భారత్‌కు శాశ్వత సభ్యత్వం లభించాలనే డిమాండ్‌కు న్యూజిలాండ్ మరోసారి పూర్తి మద్దతు ప్రకటించింది. ఉగ్రవాద నిధుల సరఫరాను అడ్డుకోవాలని, ఉగ్రవాదంపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంబించాలని ఇరు దేశాల ప్రధానులు పిలుపునిచ్చారు.

**ఇండో- పసిఫిక్‌లో శాంతే ధ్యేయం: మోదీ**

ద్వైపాక్షిక చర్చల అనంతరం ప్రధాని మోదీ మాట్లాడారు. సాగర తీరాలు కలిగిన భారత్, న్యూజిలాండ్ దేశాల మధ్య బంధం బలోపేతం కావడం ఇండో-పసిఫిక్ ప్రాంతానికి సరికొత్త శక్తిని ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. "ప్రజాస్వామ్య విలువలపై ఉన్న నమ్మకమే మనల్ని సహజ భాగస్వాములుగా నిలబెట్టింది. మన పరస్పర సహకారం ప్రాంతీయ శాంతికి, ప్రపంచ సంక్షేమానికి ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది" అని అన్నారు.

**అవకాశాల మహాసముద్రం**

హాట్ స్పాట్‌గా మారిన ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో సంబంధాలను పటిష్టం చేసుకోవడానికి ఇరు దేశాల ముందు 'అవకాశాల మహాసముద్రం' వేచి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అక్లాండ్‌లోని 'స్పార్క్ అరేనా'లో జరిగిన ఒక భారీ కార్యక్రమంలో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి పీఎం మోదీ ప్రసంగించారు. "శతాబ్దాలుగా ఇక్కడి ప్రజలను ఏకం చేస్తున్న ఒక పదం.. 'వాకా'. ఈ రోజు భారత్-న్యూజిలాండ్‌ల 'వాకా' ఒక కొత్త ప్రయాణానికి సిద్ధమైంది. మన ముందు అవకాశాలతో నిండిన మహాసముద్రం ఉంది" అని వ్యాఖ్యానించారు. న్యూజిలాండ్‌లో భారతీయ సంస్కృతి, ప్రజల ప్రభావం ఉన్నదని, అక్కడ కొన్ని ప్రాంతాల పేర్లు భారత నగరాలతో ముడిపడి ఉన్నాయని చెప్పారు.

**భారత్‌కు మోదీ తిరుగుపయనం**

మూడు దేశాల టూర్‌లో భాగంగా చివరిగా న్యూజిలాండ్‌లో రెండు రోజుల పాటు పర్యటించిన మోదీ శనివారం స్వదేశానికి తిరుగుపయనమయ్యారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో మోదీ జరిపిన పర్యటన శనివారంతో ముగిసింది. న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ స్వయంగా వచ్చి ప్రధాని మోదీకి వీడ్కోలు పలికారు.

**10 ఒప్పందాలు**

**ఇరు దేశాల చర్చల అనంతరం విడుదల చేసిన ఉమ్మడి ప్రకటన ప్రకారం.. మొత్తం 18 నిర్దిష్ట ఫలితాలు రాగా..అందులో 10 కీలక ఒప్పందాలు కుదిరాయి. రాబోయే 4 ఏండ్లపాటు ఇరు దేశాల సంబంధాల విస్తరణకు స్పష్టమైన 'రోడ్‌మ్యాప్'ను సిద్ధం చేశారు. హైడ్రోగ్రాఫిక్ డేటా షేరింగ్, పరస్పర నావికాదళ లాజిస్టిక్స్ సదుపాయాలు, ఇండో-పసిఫిక్‌లో మెరుగైన నౌకాదళ సహకారంలాంటి 3 అత్యంత కీలక రక్షణ ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. ఉగ్రవాద నిరోధక చర్యల కోసం ప్రత్యేక 'జాయింట్ వర్కింగ్ గ్రూప్', క్రీడారంగంలో పరస్పర సహకారం, అథ్లెట్ల అభివృద్ధి కోసం ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేశారు.**

## మోదీ ప్రెస్‌మీట్ ఎందుకు పెట్టరు?

- న్యూజిలాండ్ జర్నలిస్ట్ ప్రశ్న



**అక్లాండ్:** ప్రధాని మోదీ మీడియా సమావేశాలు నిర్వహించకపోవడంపై న్యూజిలాండ్ పర్యటనలో ఆసక్తికరమైన చర్చ జరిగింది. స్థానిక జర్నలిస్టులతో భారత దౌత్యాధికారులు జరిపిన ఒక సమావేశంలో.. "ప్రధాని మోదీ అసలు ప్రెస్ కాన్ఫరెన్స్‌లు ఎందుకు పెట్టరు?" అని ఒక విదేశీ జర్నలిస్ట్ నేరుగా ప్రశ్నించారు. దీనిపై భారత విదేశాంగ శాఖ సీనియర్ అధికారి రుద్రేంద్ర టాండన్ స్పందించారు. "ప్రధాని మోదీ పరిపూర్ణమైన భారతీయ రాజకీయ నాయకుడు. భారతీయ నాయకులు తమ ఓటర్లతో నేరుగా కనెక్ట్ అవ్వడానికే ఇష్టపడతారు. మధ్యవర్తుల ద్వారా మాట్లాడటం వారికి నచ్చదు. మోదీ ప్రజలతో నేరుగా సంబంధాలు పెట్టుకునే కళను పూర్తిగా పుణికిపుచ్చుకున్నారు. అందుకే ఆయన వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చి, అత్యంత సుదీర్ఘకాలం పనిచేస్తున్న ప్రధానులలో ఒకరిగా నిలిచారు" అని టాండన్ బదులిచ్చారు.

### రామ మందిర విరాళాల

# దొంగతనం సిగ్గుచేటు

- మమ్మల్ని క్షమించండి
- భక్తులకు రామాలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా విజ్ఞప్తి
- ఆలయ నిర్వహణ వ్యవస్థను మెరుగుపరుస్తామని వెల్లడి



**అయోధ్య:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అయోధ్య రామాలయంలో విరాళాల దొంగతనంపై రామాలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విరాళాల దొంగతనం సిగ్గుచేటని.. ఆలయ ప్రతిష్టకు జరిగిన మాయని మచ్చని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ఘటనతో తామంతా తీవ్ర మానసిక క్షోభకు గురయ్యామన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. విరాళాలు దుర్వినియోగం కావడంపై భక్తులందరికీ తాము క్షమాపణలు చెబుతున్నామన్నారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో మళ్లీ జరగకుండా ఆలయ నిర్వహణ వ్యవస్థను పూర్తిగా మెరుగుపరుస్తామని నృపేంద్ర మిశ్రా స్పష్టం చేశారు.

**చివరి దశ ఆలయ నిర్మాణ పనులు**

ఆలయ నిర్మాణ పనుల పురోగతిపై కూడా నృపేంద్ర మిశ్రా స్పష్టత ఇచ్చారు. స్మారక చిహ్నంగా మారుస్తున్న పాత ఆలయ పనులు దాదాపు చివరి దశకు వచ్చాయని.. అక్కడ 24 గంటలూ వెలిగే అఖండ జ్యోతి ఏర్పాట్లు మాత్రమే మిగిలి ఉన్నాయని చెప్పారు. జులై 30 నాటికి ప్రధాన ఆలయ నిర్మాణ పనులు పూర్తవుతాయని వెల్లడించారు. ఆలయం బయట నిర్మిస్తున్న 4 కిలోమీటర్ల రక్షణ గోడ, ఆడిటోరియం వంటి మిగిలిన పనులు నవంబర్ లేదా డిసెంబర్ నాటికి పూర్తవుతాయన్నారు. అలాగే, 20 గ్యాలరీలతో ఏర్పాటు చేస్తున్న 'రామ్‌కథా మ్యూజియం' పనులు కూడా వేగంగా జరుగుతున్నాయన్నారు. ఎంతోమంది త్యాగాలు, సుదీర్ఘ ఉద్యమం వల్ల సాకారమైన అయోధ్య రామాలయం ప్రపంచంలోనే అద్వితీయమైనదని, సనాతన ధర్మాన్ని నమ్మే ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక్కసారైనా ఈ పవిత్ర స్థలాన్ని సందర్శిస్తారని నృపేంద్ర మిశ్రా పేర్కొన్నారు.

**రాజీనామాలకు ఆమోదం**

విరాళాల దొంగతనం వివాదం తీవ్రం కావడంతో ఆలయ ట్రస్ట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రాలు తమ పదవులకు రాజీనామా చేయగా వాటిని ట్రస్ట్ ఆమోదించింది. ప్రస్తుతం కృష్ణ మోహన్ తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చూస్తున్నారు. ఆలయ నిర్వహణను మరింత పారదర్శకంగా మార్చడానికి ఒక సీఈఓను నియమించాలని కమిటీ నిర్ణయించింది. ఈ నియామకం కోసం ఒక రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ఇచ్చే సిఫార్సుల ఆధారంగా ట్రస్ట్ తుది నిర్ణయం తీసుకుంటుంది. ఆలయ భద్రత, ఆర్థిక విషయాల పర్యవేక్షణను ఎలా మెరుగుపరచాలనే అంశంపై చర్చించేందుకు జూలై 22న ట్రస్ట్ మరోసారి ప్రత్యేకంగా సమావేశం కానుంది.

### నా తండ్రి హత్యకు

# ప్రతీకారం తీర్చుకుంటాం

- మేం ఉన్నా, లేకపోయినా.. అది జరిగి తీరుతుంది
- ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ శపథం



**టెహ్రాన్:** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్, తన తండ్రి అయతుల్లా అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామని ఆయన కొడుకు, ప్రస్తుత సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ శపథం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో అలీ ఖమేనీ, ఇతర నేతల రక్తం చిందిందని.. అందుకుగాను ప్రతీకారం తీర్చుకోవాలని దేశ ప్రజలు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. శనివారం ఈ మేరకు సోషల్ మీడియాలో మొజ్తబా లిఖిత పూర్వక సందేశం విడుదల చేశారు. "ఈ యుద్ధంలో అమరులైన వీరులందరి రక్తావిష్కారానికిగాను ఆ హంతకులపై ప్రతీకారం తీర్చుకుంటామని మేం శపథం చేస్తున్నాం" అని ఆ సందేశంలో పేర్కొన్నారు. ఇరాన్ ప్రతీకారం తప్పనిసరిగా తీరుతుందన్నారు. ఈ విషయం తన వ్యక్తిగత ఉనికిపై లేదా ఇతర అధికారులపై ఆధారపడి లేదని చెప్పారు. "మేం ఉన్నా లేకపోయినా, అది జరిగి తీరుతుంది" అని మొజ్తబా స్పష్టం చేశారు. అలీ ఖమేనీ అంతిమయాత్రకు లక్షలాదిగా తరలి వచ్చి శత్రువుల గుండెల్లో రైళ్లు పరుగెత్తేలా చేసిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. "ఇరాన్, ఇరాక్ అంతటా, ముఖ్యంగా టెహ్రాన్, ఖోమ్, నజాఫ్, కర్బలా, మషద్‌లలో లక్షలాది మంది ప్రజలు అద్భుతంగా, శత్రువులను ముక్కలు చేసేలా, చారిత్రాత్మకంగా తరలివచ్చినందుకు నేను హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని ఆయన రాశారు. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో మరణించిన అలీ ఖమేనీకి కొన్ని నెలల తర్వాత గురువారం అర్ధరాత్రి అంత్యక్రియలు జరిగిన సందర్భంగా మొజ్తబా ఈ మేరకు శపథం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు.

# వియత్నాంలో టూరిస్టు బోటు బోల్తా

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఉధృతిని తట్టుకోలేక పడవ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో పడవలోని వారంతా సముద్రంలో పడిపోయారు.

**రెస్క్యూ ఆపరేషన్..**

సమాచారం అందిన వెంటనే వియత్నాం కోస్ట్ గార్డ్ అధికారులు, రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో తీవ్రంగా శ్రమించి 21 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చాయి. పదిహేను మంది మరణించగా.. అందులో ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నానికి చెందిన జయలక్ష్మి గెల్లి, నల్లాపేట రవితేజ ఆదిశేషయ్య, శ్రీధర్ ముడియంలతో పాటు తమిళనాడుకు చెందిన 10 మంది, కేరళకు చెందిన ఇద్దరు టూరిస్టులు ఉన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి సమీపంలోని ఆసుపత్రుల్లో అత్యవసర చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**భారత ఎంబసీ అలర్ట్**

ఈ దుర్ఘటనపై భారత విదేశాంగ శాఖ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసింది. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు, మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సహాయం కోసం హోచిమిన్ సిటీలోని కార్యాలయాన్ని +84 36 281 7930 నంబర్‌లో సంప్రదించవచ్చని అధికారులు సూచించారు. ఈ దుర్ఘటనపై వియత్నాం ప్రభుత్వం కూడా విచారణకు ఆదేశించింది. పడవ సామర్థ్యం, వాతావరణ పరిస్థితులపై ముందస్తు హెచ్చరికల అమలులో వైఫల్యం జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.



**రాష్ట్రపతి, ప్రధాని, రాహుల్ గాంధీ సంతాపం**

వియత్నాంలో బోటు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వియత్నాంలో భారతీయ పౌరులు మరణించడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ, బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని, భారత రాయబార కార్యాలయం మరియు కాన్సులేట్ అధికారులు వియత్నాం అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, అన్ని రకాల సహాయాన్ని అందిస్తున్నారని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా తెలిపారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్పందిస్తూ, ఈ కష్టకాలంలో ప్రభుత్వం మరియు విదేశాంగ మంత్రిత్వ శాఖ వియత్నాం అధికారులతో కలిసి పనిచేసి, సహాయక చర్యలు ముమ్మరం చేయాలని కోరారు. బాధితుల కుటుంబాలకు తన హృదయపూర్వక సంతాపం తెలియజేస్తూ, గల్లంతైన వారి కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల వేదనను తాను అర్థం చేసుకోగలనని, తన ఆలోచనలు వారితోనే ఉన్నాయని పేర్కొన్నారు.

# తండ్రిని కూడా చంపేసింది

- రాజస్తాన్‌లో జాబ్ కోసం కన్నకూతురే తల్లిని చంపించిన కేసులో ట్విస్ట్
- నిందితురాలి మేనమామ ఫిర్యాదు



**జైపూర్:** రాజస్తాన్‌లోని జైపూర్‌లో సుఫారీ ఇచ్చి కన్న కూతురే తల్లిని చంపించిన కేసులో మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. తల్లిని చంపించిన కూతురు ఆయుషి శర్మనే తన తండ్రి విజయ్ శర్మను కూడా గతంలో ఇలాగే చంపేసిందని ఆమె మేనమామ రాకేష్ శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతేడాది తండ్రికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినప్పుడు.. ఆయుషి ఎవరికీ చెప్పకుండా ఆయనను ఒక గుర్తుతెలియని ఆసుపత్రిలో చేర్చిందని తెలిపారు. మూడు నెలల పాటు కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. ఆ తర్వాత తండ్రిని ఇంటికి తెచ్చినా.. అప్పటికే విజయ్ శర్మ అవయవాలు బాగా దెబ్బతిన్నాయని ఆరోపించారు. ఇంట్లో ఉన్న టైంలో కూడా తండ్రికి అమర్చిన ఫీడింగ్ ట్యూబ్‌ను (ఆహార గొట్టాన్ని) ఆయుషి కావాలనే తొలగించిందని.. అందువల్లే ఆయన చనిపోయారని మేనమామ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై కూడా పోలీసులు ప్రస్తుతం విచారణ జరుపుతున్నారు. తల్లి నీరజ్ శర్మను రోడ్డు ప్రమాదంలో హతమార్చిన కేసులో ఐదుగురు కాంట్రాక్ట్ కిల్లర్లను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేయగా.. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు బలరామ్ కోసం పోలీసులు వెతుకుతున్నారు.

**గవర్నమెంట్ జాబ్ కోసమే..**

ప్రభుత్వ ఉద్యోగం, ఆస్తిపై ఉన్న దురాశతోనే ఆయుషి శర్మ తన తల్లిని చంపించిందని పోలీసులు నిర్ధారించారు. జైపూర్ కోర్టులో కోర్ట్ మాస్టర్‌గా పనిచేసిన విజయ్ శర్మ గతేడాది మరణించడంతో.. ఆయన భార్య నీరజ్ శర్మకు కారుణ్య నియామకం కింద అదే కోర్టులో క్లర్క్‌గా ఉద్యోగం వచ్చింది. అయితే, ఎల్ఎల్‌బీ ఫైనలియర్ చదువుతున్న కూతురు ఆయుషికి ఆ ఉద్యోగంపై కన్ను పడింది. తల్లి బతికుంటే ఉద్యోగం తనకు రాదని, అలాగే కుటుంబ ఆస్తి కూడా దక్కదని ఆమె భావించింది. దీంతో ఎలాగైనా తల్లిని వదిలించుకోవాలని ప్లాన్ వేసింది.

**రూ. 7 లక్షలకు కాంట్రాక్ట్ కిల్లర్లను మాట్లాడి..**

ప్లాన్ ప్రకారం.. ఆయుషి, తన కజిన్ బలరామ్ సహాయంతో రూ.7 లక్షలకు కాంట్రాక్ట్ కిల్లర్లను మాట్లాడింది. తల్లిని చంపి, రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాలని వారు నిర్ణయించుకున్నారు. జూలై 3న నీరజ్ శర్మ తన చిన్న కొడుకును కోచింగ్ సెంటర్‌లో దించి తిరిగి వస్తుండగా.. ఒక కారు ఆమెను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నీరజ్ శర్మ అక్కడికక్కడే చనిపోయారు. అయితే, పోలీసులు లోతుగా దర్యాప్తు చేయడంతో ఆయుషి వేసిన ప్లాన్ బయటబడింది.

## ఇండియా మ్యాప్‌ను తప్పుగా చూపిన బంగ్లాదేశ్

**తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన భారత దౌత్యవేత్త పూజా కుమారి**

**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్‌లో జరిగిన ఓ సెమినార్ లో ఇండియా మ్యాప్ ను తప్పుగా ప్రచురించి ప్రదర్శించారు. దీనిపై భారత దౌత్యవేత్త పూజా కుమారి ఝా తీవ్ర అభ్యంతరం తెలిపారు. బంగ్లాదేశ్ మాజీ హైకమిషనర్ అహ్మద్ తారిఖ్ కరీం ప్రసంగం సందర్భంగా ఈ అభ్యంతరాన్ని లేవనెత్తారు. భారత్‌లో జమ్మూ కాశ్మీర్ అంతర్భాగమని ఆమె మరోసారి నొక్కి చెప్పారు. బంగ్లా రాజధాని ఢాకాలో ఇటీవల బంగ్లాదేశ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ లో 'సార్క్ పునరుజ్జీవింప మార్గాలు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో 2009 నుంచి 2014 వరకు భారతదేశంలో బంగ్లాదేశ్ హైకమిషనర్‌గా పనిచేసిన కరీం మాట్లాడుతుండగా.. ఆడియన్స్‌లో ఉన్న పూజా కుమారి ఝా ఆయన ప్రదర్శించిన మ్యాప్ తప్పుగా ఉందని ఎత్తి చూపారు. 'మీరు చూపించిన భారతదేశం మ్యాప్ తప్పు. జమ్మూ కాశ్మీర్.. భారతదేశంలో అంతర్భాగం' అని ఆమె అన్నారు. అయితే, ఆ మ్యాప్ కేవలం ప్రాతినిధ్య ప్రయోజనాలకేనని, వాస్తవ సరిహద్దులను చూపించదని కరీం చెప్పారు.

### 12.5% అదనపు

# టారిఫ్‌లను వెనక్కి తీస్కోండి

- అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్‌కు భారత్ విజ్ఞప్తి
- వెట్టిచాకిరీపై యూఎస్‌టీఆర్ నివేదికలో లోపాలు
- ఏకపక్ష నిర్ణయాలొద్దు.. చర్చలతో పరిష్కరించుకోవాలని పిలుపు



**వాషింగ్టన్:** భారత్‌లో వివిధ వస్తువుల తయారీలో వెట్టిచాకిరీ(ఫోర్స్డ్ లేబర్) కొనసాగుతోందంటూ యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) ఇచ్చిన నివేదికలో లోపాలు ఉన్నాయని కేంద్ర వాణిజ్య శాఖ స్పష్టం చేసింది. యూఎస్‌టీఆర్ సెక్షన్ 301 కింద జరిపిన దర్యాప్తు లోపభూయిష్టంగా ఉందని తెలిపింది. భారత్‌లో వెట్టిచాకిరీ నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేసింది. అందుకే, వెట్టిచాకిరీ నెపంతో 12.5 శాతం అదనపు టారిఫ్‌లు విధించాలన్న ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని కోరింది. వాణిజ్య సమస్యలను ఏకపక్ష చర్యల ద్వారా కాకుండా ద్వైపాక్షిక వాణిజ్య చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చింది. ఈ విషయమై ఇటీవల జరిగిన బహిరంగ విచారణలో ఈ మేరకు కేంద్ర వాణిజ్య శాఖ సంయుక్త కార్యదర్శి బ్రిజ్ మోహన్ మిశ్రా పాల్గొని మాట్లాడారు. వెట్టిచాకిరీ నిర్మూలన సమస్యలపై భారత్ ఎంతో నిజాయతీతో పనిచేస్తోందని, ఈ నేపథ్యంలో యూఎస్‌టీఆర్ తీసుకున్న నిర్ణయంపై తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. రాజ్యాంగబద్ధమైన బాధ్యతగా, అంతర్జాతీయ చట్టాలు, సూత్రాల ప్రకారం వెట్టిచాకిరీని నిర్మూలించడాన్ని భారత్ ఎంతో తీవ్రంగా పరిగణిస్తుందని ఆయన చెప్పారు. ట్రేడ్ యాక్ట్ లోని సెక్షన్ 301(డీ) ప్రకారం నిర్దేశించిన చట్టపరమైన ప్రమాణాలను యూఎస్‌టీఆర్ నెరవేర్చలేదు. ఇతర చట్టబద్ధమైన అవసరాలకు సంబంధించిన ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా, కేవలం వెట్టిచాకిరీ వస్తువుల దిగుమతిపై నిషేధం విధించలేదనే కారణంతో దానిని సెక్షన్ 301 కింద అసమంజసమైన చర్యగా పరిగణించలేమని ఆయన స్పష్టం చేశారు. జులై 8న జరిగిన విచారణకు సంబంధించిన లిఖితపూర్వక ప్రతిని యూఎస్‌టీఆర్ వెబ్‌సైట్‌లో ప్రచురించారు. దాని ప్రకారం, దేశవ్యాప్త పన్నులకు యూఎస్‌టీఆర్ నిర్ణయం ఎటువంటి హేతుబద్ధమైన కారణాన్ని చూపడం లేదు. భారత్‌తో సహా 46 ఆర్థిక వ్యవస్థలను ఒకే వర్గంలోకి చేర్చడం సరికాదని భారత్ పేర్కొంది.

## ఐఐఐటీహెచ్ కాన్వొకేషన్



- 526 మంది విద్యార్థులకు పట్టాలు అందజేత

**గచ్చిబౌలి, వెలుగు:** గచ్చిబౌలిలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ హైదరాబాద్(ఐఐఐటీహెచ్) 25వ కాన్వకేషన్ శనివారం ఘనంగా నిర్వహించారు. చీఫ్‌గెస్ట్‌గా కేంద్ర ప్రభుత్వ ప్రిన్సిపల్‌సైంటిఫిక్అడ్వైజర్‌ప్రొ. అజయ్ కుమార్ సూద్ హాజరై మాట్లాడారు. ఆవిష్కరణలు చేయడం కాదు.. వాటిని సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడమే అసలైన సవాల్ అని అన్నారు. ఐఐఐటీ హైదరాబాద్‌లో పొందిన జ్ఞానం, నైపుణ్యాలను ప్రజల జీవితాలను మార్చే ఆవిష్కరణల కోసం వినియోగించాలని సూచించారు. మొత్తం 526 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన మద్దిరెడ్డి క్రితిన్ గోల్డ్ మెడల్ అందుకున్నాడు. ఇదే విభాగానికి చెందిన అభినవ్ దిగంబర్ రౌంధాల్ కు విద్యారంగం, పాఠ్యేతర కార్యకలాపాలు, సంస్థకు చేసిన సేవలకు గుర్తింపుగా బెస్ట్ ఆల్‌రౌండర్ అవార్డు అందించారు. కార్యక్రమంలో ఐఐఐటీహెచ్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ప్రొ.అశోక్ ఝున్‌ఝున్‌వాలా, డైరెక్టర్ ప్రొఫెసర్ సందీప్ శుక్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యం



- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేశ్ వి.పాటిల్
- సేఫ్టీ ఎక్స్‌పో ప్రారంభం

**హైదరాబాద్ సిటీ, వెలుగు:** విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ప్రమాదాలను పూర్తిగా నివారించడం, క్షేత్రస్థాయి ఉద్యోగుల భద్రతను బలోపేతం చేయడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడమే లక్ష్యమని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేశ్‌వి.పాటిల్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో ఏర్పాటు చేసిన సురక్ష-2026 సేఫ్టీ ఎక్స్‌పో అండ్ వర్క్‌షాప్ ను ఆయన ప్రారంభించారు. ఈ ఎక్స్‌పోలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 20కి పైగా ప్రముఖ సంస్థలు క్షేత్రస్థాయి ఉద్యోగుల రక్షణకు ఉపయోగపడే వ్యక్తిగత భద్రతా పరికరాలు, ఇన్సులేటెడ్ టూల్స్, ఫాల్ ప్రొటెక్షన్ సిస్టమ్స్, ఎర్తింగ్ పరికరాలు, ఆధునిక టెస్టింగ్ ఉపకరణాలను ప్రదర్శించాయి. కార్యక్రమంలో టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు నర్సింహులు, శివాజీ, చక్రపాణి తదతరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ స్కూల్స్‌లో ఇన్వెస్టిచర్ వేడుక




**పద్మారావునగర్, వెలుగు:** సికింద్రాబాద్ బోయిన్‌పల్లి శాఖకు చెందిన సీఎంఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో 2026-27 విద్యాసంవత్సరానికి ఎన్నికైన స్టూడెంట్ కౌన్సిల్ బాధ్యతల స్వీకార కార్యక్రమాన్ని(ఇన్వెస్టిచర్‌వేడుక) శనివారం ఘనంగా నిర్వహించారు. బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి చీఫ్‌గెస్ట్‌గా హాజరై, నూతన విద్యార్థి నాయకులతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం వారికి బ్యాడ్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకత్వం అనేది కేవలం అధికారం కాదని, తోటి విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ సేవాభావంతో ముందుండటమని చెప్పారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణ, సైబర్ భద్రత, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పాఠశాల కార్యదర్శి, కరస్పాండెంట్ సీహెచ్. సౌజన్య రెడ్డి మాట్లాడుతూ.. స్టూడెంట్‌కౌన్సిల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. తమ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు నాయకత్వ లక్షణాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎంఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ ఎస్. కె.రెడ్డి, హైస్కూల్ ప్రిన్సిపాల్ డి.సునీత, ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ నుస్రత్, టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 'సర్' డిజిటలైజేషన్ పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న సీఈవో సుదర్శన్‌రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్

**హైదరాబాద్ సిటీ, వెలుగు:** ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వాలీబాల్ గ్రౌండ్, తాళ్లబస్తీ కమ్యూనిటీ హాల్‌లలో కొనసాగుతున్న 'సర్' డిజిటలైజేషన్ ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) సుదర్శన్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ శనివారం పరిశీలించారు. డిజిటలైజేషన్ తీరు, డేటా ఎంట్రీ నాణ్యత, మౌలిక సదుపాయాలు, విధుల్లో ఉన్న సిబ్బంది తదితర అంశాలపై ఆరా తీశారు. వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎలక్షన్స్ అడిషనల్ కమిషనర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై రెవెన్యూ రికవరీ యాక్ట్ అన్యాయం

- తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ

**కాచిగూడ, వెలుగు:** బ్యాంకు లోన్లు ఎగవేసే వారిపై ప్రయోగించే రెవెన్యూ రికవరీ యాక్ట్‌ను విద్యార్థులపై అమలు చేయడం అన్యాయమని తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల పేరుతో విద్యార్థుల కుటుంబాలపై ఈ చర్యలు చేపట్టడం ఆందోళనకరమని పేర్కొన్నారు. కాచిగూడలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 14 లక్షల మంది విద్యార్థులకు భరోసా కల్పించేలా సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.10 వేల కోట్ల ఫీజు బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టేందుకు ఫీజు నియంత్రణ చట్టాన్ని తేవాలని, సర్టిఫికెట్ల నిలిపివేతను ఆపాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు అర్జున్, తేజు, రుద్రాన్ష్, దేవాన్ష్, హరీశ్, ప్రణయ్ పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కులు నిర్వీర్యం



**మల్కాజ్ గిరి, వెలుగు:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కార్మిక హక్కులను నిర్వీర్యం చేస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ యూసుఫ్ ఆరోపించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఏఐటీయూసీ 4వ మహాసభల సందర్భంగా శనివారం యాప్రాల్‌లోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి, బాబూజీ నగర్ కమిటీ హాల్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. బడా పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్యుల జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకూ కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

## 'ఫీజు'పై అఖిలపక్ష సమావేశం నిర్వహించండి

- ఎంపీ ఆర్.కృష్ణయ్య

**ముషీరాబాద్, వెలుగు:** ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీంపై వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. విద్యానగర్ బీసీ భవన్‌లో శనివారం యువజన సంఘం అధ్యక్షుడు జిల్లపల్లి అంజి అధ్యక్షతన వివిధ బీసీ సంఘాలు, విద్యార్థి సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. జీవో నంబర్ 9ను రద్దు చేసి, పాత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్‌చేశారు. బకాయిల కోసం ఈ నెల 14న ఇందిరాపార్క్ వద్ద సత్యాగ్రహ దీక్ష, 16న కలెక్టరేట్ల ముట్టడి చేపట్టనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో గురుకులాల డిమాండ్‌కు అనుగుణంగా ప్రభుత్వం అదనంగా 150 బీసీ గురుకుల పాఠశాలలు, 120 కాలేజ్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు అనంతయ్య, రాజేందర్, గుజ్జ కృష్ణ, నిఖిల్ పటేల్, లక్ష్మి, అడ్వకేట్ శివకుమార్, రాజు నేత పాల్గొన్నారు.

## మౌలాలిలో నకిలీ డాక్టర్ అరెస్ట్



**మల్కాజ్‌గిరి, వెలుగు:** వైద్య అర్హతలు లేకుండా క్లినిక్ నడుపుతున్న నేరేడ్‌మెట్‌లోని ప్రగతి నగర్‌కు చెందిన షేక్ జాన్ పాషా(52) అనే నకిలీ డాక్టర్‌ను మల్కాజ్‌గిరి పోలీసులు అరెస్ట్ చేశారు. మౌలాలిలోని షఫీ నగర్ వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా పాషా క్లినిక్ నిర్వహిస్తూ.. ప్రజలను మోసగిస్తున్నట్లు ఎస్సై గణేశ్‌బాబుకు సమాచారం అందింది. దీంతో శనివారం తన సిబ్బందితో వెళ్లి, క్లినిక్‌పై దాడి చేశారు. పేషెంట్లకు చికిత్స అందిస్తున్న జాన్ పాషాను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విచారణలో అతను ఎలాంటి వైద్య అర్హత పత్రాలు చూపించలేకపోయాడు. తానేమీ చదువుకోకపోయినా, చాలా కాలంగా వైద్యం చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు అంగీకరించాడు. క్లినిక్ నుంచి స్టెతస్కోప్, బీపీ మెషీన్, ప్రిస్క్రిప్షన్ బుక్, ఇంజెక్షన్లు, మందులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తును ఎస్సై ఉపేందర్‌కు అప్పగించినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

# ఎండిపోయిన బోర్లకు 'రీచార్జ్'



- ఇంజక్షన్ బోర్ వెల్ వ్యవస్థకు వాటర్ బోర్డు శ్రీకారం
- గుట్టల బేగంపేటలో ప్రారంభించిన ఎండీ అశోక్‌రెడ్డి
- నీటి సంరక్షణను బాధ్యతగా నిర్వహించాలని పిలుపు

### నీటి కష్టాలకు చెక్ పెట్టడమే లక్ష్యం

**హైదరాబాద్, వెలుగు:**

నగరంలో భూగర్భ జలమట్టం పడిపోవడంతో బోర్‌వెల్స్ ఎండిపోయాయి. తిరిగి వాటికి ప్రాణం పోసేందుకు మెట్రో వాటర్ బోర్డు సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. 'ఇంజక్షన్ బోర్ వెల్స్' సాంకేతికత ద్వారా వర్షపు నీటిని భూమిలోకి పంపి, ఎండిపోయిన బోరు బావులను రీఛార్జ్ చేయాలని నిర్ణయించింది. ముఖ్యంగా వెస్ట్ సిటీలో ఈ ప్రాజెక్టును వేగవంతం చేస్తోంది.

**వర్షపు నీటిని ఒడిసి పడితేనే భద్రత**

గుట్టల బేగంపేటలోని బీవర్లీ హిల్స్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన ఇంజెక్షన్ బోర్ వెల్ వ్యవస్థను మెట్రో వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో నీటి భద్రత కేవలం ప్రభుత్వ చర్యలతోనే సాధ్యం కాదన్నారు. ఇందులో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఇల్లు, కుటుంబం, అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీ వర్షపు నీటి సంరక్షణను తమ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల కోసం నామమాత్రంగా ఇంకుడు గుంతలు నిర్మించకుండా.. భవనంపై పడే ప్రతీ వర్షపు చుక్కను భూమిలోకి ఇంకేలా శాస్త్రీయమైన రూఫ్‌టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పద్ధతులను పాటించాలని సూచించారు. ఇంకుడు గుంతను, పాడైపోయిన బోరుబావిని వినియోగించి ఏర్పాటు చేసిన రీచార్జ్ పిట్ (ఇంజక్షన్ బోర్ వెల్)తో తిరిగి నీటిని పొందవచ్చని తెలిపారు.

### పెరుగుతున్న ట్యాంకర్ల డిమాండ్

నగరంలో నీటి కొరత తీవ్రతను అంచనా వేసేందుకు వాటర్ బోర్డు ట్యాంకర్ బుకింగ్ డేటాను విశ్లేషిస్తోంది. గతేడాది 4 వేల అపార్ట్‌మెంట్లు ట్యాంకర్ల కోసం బుక్ చేసుకోగా.. ఈ ఏడాది ఆ సంఖ్య ఏకంగా 12,500కు పెరిగింది. గతంలో జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి వంటి ప్రాంతాలకే పరిమితమైన డిమాండ్, ఇప్పుడు ఉప్పల్, ఎల్‌బీ నగర్, మల్కాజ్‌గిరి వంటి ప్రాంతాలకు కూడా విస్తరించినట్లు ఎండీ తెలిపారు. వర్షాలు ఆలస్యం కావడం, భూగర్భ జలాలు అడుగంటడమే దీనికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. బీవర్లీ హిల్స్ లోని అపార్ట్‌మెంట్ వాసులు చేపట్టిన వర్షపు నీటి సంరక్షణ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. వాటర్ బోర్డు సైబరాబాద్ రీజినల్ ఈడీ సంతోష్, డైరెక్టర్(ఆపరేషన్స్) నారాయణ, జీఎం హరిశంకర్, ఇంకుడుగుంతల ప్రత్యేక అధికారి జాల సత్యనారాయణ, బీవర్లీ హిల్స్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఆర్టీసీ కార్గోలో వేలం

**హైదరాబాద్‌సిటీ, వెలుగు:** టీజీఎస్‌ఆర్టీసీ కార్గో విభాగంలో కస్టమర్లు క్లెయిమ్ చేయని వస్తువులను సోమవారం వేలం వేస్తున్నట్లు కంటోన్మెంట్ డిపో మేనేజర్ కవిత ఒక ప్రకటనలో తెలిపారు. పార్సిల్‌ఫిట్‌మెంట్ వాల్యూపై 50 శాతం తక్కువగా వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆటోమొబైల్ స్పేర్స్, బయోమెడికల్, క్లాత్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, జనరల్, ఫార్మా, స్టేషనరీ వంటివి 52 వస్తువులు ఉన్నాయన్నారు. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు జూబ్లీ బస్ స్టేషన్‌లోని కార్గో కౌంటర్‌లో వేలం జరుగుతుందని పేర్కొన్నారు.

IN THE COURT OF THE HON'BLE
I ADDL. DISTRICT JUDGE
MEDCHAL–MALKAJGIRI DISTRICT
AT: KUSHAIGUDA
I.A.No. 80 OF 2022
IN
O.S.No. 1173 OF 2015

**Between:**
Mekala @ Chindam Laxmi Narsamma
**...Petitioner / Plaintiff**
**And**
Mekala Narsamma & others
**...Respondents / Defendants**
**And**
Sri. P. Bhava Narayana & 3 others
**...Proposed Respondents / proposed Defendant Nos. 15 to 18**

**To,**
**R16. Sri Tej Prathap Singh S/o. Ramchander Singh, R/o. H.No. 1-3, Peerzadiguda Village, Medipally Mandal, Medchal–Malkajgiri District.**
**R18. M/S. Tirumala Agri Tech Pvt Ltd, Rep By its Manging Director B.V. Raghavulu S/o. Late Veeraiah, R/o. H.No. 2-1-88/1, Anand Nagar X Road, Bandlaguda, Hyd.**

Please take notice in the above said **O.S. NO. 1173 OF 2022**, has been filed for Partition & separate possession against the respondents/defendants. In the above suit the plaintiff filed an implead petition Vide **I.A.No. 80 OF 2022** to implead you as proposed respondents / Defendants No. **R16 & R18** and said I.A. is posted on **24.07.2026** for your appearance. Therefore if you have any objections in this regard please appear before the **Hon'ble I Addl District Judge Medchal–Malkajgiri District, Kushaiguda, by 10.30 A.M. on Dated: 24-07-2026** by person or through your counsel failing which the matter shall be decided in your absence basing on the merits of the case.

**Sd/- M/s. B. SAI SIDDHARTHA**
ADVOCATE
R/o. H.No. 1-75/5/88, Road No.4
Sri Sai Ram Nagar Colony
Boduppal Village, Medipally Mandal
Medchal – Malkajgiri Dsitrict, Telangana.
**Ph: 9885519960**

**COURT NOTICE**
IN THE COURT OF THE HON'BLE
IV ADDL. SENIOR CIVIL JUDGE
R.R.DISTRICT :: AT: L.B.NAGAR
O.S. No. 283 OF 2026

**Between:**
1. **Smt. Akula Varalaxmi** W/o. Late Akula Bapuji Gupta, aged about 75 years, Occ: Household, R/o. H.No.19-6, Vivekananda Nagar Colony, Near Ramakrishna Sarada Vidyalayam, Gaddiannaram, Dilsukhnagar, Ranga Reddy District-500060., Telangana.
2. **Sri Akula Anil Kumar Guptha** S/o. Late Akula Bapuji Gupta, aged about 57 years, Occ: Pvt. Employee, R/o. 19-6, Raja Rajeshwara Nilayam, Vivekananda Nagar, backside Ramakrishna Sarada Vidyalayam, Dilsukhnagar, Ranga Reddy District-500060., Telangana.
3. **Sri Akula Mahesh Kumar Guptha** S/o. Late Akula Bapuji Gupta, aged about 55 years, Occ: Pvt. Employee, R/o. 19-6, Vivekananda Nagar, Near Pananiya School, Gaddiannaram, Saroornagar, Ranga Reddy District-500060, Telangana.
4. **Sri Akula Shiva Kumar Gupta** S/o. Late Akula Bapuji Gupta, aged about 52 years, Occ: Pvt. Employee, R/o. 19-6, Vivekananda Nagar, Sri Ramakrishna Sarada School, Dilsukhnagar, Ranga Reddy District-500060., Telangana.
5. **Smt Todupunoori Umarani** W/o. T.Ravinder, D/o. Late Akula Bapuji Gupta, aged about 50 years, Occ: Household, R/o. Q.No.3044, Type 3, ODF Estate, O.F. Yeddumailaram, Medak-502205, Telangana. **....Plaintiffs**

**AND**

1. The Tahasildar, Hayathnagar Mandal, Office at RTC Supervisors Colony, Vijayawada Highway, Hayathnagar Khalsa, R.R.District-501505.
2. Sri Aravapally Sambaram S/o. A.Gopal, aged about 53 years, Occ: Business, R/o. H.No. 11-9-109, SBI Colony, Kothapet, Saroornagar, R.R.District-500035.
3. ALL CONCERNED **...Defendants**

**To,**
**All Concerned**

Please take Notice that all the General Public are informed that, the above named Plaintiffs have filed the above Suit for declaring them as Legal Heirs of Deceased Late Akula Bapuji Gupta S/o. Akula Buchi Rajaiah, in respect of Non-Agricultural **Land bearing Plot No.6**, admeasuring **267 Sq.Yards or 223.212 Sq.Mtrs.**, in **Sy.No's 44/e, 44/e, 45/e, 45/e, and 58**, situated at **Anmagal Hayathnagar Village, Hayathnagar Revenue Mandal, Ranga Reddy District, and** Land bearing **Plot No.132**, in **Sy.No. 128 and 130**, admeasuring **244 Sq.Yards or 204.01 Sq.Mtrs.**, Situated at **Koheda Village, Hayathnagar Revenue Mandal, Ranga Reddy District**, and the above suit is posted to **05-08-2026**, at about **10:30 A.M.**, on the file of above Hon'ble Court for any objections. As such any person or persons have any objections to declare them as Legal Heirs of Deceased **Late Akula Bapuji Gupta S/o. Akula Buchi Rajaiah**, make it convenient to appear either in person or through an Advocate, before the above Court. Failing which, the matter will be decided as prayed.

*(By Order of the Court)*
**Sd/- (V.Chandrakanth),** Advocate
H.No. 1-5-598/2, Flat No. 302, Vaishnavi Moukthika Apartment, Road No.6
New Maruthinagar, Kothapet, Hyderabad-60
**Mobile No.: 9948665744**

## జాబ్‌మేళాలో 1,306 మందికి ఉద్యోగాలు



**ఉప్పల్, వెలుగు:** తెలంగాణ ట్రైనింగ్ అండ్‌ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్, జీవీకే ఫౌండేషన్ ల ఆధ్వర్యంలో శనివారం ఓయూలో నిర్వహించిన మెగా జాబ్‌మేళా సక్సెస్‌అయిందని నిర్వాహకులు తెలిపారు. 9 వేల మందికి పైగా నిరుద్యోగ యువత హాజరవగా.. పలు కంపెనీలు 1,306 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశాయి. మొదటి విడతలో 26 మందికి ఆఫర్‌లెటర్లు అందజేశారు. అసోసియేషన్‌ప్రెసిడెంట్ డాక్టర్ జైరాం, ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ జీవీకే, వలంటీర్లు పాల్గొన్నారు.

## చెత్త ఆటో ఢీకొని రైతు మృతి



**తాండూరు, వెలుగు:** చెత్త ఆటో ఢీకొని ఓ రైతు మృతి చెందాడు. వికారాబాద్‌జిల్లా అంతారం గ్రామానికి చెందిన తాండ్ర కిష్టప్ప(55) పనిమీద ఆదివారం కాలినడకన తాండూరు వెళ్తున్నాడు. అదే సమయంలో డంపింగ్ యార్డు నుంచి తాండూరు వైపు వెళ్తున్న మున్సిపల్ చెత్త ఆటో అంతారం శ్మశానవాటిక సమీపంలో ఆయనను వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిష్టప్పకు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు జిల్లా ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. డాక్టర్లు పరీక్షించి, కిష్టప్ప మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పరమేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు.

## బిల్డింగ్ ఎఫ్‌టీఎల్‌లో ఉందని కేటీఆర్‌కు చెప్పినా పట్టించుకోలే

- ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ కు హైడ్రా నోటీసులను స్వాగతిస్తున్నా
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



**సైఫాబాద్, వెలుగు:** సోమాజీగూడలో ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ నిర్మించిన బిల్డింగ్‌కు హైడ్రా నోటీసులు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నానని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఈ విషయంలో హైడ్రా ఒక అడుగు వెనక్కి వేస్తే తాను పది అడుగులు ముందుకు వేస్తానని స్పష్టం చేశారు. ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు శనివారం చెక్కులు అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌బిల్డింగ్ ఎఫ్‌టీఎల్ లో ఉందని అప్పటి మంత్రి కేటీఆర్‌కు చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌ను రక్షించేందుకు ఖైరతాబాద్‌లోని బీఎస్ మక్త, ఎంఎస్ మక్త ప్రాంతాల ప్రజలను బీఆర్ఎస్ నాయకులు తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. ఆ బస్తీల ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, వారి ఇండ్లకు ఎలాంటి హాని జరగదని పేర్కొన్నారు. రహదారి కారణంగా ఇండ్లు కోల్పోయే వారికి స్థానికంగానే ఇండ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నీట్ లీకేజీపై ఎస్ఎఫ్ఐ నిరసన

- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్

**ముషీరాబాద్, వెలుగు:** నీట్-2026 పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. శనివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద ఫెడరేషన్‌నాయకులు నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రజినీకాంత్, టి.నాగరాజు మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణలో మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. పేపర్ లీకేజీల వల్ల 22.79 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం పరీక్షా వ్యవస్థను కోచింగ్ మాఫియాకు, కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టిందని మండిపడ్డారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో న్యాయ విచారణ జరిపి, నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలన్నారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని, విద్యార్థులకు పరిహారం అందించడంతోపాటు రాష్ట్రాలకు సొంతంగా ప్రవేశ పరీక్షలు నిర్వహించుకునే హక్కు కల్పించాలని డిమాండ్‌చేశారు. ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు ఎం.మమత, పలువురు నాయకులు పాల్గొన్నారు.



క్విక్ బైట్స్



## గుట్ట పాలక మండలి ప్రమాణ స్వీకారం

- హాజరైన మంత్రి కొండా సురేఖ, ఎంపీ చామల, ఎమ్మెల్యే బీర్ల

**యాదగిరిగుట్ట, వెలుగు:** యాదగిరిగుట్ట ఆలయ పాలకమండలి సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్ తో పాటు 10 మంది బోర్డు సభ్యులు, ఏడుగురు ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిసి 18 మందితో కొత్త పాలకమండలి కొలువుదీరింది. ప్రధానాలయ ముఖ మండపంలో బోర్డు సభ్యులతో ఆలయ ఈవో భవానీ శంకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. దాదాపు 17 ఏండ్ల తర్వాత ఆలయ ట్రస్ట్ బోర్డు కొలువుదీరింది. యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ బోర్డుచైర్మన్ గా మన్నె సత్యనారాయణ రెడ్డి, సభ్యులుగా ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి, కొణిదెల సురేఖ, చిలప్పగారి విజయరాజం, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, గుండా మల్లయ్య, స్వాతి కంతమణి, రాఘవేందర్ రావు, డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, ఎక్స్ అఫీషియో సభ్యులుగా దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్ రావు, ఈవో భవానీ శంకర్, ఆలయ ప్రధానార్చకులు కాందూరి వెంకటాచార్యులు ప్రమాణ స్వీకారం చేశారు. బోర్డు సభ్యులు తూళ్ల విజయేందర్ గౌడ్, నరసింహమూర్తి, ఎక్స్ అఫీషియో సభ్యులు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు గైర్హాజరయ్యారు. ప్రమాణ స్వీకారానికి మంత్రి కొండా సురేఖ, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చీఫ్ గెస్టులుగా హాజరై బోర్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

**భక్తులకు మెరుగైన సౌలతులు కల్పిస్తాం**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని వైటీడీ బోర్డు చైర్మన్ మన్నె సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం ప్రెసిడెన్షియల్ సూట్ లో బోర్డు చైర్మన్ అధ్యక్షతన పాలకమండలి తొలి సమావేశాన్ని నిర్వహించారు. ఆలయంలో సమస్యలపై చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ భక్తులు ఇబ్బంది పడకుండా ఎలాంటి ఏర్పాట్లు చేయాలో చర్చించామని తెలిపారు. భక్తులకు వసతి సమస్య ఉన్నట్లు గుర్తించామని, దీక్షాపరులకు కొండపైన నిద్ర చేయడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. టెంపుల్ సిటీలో విల్లాలు కట్టాలా? టవర్స్ బిల్డింగులు నిర్మించాలా? అనే విషయంపై ప్రభుత్వంతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

## నేరెళ్ల థర్డ్ డిగ్రీ బాధితుడు గంధం గోపాల్ మృతి

- అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూత
- టీఆర్ఎస్ చీఫ్ కవిత సంతాపం



గంధం గోపాల్(ఫైల్)

**రాజన్న సిరిసిల్ల, వెలుగు:** తొమ్మిదేండ్ల క్రితం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేరెళ్ల పోలీసుల థర్డ్ డిగ్రీ ఘటనలో బాధితుడైన గంధం గోపాల్ శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. నేరెళ్లలో ఇసుక రవాణాను అడ్డుకున్నందుకు 8 మందిపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడినప్పటి నుంచి గంధం గోపాల్ ఆరోగ్యం సరిగా లేదు. కుడికాలుకు తీవ్ర గాయాలు కావడంతో సరిగా నడవలేని పరిస్థితి ఏర్పడింది. అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న అతడు శనివారం కన్నుమూశాడు. గంధం గోపాల్‌కు భార్య లావణ్య, కుమార్తెలు అక్షిత(22), నిఖిత(18), కొడుకు అభినయ్(16) ఉన్నారు. మరో బాధితుడు పెంట బాణయ్య ఇప్పటికీ కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు.

**నేరెళ్లలో అసలేం జరిగింది?**

2017లో మిడ్‌మానేరు జలాశయ ముంపు ప్రాంతాల్లో ఇసుక తవ్వకాల కోసం నాటి బీఆర్ఎస్ సర్కార్ అనుమతులు ఇవ్వడంతో రోజూ వందలాది లారీలు ఇసుక రవాణా చేసేవి. కొంతమంది డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపడంతో తరచూ ప్రమాదాలు జరిగేవి. 2017 జులై 2న తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల వద్ద ఇసుక లారీ ఢీకొని నేరెళ్ల గ్రామానికి చెందిన రైతు బదనపు భూమయ్య మృతిచెందాడు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు నేరెళ్ల వద్ద ఇసుక లారీలను తగులబెట్టారు. ఈ ఘటనలో పోలీసులు పలువురిపై హత్యాయత్నం సహా వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి 8 మందిని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని 2017 జులై 8న రిమాండ్‌కు తరలించగా, వారి శరీరాలపై తీవ్ర గాయాలు ఉండటంతో అప్పటి కరీంనగర్ జైలర్ శివకుమార్ మొదట రిమాండ్‌కు నిరాకరించారు. దీంతో పోలీసులు పెయిన్ కిల్లర్స్ ఇచ్చి, ఆరోగ్యంగా ఉన్నట్లు డాక్టర్ల ధ్రువీకరణ పత్రాలు సమర్పించి జైలుకు తరలించారు. జైలు లోపలికి వెళ్లాక నలుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో పోలీసుల థర్డ్ డిగ్రీ ఆరోపణలు వెలుగులోకి వచ్చి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.

**బీఆర్ఎస్‌ను కుదిపేసిన ఘటన..**

అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ ఘటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. వివిధ పార్టీల నేతలు, హక్కుల సంఘాల నేతలు బాధితులను పరామర్శించి పోలీసుల తీరును ఖండించారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్ సొంత నియోజకవర్గంలో ఆ ఘటన జరగడం ఆ పార్టీకి మరింత మైనస్ అయింది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా అప్పుడు ప్రతిపక్ష నేతలుగా బాధితులను పరామర్శించారు. కాగా, గంధం గోపాల్ మృతిపై టీఆర్ఎస్ చీఫ్ కవిత సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు. గోపాల్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. త్వరలో ఆయన కుటుంబ సభ్యులను కలిసి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు.

ప్రేమించిన వాడు దూరమయ్యాడని

## యువతి ఆత్మహత్య



అర్చన(ఫైల్)

**లక్సెట్టిపేట, వెలుగు:** ప్రేమించిన వాడు దూరమయ్యాడని ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం చందారం గ్రామానికి చెందిన అర్చన(21) కొంత కాలంగా ఓ యువకుడిని ప్రేమిస్తోంది. అతను నెల రోజుల కింద ఆత్మహత్య చేసుకోగా, అప్పటి నుంచి దిగాలుగా ఉంటున్న ఆమెను కుటుంబ సభ్యులు ఓదారుస్తూ వచ్చారు. శనివారం తండ్రి ఆటో నడపడానికి వెళ్లగా, తల్లి, సోదరుడు గుడికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి దూలానికి చీరతో ఉరేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## హెడ్ కానిస్టేబుల్ సూసైడ్



ప్రభాకర్‌రెడ్డి(ఫైల్)

**బెల్లంపల్లి రూరల్, వెలుగు:** మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కుశ్నపల్లి గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎమునూరి ప్రభాకర్‌రెడ్డి(48) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. దహెగాం స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న అతడికి ఇటీవల హిప్ సర్జరీ(తుంటి శస్త్రచికిత్స) జరిగింది. నొప్పి కారణంగా డ్యూటీకి హాజరు కాలేకపోతున్నాడు. ఇటీవల మళ్లీ నొప్పి తిరగబెట్టడంతో భరించలేక ఈ నెల 8న కుశ్నపల్లి శివారులోని ఎల్లమ్మ గుడి వద్ద పురుగు మందు తాగాడు. అతడిని 108లో మంచిర్యాలలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం చనిపోయాడు. మృతుడికి భార్య లక్ష్మి, పిల్లలు రిశ్విక, మౌనిక ఉన్నారు. మృతుడి సోదరుడు మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## పాత పెన్షన్ పునరుద్ధరించాలి

- జన జాగరణ యాత్ర షురూ



**భద్రాచలం, వెలుగు:** తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్(టీఎస్‌సీపీఎస్ఈయూ) ఆధ్వర్యంలో సీపీఎస్ రద్దుకు జన జాగరణ యాత్ర శనివారం భద్రాచలంలో ప్రారంభమైంది. రాముడి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జిల్లా అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని తెలిపారు.


# గోండీ, కొలాం భాషలకు
# తెలుగు యాప్

## స్వేచ్ఛా యాప్ రూపొందిస్తున్న హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ

- 200 గంటల భాషా పదాల రికార్డింగ్
- ఆగస్టు 15న అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నం
- ఐటీడీఏ పీవో మంద మకరందు ప్రత్యేక చొరవతో సాకారం



గోండీ, కొలాం వాక్యాలను రికార్డు చేస్తున్న ఆదివాసీ టీచర్లు




గోండీ, కొలాం వాక్యాలను రికార్డు చేస్తున్న స్వేచ్ఛా యాప్

**ఆదిలాబాద్, వెలుగు:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గోండీ, కొలాం భాష మాట్లాడే ఆదివాసీల్లో చాలా మందికి తెలుగు అంతగా రాదు. తమ వ్యక్తిగత సమస్య తెలియజేయాలన్నా.. అధికారులను కలిసి విన్నవించాలన్నా.. తెలుగువచ్చిన వారి సహాయం తప్పనిసరి. ఇప్పటికీ మధ్యవర్తులు లేకుండా కలెక్టరేట్, ఐటీడీఏకు వెళ్లలేకపోతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ పీవో మంద మకరందు నిర్ణయించారు. ఏఐ యాప్ లలో భాష అనువాదం చేసుకునే వెసులుబాటు ఉండడంతో, గోండీ,కొలామి భాషను తెలుగులో అనువాదం చేసేందుకు ఐటీడీఏ ఒక ప్రత్యేక మిషన్ రూపొందిస్తారు. ఇందులో భాగంగా హైదరాబాద్ లోని ట్రిపుల్ ఐటీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఏఐ ద్వారా గోండీ, కొలాం భాషలను తెలుగులోకి, తెలుగును గోండీ, కొలాం భాషల్లోకి అనువాదం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గోండీ, కొలాం భాషలు సులువుగా అర్థమయ్యేలా ప్రాజెక్టును డిజైన్ చేస్తున్నామని, మిషన్ అందుబాటులోకి వచ్చాక భాషతో పాటు గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు పొందుపర్చేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

**తీరనున్న తిప్పలు..**

గోండీ, కొలామి భాషలను స్వేచ్ఛా యాప్ లో నిక్షిప్తం చేసేందుకు రెండు నెలలుగా రెండు భాషలకు సంబంధించిన 20 వేల పదాలను సేకరిస్తున్నారు. ఇప్పటికే 18 వేల గోండీ, 14 కొలాం వాక్యాలను సేకరించారు. 200 గంటల పాటు గోండీ, కొలామి భాషల పదాలను రికార్డింగ్ చేయనున్నారు. ఇందులో ఇప్పటికే 20 గంటల రికార్డింగ్ పూర్తి చేశారు. పెసా మొబలైజర్లు, సూపర్ వైజర్లు, రాయిసెంటర్ పెద్దలు, గ్రామ పటేళ్ల నుంచి వీలైనన్ని పదాలను సేకరిస్తున్నారు. వీటిని అనువదించి యాప్ లో పొందుపరుస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తైతే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తెలుగు మాట్లాడలేని ఆదివాసీల ఇబ్బందులు తీరుతాయి. మిషన్ అందుబాటులోకి వచ్చిన తర్వాత అందులో పొందుపర్చే ఏఐ యాప్ ద్వారా గోండీ, కొలాం భాషలో మాట్లాడితే క్షణాల్లో మనకు ఆడియో లేదంటే టెక్స్ట్ రూపంలో వస్తుందని అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారులకు గిరిజనులు తమ సమస్యలను సులువుగా చెప్పుకొనేందుకు అవకాశం కలగనుంది. అలాగే గోండీ, కొలాం భాష రాని అధికారులు సైతం ఎలాంటి ఇబ్బంది లేకుండా అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఐటీడీఏ ఆఫీస్ లో వాక్యాల సేకరణను గోండీ భాష కో ఆర్డినేటర్ దేవరావు, కొలాం భాష కో ఆర్డినేటర్ ప్రవీణ్ పర్యవేక్షిస్తున్నారు. గోండీ, కొలా భాషలకు సంబంధించి ఎవరైనా ఇంకా తప్పిపోయిన పదాలు చెప్పాలనుకుంటే 9492585451, 9492128599లో సంప్రదిస్తే తాము రికార్డు చేసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

**ఇబ్బందులు దూరం చేసేందుకే..**



"గోండీ, కొలామి భాష మాట్లాడే వారికి తెలుగు రాక తమ సమస్యను అధికారులకు చెప్పకోలేకపోతున్నారు. ఈ సమస్యను తీర్చేందుకు భాష మిషన్ ను తయారు చేస్తున్నాం. ఇంగ్లీష్ మాదిరిగానే గోండీ, కొలాం భాష అందరికీ అర్థం అయ్యేలా, ఆదివాసీ భాష, సంస్కృతిని కాపాడేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఆగస్టు 15న మిషన్ అందుబాటులోకి తీసుకురావాలని టార్గెట్ పెట్టుకున్నాం. మిషన్ వచ్చిన తర్వాత యాప్ లలో పొందుపర్చుతాం.

– మంద మకరందు, పీవో, ఐటీడీఏ ఉట్నూర్



## సింగరేణి, ప్రభుత్వం కలిసి.. కార్మికుల శ్రమను దోచుకుంటున్నయ్

- టీఆర్ఎస్ చీఫ్ కవిత

**సత్తుపల్లి, వెలుగు:** సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి కార్మికుల హక్కులను కాలరాస్తూ శ్రమను దోచుకుంటున్నాయని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో బాయిబాట కార్యక్రమం చేపట్టారు. అనుచరులతో కలిసి మైన్‌లోకి వెళ్లేందుకు యత్నించగా అనుమతి లేదంటూ గేట్ లను మూసివేశారు. దీంతో కొంత సేపు ఉద్రిక్తత నెలకొంది. గేట్ తాళాలను పగలగొట్టి లోనికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఎంఎస్ యూనియన్ నిజాలు బయటపెడుతుందనే భయంతో సింగరేణి యాజమాన్యం పోలీసులు సెక్యూరిటీ పెట్టి అడ్డుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఎర్ర జెండా కప్పుకున్న కొన్ని యూనియన్లు యాజమాన్యానికి సపోర్ట్ చేయడం సిగ్గు చేటన్నారు. సింగరేణి కార్మికులకు ఇప్పటి వరకు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కూడా లేదన్నారు. సత్తుపల్లిలో కొత్త గా వచ్చే గనులను సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. రెండు బెడ్లతో సింగరేణి హాస్పిటల్ ను నడపడం సరైంది కాదన్నారు. సింగరేణి కార్మికుల హక్కులను కాలరాస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కౌంట్ డౌన్ స్టార్ట్ అయిందని, కార్మికుల హక్కుల కోసం హెచ్ఎంఎస్ అండగా ఉంటుందని తెలిపారు.

## కేటీకే5 గనిలో కార్మికుడికి గాయాలు

**జయశంకర్ భూపాలపల్లి, వెలుగు:** భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5 గనిలో శనివారం జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు గాయపడ్డాడు. గనిలో డ్యూటీ చేస్తున్న జనరల్ అసిస్టెంట్ పృథ్వీపై ప్రమాదవశాత్తు పైపు పడడంతో గాయాలైనట్లు అధికారులు తెలిపారు. తోటి కార్మికులు 108లో ఆసుపత్రికి తరలించారు. గని అధికారులు హాస్పిటల్‌కు చేరుకొని కార్మికుడిని పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

సారూ.. పోడు భూములు

# సాగు చేయనిస్తలే!

- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం సూర్దపూర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావుకు మహిళా రైతు మొర
- దశాబ్దాలుగా సాగు చేస్తున్న తమను ఫారెస్ట్ ఆఫీసర్లు అడ్డుకుంటున్నారని ఆవేదన



మంత్రి జూపల్లి వద్ద కన్నీళ్లు పెట్టుకున్న మహిళా రైతు గుజ్జుల లక్ష్మి

**ఆసిఫాబాద్, వెలుగు:** దశాబ్దాలుగా సాగు చేస్తున్న పోడు భూముల్లో పంటలు వేయకుండా ఫారెస్ట్ ఆఫీసర్లు అడ్డుకొని, కందకాలు తవ్వుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు ఎదుట మహిళా రైతు కన్నీళ్లు పెట్టుకుంది. శనివారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి మండలాల్లో మంత్రి పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా కెరమెరి మండలం ధనోర గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సూర్దపూర్ గ్రామానికి చెందిన మహిళా రైతు గుజ్జుల లక్ష్మి మంత్రి ఎదుట కన్నీళ్లు పెట్టుకుంది. పోడు భూములే తమకు జీవనాధారమని, భూములు లాక్కుంటే ఎట్ల బతకాలని వాపోయింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని వేడుకుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులు, గిరిజనేతరులు ఇళ్లు నిర్మించుకోవడం, వ్యవసాయం చేసుకునేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆర్వోఎఫ్ఆర్ చట్టం ప్రకారం 2005కు ముందు నుంచి అటవీ భూములను సాగు చేసుకుంటున్న వారికి మాత్రమే పట్టా పొందే హక్కు ఉంటుందని చెప్పారు. గిరిజనేతరులకు ఈ చట్టం వర్తించకపోయినా, 30 నుంచి 40 ఏండ్లుగా ఆ భూములపై ఆధారపడి జీవిస్తున్న పేదలను ఇబ్బంది పెట్టవద్దని అటవీ అధికారులకు సూచించినట్లు తెలిపారు. కొత్తగా అడవిని నరికి సాగు చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. అటవీ భూముల సమస్యపై డీఎఫ్‌వో, కలెక్టర్, అటవీ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి, బాధితుల సమక్షంలో చర్చించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్ కె.హరిత, అడిషనల్ కలెక్టర్ యువరాజ్ మమ్మాట్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎస్పీ నితికా పంత్, లైబ్రరీ చైర్మన్ అనిల్, ఏఎంసీ చైర్ పర్సన్ మంగ పాల్గొన్నారు.

## ప్రతి పల్లెకు బస్సు నడపడమే లక్ష్యం

- మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి
- హుజూర్‌నగర్, కోదాడలో కొత్త బస్టాండ్‌ల నిర్మాణానికి శంకుస్థాపన



ప్రయాణికులతో కలిసి బస్సులో ప్రయాణిస్తున్న మంత్రులు పొన్నం, ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి

**హుజూర్‌నగర్/కోదాడ, వెలుగు:** రాష్ట్రంలోని రోడ్డు సౌకర్యం ఉన్న ప్రతి పల్లెకు ఆర్టీసీ బస్సును నడపడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం హుజూర్ నగర్ లో రూ. 3.52 కోట్లతో, కోదాడలో రూ.17 కోట్లతో నిర్మించే బస్టాండ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీలో 3,500 మందికి కొత్త ఉద్యోగాలు కల్పించామని, వెయ్యి కారుణ్య నియామకాలు చేపట్టామని, 250 మంది డిస్మిస్ కార్మికులను తిరిగి ఉద్యోగంలోకి తీసుకున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్న కాలంలో పదుల సంఖ్యలో కార్మికులు చనిపోయినా పట్టించుకోలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం సమ్మె నోటీస్ ఇస్తేనే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటివరకు 327 కోట్ల ఫ్రీ బస్సు టికెట్లు జారీ అయ్యాయని, వీటి విలువ రూ.11,400 కోట్లు ఉంటుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని, కుంగిపోయి, కూలిపోయిన ప్రాజెక్టుపై రాజకీయ విమర్శలు తగదని హితవు పలికారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతులను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా స్కూల్, రూ.50 కోట్లతో జవహర్ నవోదయ స్కూల్, రూ.21 కోట్లతో వంద పడకల హాస్పిటల్, రూ.26 కోట్లతో సిటీ స్కాన్, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు ప్రారంభించినట్లు తెలిపారు. హుజూర్ నగర్ నుంచి కోదాడ వరకు మంత్రులు ఆర్టీసీ బస్సులో ప్రయాణికులతో కలిసి ప్రయాణం చేశారు. ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్ పర్సన్ దొంతగాని శ్రీనివాస్, ఏఎంసీ చైర్‌పర్సన్ రాధిక పాల్గొన్నారు.



## గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు

**కల్లూరు, వెలుగు:** సీతారామ ప్రాజెక్టు ద్వారా విడుదలైన గోదావరి జలాలు శనివారం ఖమ్మం జిల్లా కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని కప్పల బంధం రెగ్యులేటర్ కు చేరుకోవడంతో రైతులు, కాంగ్రెస్ నాయకులు పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య గోదావరి జలాలకు పూజలు చేసి హారతులిచ్చారు. గోదావరి జలాలు రావడం పట్ల నేతలు పసుమర్తి చంద్రరావు, పోట్రు అర్జున్ రావు, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి ప్రభాకర్ చౌదరి, కల్లూరు మున్సిపల్ చైర్ పర్సన్ ధారావత్ మోహన్ నాయక్, షేక్ ఉస్మాన్, జాస్తి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.

## నిర్మల్, నిజామాబాద్‌లో దొంగల హల్‌చల్

- మహిళా టీచర్‌ను కత్తులతో బెదిరించి చోరీ



చైన్ స్నాచింగ్ జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య

**నిర్మల్, వెలుగు:** నిర్మల్ పట్టణంలోని శాంతినగర్ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న తన్వి అపార్ట్‌మెంట్‌లో శనివారం తెల్లవారుజామున దొంగలు బీభత్సం సృష్టించారు. అపార్ట్‌మెంట్ మెయిన్ గేట్ తాళాన్ని కట్టర్‌తో కట్ చేసి లోపలికి వెళ్లిన దుండగులు ముందుగా 303 ఫ్లాట్ తలుపులు బద్దలు కొట్టారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. విలువైన వస్తువులేవీ దొరకకపోవడంతో, రెండో ఫ్లోర్‌లోని 207 ఫ్లాట్‌లోకి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న గవర్నమెంట్ టీచర్ సరితను కత్తులతో బెదిరించి ఇంట్లోని బంగారు నగలు, రూ.10 వేల నగదు, 20 తులాల వెండిని ఎత్తుకెళ్లారు. బాధితురాలు వెంటనే తన భర్త ప్రకాశ్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి డీఎస్పీ శ్రీనివాస్, పట్టణ సీఐ సమ్మయ్య చేరుకొని క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించారు. నిందితుల వేలిముద్రలను, ఆధారాలను సేకరించారు. సీసీ ఫుటేజీని పరిశీలించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు.

**టాటా సుమోలో వచ్చి రెండు చోట్ల చైన్ స్నాచింగ్**

**నిజామాబాద్:** నిజామాబాద్ జిల్లాలో టాటా సుమోలో వచ్చిన దొంగల ముఠా కలకలం రేపింది. నగరంలో రెండు చోట్ల చైన్ స్నాచింగ్, ఆర్మూర్‌లోని ఓ ఫ్లాట్, మెడికల్ షాప్‌లో దొంగతనం చేశారు. శనివారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో టాటా సుమోలో వచ్చిన నలుగురు దొంగలు సిటీలోని దుబ్బ ప్రాంతంలో వాకిలి ఊడుస్తున్న ప్రవీణ మెడలోని రెండున్నర తులాల మంగళసూత్రాన్ని తెంపుకెళ్లారు. చెవి కమ్మల్లో ఒకటి లాగేసుకొని, మరొకటి లాగే ప్రయత్నం చేస్తున్నప్పుడు మహిళ కేకలు విని ఆమె భర్త బయటకు రావడంతో దొంగలు పరారయ్యారు. ఇద్దరు దొంగలు చైన్ స్నాచింగ్‌కు పాల్పడగా, మరో ఇద్దరు వెహికల్‌లోనే ఉన్నారు. అంతకు 10 నిమిషాల ముందు సిటీ శివారులోని శ్రీనివాస్‌నగర్ కాలనీకి చెందిన లక్ష్మి మెడలోని గోల్డ్ చైన్ లాక్కొని సుమోలో పరారయ్యారు. మార్నింగ్ వాక్ కోసం బయటకు వచ్చిన లక్ష్మిని అడ్రస్ అడుగుతూ చైన్ స్నాచింగ్ చేసి ఉడాయించారు. రాత్రి 12 గంటల సమయంలో జిల్లాలోని ఆర్మూర్‌లో వినాయక అపార్ట్‌మెంట్‌లో ఉండే లోక రమేశ్‌రెడ్డి ఫ్లాట్‌లోని బీరువా పగులగొట్టి 10 తులాల వెండి ఆభరణాలు, నగదు దొంగిలించారు. అనంతరం మెడిసిటీ మెడికల్ షాప్ షట్టర్ లాక్ ధ్వంసం చేసి క్యాష్ కౌంటర్‌లోని రూ.1.90 లక్షల నగదు పట్టుకెళ్లారు. ఈ నాలుగు చోట్ల టాటా సుమోలో వచ్చిన నలుగురు దొంగలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యారు. దుబ్బ ఏరియా బాధితురాలి ఇంటికి సీపీ సాయిచైతన్య వెళ్లి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. దొంగలను పట్టుకునేందుకు స్పెషల్ టీమ్‌లు ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి నిర్మల్‌లో దొంగతనాలు చేసిన దొంగల ముఠా సుమోలో హైవే మీదుగా జిల్లాలోకి వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. నిర్మల్, నిజామాబాద్‌లో ఈ ముఠానే చోరీలు చేసినట్లు భావిస్తున్నారు.

# 15 రోజుల్లో రూ.6.97 లక్షల కోట్లు

- బ్యాంకుల్లో భారీగా డిపాజిట్లు

**న్యూఢిల్లీ:** కేవలం 15 రోజుల్లో బ్యాంకుల్లోకి రూ.6.97 లక్షల కోట్లు డిపాజిట్ల రూపంలో వచ్చాయని ఎస్‌బీఐ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది. దీని ప్రకారం గతనెల 30తో ముగిసిన పక్షం రోజుల్లో డిపాజిట్ల విలువ దాదాపు రూ.ఏడు లక్షల కోట్లు పెరిగింది. ఇది 29 ఏళ్లలో మూడో అత్యధిక వృద్ధి కావడం విశేషం. మొత్తం డిపాజిట్లలో త్రైమాసిక ముగింపు డిపాజిట్ల వాటా రూ.3.5 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్ల వరకు ఉంది. మిగిలినవి ఎఫ్‌సీఎన్ఆర్ బి, విదేశీ అప్పులు, ఓఎఫ్‌సీబీ మార్గాల్లో వచ్చాయి. ప్రభుత్వం విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి , రూపాయిని బలోపేతం చేయడానికి తీసుకున్న చర్యల వల్ల ఏడు బిలియన్ డాలర్ల విలువైన ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్లు వచ్చాయి. డెట్ ఎఫ్ఏఆర్ ఇన్ ఫ్లోస్ విలువ 2.7 బిలియన్ డాలర్లకు చేరుకుంది. గత ఏడాది రూ.2.4 లక్షల కోట్లుగా ఉన్న బ్యాంక్ క్రెడిట్ ఈ ఏడాది రూ.5.6 లక్షల కోట్లకు పెరిగింది. ఈ భారీ డిపాజిట్ల వల్ల బ్యాంకుల్లో లిక్విడిటీ మరింత మెరుగయ్యే అవకాశం ఉంది.

# యూరప్ నుంచి దలాల్ స్ట్రీట్‌కు..

- ఐపీఓల కోసం ఇండియన్ మార్కెట్లకు
- ఇది వరకే ఆరు కంపెనీల దరఖాస్తు

**ముంబై:** విదేశీ కంపెనీలు కూడా ఐపీఓల కోసం దేశీయ స్టాక్ మార్కెట్ల తలుపులు తడుతున్నాయి. పలు యూరప్ కంపెనీలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టింగ్ కావడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. అర డజనుకు పైగా కంపెనీలు ఇప్పటికే సెబీకి పేపర్లు అందజేశాయి. మరికొన్ని దాఖలు చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇటలీకి చెందిన బాన్ఫిగ్లియోలి గ్రూప్ భారతీయ విభాగం బాన్ఫిగ్లియోలి ట్రాన్స్‌మిషన్స్ రూ.2 వేల కోట్ల ఐపీఓ కోసం గత నెల అనుమతి పొందింది. ఇది 4.7 కోట్ల షేర్ల ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో ఉండనుంది. స్వీడన్‌కు చెందిన ప్లేసింపుల్ కూడా రూ.3,150 కోట్ల ఐపీఓ కోసం దరఖాస్తు చేసుకుంది. స్విట్జర్లాండ్ కంపెనీ ఇన్నోటెర్రా గత నెల డ్రాఫ్ట్ పేపర్లను సమర్పించింది. ఇందులో రూ.105 కోట్ల వరకు తాజా ఇష్యూ, 70.55 లక్షల షేర్ల ఓఎఫ్ఎస్ ఉన్నాయి. స్వీడిష్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ ఈక్వ్యాటీ పార్ట్నర్స్ తన ఔట్‌సోర్సింగ్ ప్లాట్‌ఫారమ్ స్ట్రైవ్ కోసం రూ.3,800 కోట్ల ఐపీఓను ప్లాన్ చేస్తోంది. దీని మద్దతు ఉన్న మరో సంస్థ వర్చుసా కూడా ఐపీఓ గురించి ఆలోచిస్తోంది. జర్మన్ ఆటో




స్పేర్స్ వెబాస్టో వచ్చే ఏడాది ప్రారంభంలో ఐపీఓ కి రావాలని యోచిస్తోంది. ఈవారం వస్తున్న ఎస్ఐబీ ఫండ్స్ రూ.11,700 కోట్ల ఐపీఓలో ఫ్రాన్స్‌కు చెందిన అముండి కూడా భాగస్వామి.

**ఎస్‌బీఐ ఫండ్స్‌లో 1.42 శాతం వాటా అమ్మకం**

ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఎస్‌బీఐ ఎఫ్ఎం) లో 1.42శాతం వాటాను ప్రిఐపీఓలో 30 మంది ఇన్వెస్టర్లకు రూ.1,655 కోట్లకు విక్రయించింది. ఐపీఓ ప్రైస్ బ్యాండ్ గరిష్ట ధర అయిన రూ. 574 వద్ద మొత్తం 2,88,32,748 ఈక్విటీ షేర్లను అమ్మామని తెలిపింది. ఎస్‌బీఐఎఫ్ఎం ఐపీఓ ఈ నెల 14-16 తేదీల్లో ఉంటుంది. తాజాగా వాటాను కొనుగోలు చేసిన వారిలో టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్, గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్, బెన్నెట్ అండ్ కోల్‌మన్, ఆనంద్ రాఠీ గ్లోబల్ ఫైనాన్స్, 360 వన్ ఫండ్స్ వంటి పెద్ద కంపెనీలు ఉన్నాయి.

# 1.7 కోట్లకు పైగా ఐటీఆర్స్ దాఖలు

- ఈ నెలాఖరు వరకు గడువు

**న్యూఢిల్లీ:** ఆర్థిక సంవత్సరం 2025-26 కు గానూ ఇప్పటివరకు 1.7 కోట్లకు పైగా ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్స్ (ఐటీఆర్) దాఖలైనట్లు ఆదాయపు పన్ను శాఖ శనివారం ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో సంపాదించిన ఆదాయానికి సంబంధించి ఐటీఆర్ 1, ఐటీఆర్2 ఫారమ్‌లను ఫైల్ చేయడానికి జులై 31 చివరి తేదీగా నిర్ణయించారు. శుక్రవారం ఒక్కరోజే 10 లక్షలకు పైగా ఐటీఆర్‌లు దాఖలు కావడం విశేషం.

**ఐటీఆర్ 1:** చిన్న, మధ్యతరహా పన్ను చెల్లింపుదారులు ఐటీఆర్1 (సహజ్) ఫారమ్‌ను ఫైల్ చేయాలి. ఏడాదికి రూ. 50 లక్షల వరకు ఆదాయం ఉన్నవారు ఈ ఫారమ్‌ను దాఖలు చేయాలి. జీతం లేదా పెన్షన్ ఆదాయం పొందినా, బ్యాంక్ సేవింగ్స్‌పై వడ్డీల ద్వారా ఆదాయం పొందినా, ఒకే ఇంటిపై అద్దెల ద్వారా ఆదాయం పొందినా, ఏడాదికి రూ. 5 వేల లోపు వ్యవసాయ ఆదాయం ఉన్నా ఈ ఫారమ్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది.

**ఐటీఆర్-2:** వ్యాపారం లేదా వృత్తి ద్వారా కాకుండా, క్యాపిటల్ గెయిన్స్ (పెట్టుబడి లాభాలు), ఇతర వనరుల ద్వారా ఆదాయం పొందే వ్యక్తులు, హిందూ అన్‌డివైడెడ్ ఫ్యామిలీస్ ఈ ఫారమ్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. జులై 31 లోపు ఐటీఆర్‌లను పూర్తి చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

# భారీ డిస్కౌంట్లకు బై బై!

## ముడి సరుకుల ధరలు పెరగడంతో రాయితీలు తగ్గించిన కంపెనీలు

- వస్తువుల ధరలు పెంచినా, లాభాలు పడిపోతున్నాయని వెల్లడి
- ఇండిపెండెన్స్ డే సేల్స్, ఎండ్ ఆఫ్ సీజన్ సేల్స్‌లో భారీ ఆఫర్లు లేనట్టే

**న్యూఢిల్లీ:** యాభై శాతం తగ్గింపు, బ్యాంక్ కార్డులపై 10 శాతం క్యాష్‌బ్యాక్, ఎక్స్ఛేంజ్ బోనస్ .. పండుగ టైమ్‌లో లేదా ఎండ్ ఆఫ్ సీజన్ సేల్స్‌లో ఇలాంటి ఆఫర్లు చాలా చూసి ఉంటాం. కానీ, ఈ ఏడాది మాత్రం ఇలాంటి భారీ డిస్కౌంట్లు కనిపించకపోవచ్చు. ముడిసరుకుల ధరలు పెరగడంతో ఖర్చుల భారం ఎక్కువైందని కంపెనీలు అంటున్నాయి. ముఖ్యంగా ఏసీలు, ఫ్రిజ్‌లు వంటివి అమ్మే కన్జూమర్ గూడ్స్ కంపెనీలు డిస్కౌంట్లను ఇవ్వడం తగ్గించేశాయి. అంతర్జాతీయంగా రవాణా ఛార్జీలు పెరగడంతో కంపెనీలు తమ లాభాలను నిలుపుకోవడానికి డిస్కౌంట్లకు కోత పెడుతున్నాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మార్కెట్లలో గతేడాదితో పోలిస్తే ఆఫర్లు 5 నుంచి 10 శాతం వరకు తగ్గాయి. ప్రస్తుతం 'ఎండ్ ఆఫ్ సీజన్ సేల్స్' నడుస్తున్నప్పటికీ, గతంలోలాగా అన్ని వస్తువులపై కాకుండా చాలా పరిమితమైన ప్రొడక్ట్స్‌పై మాత్రమే ఆఫర్లు కనిపిస్తున్నాయి.



**ముడిసరుకు ధరలు పైపైకి**

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ రవాణా వ్యవస్థ దెబ్బతింది. దీంతో వస్తువుల రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగాయి. మార్కెట్లో పోటీ ఎక్కువగా ఉండటంతో ఈ భారాన్ని కంపెనీలు కస్టమర్లపై పూర్తిగా మోపలేకపోతున్నాయి. ఉదాహరణకు, ఏసీల ధరలు 12శాతం పెరిగినా, కంపెనీలు మరో 5-6శాతం అదనపు భారాన్ని భరిస్తున్నాయి. దీంతో కస్టమర్లకు ఇచ్చే రాయితీలను తగ్గించుకోవాల్సి వస్తోంది. కోడక్, థామ్సన్ బ్రాండ్ల టీవీలు తయారుచేసే సూపర్ ప్లాస్ట్రానిక్స్ సీఈఓ అవనీత్ సింగ్ మార్వా మాట్లాడుతూ, "రవాణాలో అంతరాయాల కారణంగా ఉత్పత్తి ఖర్చులు పెరిగాయి. రానున్న ఇండిపెండెన్స్ డే సేల్స్‌లో కూడా గతంలో మాదిరి భారీ డిస్కౌంట్లు కనిపించవు" అని తెలిపారు. డిస్కౌంట్లు తగ్గడంతో కస్టమర్లు వెనకడుగు వేయకుండా ఉండేందుకు వ్యాపారులు సరికొత్త పద్ధతులను పాటిస్తున్నారు. "క్యాష్‌బ్యాక్‌లను తగ్గించినప్పటికీ, వాటిని భర్తీ చేయడానికి లాంగ్‌టర్మ్ ఈఎంఐలు, ఆకర్షణీయ ఫైనాన్స్ స్కీమ్‌లను కంపెనీలు ప్రవేశపెడుతున్నాయి" అని విజయ్ సేల్స్ డైరెక్టర్ నీలేష్ గుప్తా తెలిపారు. ఎక్కువ మంది వినియోగదారులు నెలకు కొంత చొప్పున కట్టేందుకే ఇష్టపడుతుండటంతో ఈ స్ట్రాటజీ పనిచేస్తుందని అన్నారు. మరోవైపు, లైఫ్‌స్టైల్ ఇంటర్నేషనల్, వీమార్ట్ రిటైల్, బాటా ఇండియా వంటి ప్రముఖ బ్రాండ్లలో ఎలాంటి డిస్కౌంట్లు లేకుండా పూర్తి ధరలకే అమ్మకాలు జరుగుతున్నాయి. పూర్తి ధరతో అమ్ముడవుతున్న వస్తువుల వృద్ధి డబుల్ ఉందని బాటా ఇండియా పేర్కొంది. డిస్కౌంట్లు లేకపోయినా మార్కెట్లో డిమాండ్ స్థిరంగా ఉండటంతో కంపెనీల వద్ద పాత స్టాక్ పేరుకుపోవడం లేదని తెలిపింది.

**రంగాల వారీగా పెరిగిన ధరలు**

మార్కెట్ ట్రాకర్ 'కౌంటర్‌పాయింట్ రీసెర్చ్' రిపోర్ట్ ప్రకారం, ఎలక్ట్రానిక్స్, స్మార్ట్‌ఫోన్ బ్రాండ్లు ఎంఆర్‌పీపై ఇచ్చే డైరెక్ట్ డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు, బ్యాంక్ కార్డ్ ఆఫర్లు 5 నుంచి 7 శాతం మేర తగ్గాయి.

**గత ఆర్నెళ్లలో ఎలక్ట్రానిక్స్, ఫుట్‌వేర్‌పై డిస్కౌంట్ల తగ్గుదల ఇలా..**

| ప్రొడక్ట్ కేటగిరీ | ధరల పెరుగుదల | డిస్కౌంట్లపై తాజా ప్రభావం |
|---|---|---|
| స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు | 30-40% | మెమరీ చిప్ ధరలు 2 నుంచి 3 రెట్లు పెరగడంతో ఆఫర్లు తగ్గాయి. |
| ఎయిర్ కండిషనర్లు (ఏసీలు) | 10-12% | కంపెనీలు భారాన్ని భరిస్తున్నాయి. డిస్కౌంట్లకు అస్సలు చాన్స్ లేదు. |
| స్మార్ట్ టీవీలు, రిఫ్రిజిరేటర్లు | 15- 20% | ముడిసరుకు ధరలు పెరగడంతో ఆఫర్ల సైజ్ 5శాతం వరకు తగ్గింది. |
| ఫుట్‌వేర్ | 5-10% | గతంలో 70శాతం స్టాక్‌పై ఉన్న డిస్కౌంట్, ఇప్పుడు 40శాతం స్టాక్‌కే పరిమితమైంది. |

# పీఎంఎఫ్ఎంఈతో 2 లక్షల ఇండస్ట్రీలకు సబ్సిడీ

**కేంద్ర పరిశ్రమల మంత్రి చిరాగ్ పాశ్వాన్**

**న్యూఢిల్లీ:** ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ ఫార్మలైజేషన్ స్కీమ్ (పీఎంఎఫ్ఎంఈ) కింద ఇప్పటికే రెండు లక్షల చిన్న పరిశ్రమలకు క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ అందించామని కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి చిరాగ్ పాశ్వాన్ వెల్లడించారు. 2020 లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా రూ.20,300 కోట్ల ఉమ్మడి పెట్టుబడితో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటయ్యాయి. ఇప్పటికే రూ.ఆరు వేల కోట్ల సబ్సిడీని అందించారు. ఫలితంగా దాదాపు 11 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించాయి. లబ్ధిదారులలో దాదాపు 90 శాతం మంది మొదటి తరం పారిశ్రామికవేత్తలు కాగా, 44 శాతం మంది మహిళలు ఉన్నారు. 75 వేల కంటే ఎక్కువ సంస్థలు ఉద్యమ్, ఎఫ్ఎస్ఎస్ఏఐ, జీఎస్టీ రిజిస్ట్రేషన్ల ద్వారా అధికారిక ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశించాయి. ఈ పథకం ద్వారా వ్యక్తిగత సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలకు 35 శాతం సబ్సిడీ లభిస్తుంది. పీఎంఎఫ్ఎంఈను ఈ ఏడాది సెప్టెంబర్ వరకు పొడిగించారు.




# 11 శాతం పెరిగిన డీమార్ట్ లాభం

- జూన్ క్వార్టర్లో రూ.860.44 కోట్లు

**న్యూఢిల్లీ:** డీమార్ట్ పేరుతో హైపర్ మార్కెట్లు నిర్వహించే అవెన్యూ సూపర్‌మార్ట్స్ లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి క్వార్టర్లో 11.33 శాతం వృద్ధితో రూ.860.44 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే క్వార్టర్‌లో కంపెనీ నికర లాభం రూ.772.81 కోట్లు ఉంది. ఆదాయం 14.9 శాతం పెరిగి రూ.18,794.53 కోట్లకు చేరుకుంది. మొత్తం ఖర్చులు 15.11 శాతం పెరిగి రూ.17,637.17 కోట్లుగా నమోదయ్యాయి. ఈ క్వార్టర్‌లో డీమార్ట్ కొత్తగా 3 స్టోర్లను ప్రారంభించడంతో మొత్తం స్టోర్ల సంఖ్య 503 కు చేరింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్ డీమార్ట్ రెడీ వ్యాపారాన్ని తక్కువ ఆదాయం ఉన్న ఏడు నగరాల్లో నిలిపివేసింది. ప్రస్తుతం డీమార్ట్ రెడీ 11 నగరాల్లో సేవలు అందిస్తోంది. రాధాకిషన్ దమానీ కుటుంబం ప్రమోట్ చేస్తున్న ఈ సంస్థ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో సేవలందిస్తోంది.

## ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్‌కు గుర్తింపు

**హైదరాబాద్ , వెలుగు:** కంటి వైద్యసేవలు అందించే హైదరాబాద్ హెల్త్‌కేర్ ప్రొవైడర్ ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాలను ప్రపంచ ఆరోగ్య సంస్థ 2030 వరకు తన 'కోలాబరేటింగ్ సెంటర్'గా తిరిగి ఎంపిక చేసింది. 2001 నుంచి వరుసగా ఈ హోదాను దక్కించుకోవడం ద్వారా, ప్రపంచ వ్యాప్తంగా డబ్ల్యుహెచ్ఓ గుర్తించిన 11 అత్యుత్తమ కంటి సంరక్షణ బ్రాండ్లలో ఒకటిగా తమ స్థానాన్ని సుస్థిరం చేసుకున్నామని హాస్పిటల్ తెలిపింది. దీంతో గ్లోబల్‌గా తమ బ్రాండ్ వాల్యూ మరింత పెరుగుతుందని పేర్కొంది.

# సేమ్‌డే డెలివరీలు 3 రెట్లు జంప్

**హైదరాబాద్, వెలుగు:** ఇటీవల నిర్వహించిన పదో ప్రైమ్ డే సేల్ సమయంలో అత్యంత వేగంగా వస్తువులను డెలివరీ చేశామని అమెజాన్ తెలిపింది. క్విక్ డెలివరీ సర్వీస్ 'అమెజాన్ నౌ' ద్వారా నగరాల్లో ఆర్డర్ చేసిన నిమిషాల్లోనే సగం ఉత్పత్తులు డెలివరీ అయ్యాయి. మునుపటితో పోలిస్తే సేమ్ డే డెలివరీలు మూడు రెట్లు పెరిగాయి. కొత్త ప్రైమ్ మెంబర్‌షిప్ కొనుగోళ్లలో 70 శాతానికిపైగా వాటా చిన్న నగరాల నుంచే ఉంది. ఒక్కో ఎంఎస్ఎంఈ రూ.10 లక్షలకుపైగా విలువైన అమ్మకాలను సాధించింది. సగానికి పైగా వినియోగదారులు అమెజాన్ పే ద్వారా చెల్లింపులు జరిపారు. దీనివల్ల అమెజాన్ పే లేటర్ వాడకం 2.5 రెట్లు పెరిగింది. లాప్‌టాప్‌లు, రోబోటిక్ వాక్యూమ్‌లు, స్మార్ట్ వాటర్ ప్యూరిఫైయర్ల అమ్మకాలు భారీగా పెరిగాయని అమెజాన్ తెలిపింది.



## జనరల్



# బీటెక్ విద్యార్థి హత్య కేసు వివరాలు సమర్పించండి

- తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, వెలుగు:** జగిత్యాల జిల్లా ఐలాపూర్‌కు చెందిన బీటెక్ విద్యార్థి రాహుల్ హత్య కేసు పూర్తి వివరాలను సమర్పించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. తన కుమారుడు రాహుల్‌ను కిడ్నాప్ చేసి హత్య చేశారని, ఈ కేసును సీబీఐతో దర్యాప్తు చేయించాలని కోరుతూ జగిత్యాల జిల్లా ఐలాపూర్‌కు చెందిన అంకం రాజేశ్వర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది మల్లుగారి సుదర్శన్ వాదనలు వినిపిస్తూ.. రాహుల్ హైదరాబాద్‌లోని మాతృశ్రీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడని, మే 27న ఒక స్నేహితుడు అతడిని కాచిగూడ రైల్వేస్టేషన్‌లో దింపిన తర్వాత కనిపించకుండా పోయాడని తెలిపారు. ఈ ఘటనపై కాచిగూడ పీఎస్‌తో పాటు ఏపీలోని ఒడరేవు పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయని వివరించారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ పోలీసులు ఒక బావిలో బండరాయికి కట్టి ఉన్న గుర్తుతెలియని మృతదేహాన్ని కనుగొన్నారని, దీనిపై కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూలకు సంబంధించిన వివాదం నేపథ్యంలోనే కుట్ర పన్ని రాహుల్‌ను కిడ్నాప్ చేసి దారుణంగా హత్య చేశారని న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. న్యాయం కోసం బాధితులు 45 రోజులుగా ప్రయత్నిస్తున్నారని వివరించారు. ఏపీ పోలీసులు మృతదేహాన్ని కేవలం 72 గంటల్లోనే ఖననం చేసేశారని, దీనివల్ల పోలీసుల తీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ప్రభుత్వ న్యాయవాది ప్రతివాదన వినిపిస్తూ.. డీఎన్ఏ టెస్ట్ ద్వారా మృతదేహాన్ని నిర్ధారిస్తామని చెప్పారు. వాదనలు విన్న హైకోర్టు.. బిడ్డను కోల్పోయిన తల్లిదండ్రుల్లో నెలకొన్న ఆందోళనను గమనించాలని సూచించింది. కేసు డైరీ వివరాలను కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది. కాగా, రాహుల్ మృతికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ అన్నారు. రాహుల్ కేసు దర్యాప్తులో పోలీసులు పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

# రైతు డిస్కంకు ఈఆర్సీ పచ్చ జెండా

**హైదరాబాద్, వెలుగు:**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'రైతు డిస్కమ్'కు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ఆమోదం తెలిపింది. తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఆర్పీడీసీఎల్)కు శనివారం విద్యుత్ పంపిణీ లైసెన్స్ మంజూరు చేసింది. 4 నెలల్లో డిస్కమ్ కార్యకలాపాలు ప్రారంభించుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నది. రాష్ట్రవ్యాప్తంగా 29 లక్షలకు పైగా ఉన్న ఉచిత వ్యవసాయ విద్యుత్ లిఫ్ట్ఇరిగేషన్‌తోపాటు ఇతర ఉచిత కనెక్షన్లను, విద్యుత్ లైన్లు, ట్రాన్స్ ఫార్మర్లను రైతు డిస్కం పరిధిలోకి మార్చుతూ నిర్ణయం తీసుకున్నది. ఇదివరకు ఉత్తర, దక్షిణ డిస్కంల పరిధిలో ఉన్న ఈ కనెక్షన్లను తగ్గిస్తూ ఆ సంస్థలకు కొత్తగా లైసెన్స్ జారీ చేసింది. రైతుల వ్యవసాయ పంపు సెట్లు, మోటార్లకు మీటర్లు ఉండవని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కొనసాగుతుందని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు ఈఆర్సీ స్పష్టంచేసింది.

**2025 డిసెంబర్ 17న జీవో**

రాష్ట్రంలో రైతుల కోసం ప్రత్యేక డిస్కమ్ తీసుకురావాలనే ఉద్దేశంతో సర్కారు 2025 డిసెంబర్ 17న జీవో జారీ చేసింది. 29 లక్షలకు పైగా ఉన్న ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లతోపాటు వ్యవసాయానికి సాగునీరందించేందుకు ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్ విద్యుత్ కనెక్షన్లు, రాష్ట్ర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే మిషన్ భగీరథ కనెక్షన్లు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డు పరిధిలోని కనెక్షన్లు, ఎల్‌టీ 6బీ పరిధిలోని మున్సిపల్ వాటర్ కనెక్షన్లు అన్నీ కూడా ఈ డిస్కం పరిధిలోకే తీసుకొచ్చారు. అన్ని ఉచిత విద్యుత్ కనెక్షన్లను కొత్త డిస్కం పరిధిలోకి మార్చుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ డిస్కంకు సీఎండీగా ముషారఫ్ అలీ ఫారూఖీని ప్రభుత్వం ఇప్పటికే నియమించింది. ఈ ఏడాది మార్చి 11న మూడో డిస్కంకు రైతు డిస్కం అని ప్రభుత్వం పేరు పెట్టింది.

**మే 29న ఈఆర్సీ బహిరంగ విచారణ**

మార్చి 19న రైతు డిస్కంకు లైసెన్స్ జారీ చేయాలని కోరుతూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ)కి సీఎండీ ముషారఫ్ అలీ దరఖాస్తు చేశారు. అయితే, రైతు డిస్కంపై మొదట్లో విద్యుత్ ఉద్యోగ సంఘాలు, ఇతర రాజకీయ పార్టీల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది. దీంతో ఈఆర్సీ రాష్ట్ర వ్యాప్తంగా అభ్యంతరాలు స్వీకరించింది. మే 29న ఈఆర్సీ కార్యాలయంలో బహిరంగ విచారణ నిర్వహించింది.

TGRPDCL

**రైతు డిస్కంలోకి మారిన విద్యుత్ కనెక్షన్లు**

- వ్యవసాయ ఉచిత విద్యుత్ కనెక్షన్లు: 29,05,779
- లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లు (ఎల్ఐఎస్) కనెక్షన్లు: 489
- హైదరాబాద్ జలమండలి కనెక్షన్లు: 99
- మిషన్ భగీరథ కనెక్షన్లు: 1,132
- మున్సిపాలిటీల పరిధిలోని ప్రత్యేక డీటీఆర్‌ల నీటి కనెక్షన్లు: 639

**81 పేజీలతో కూడిన లైసెన్స్ జారీ**

రైతు డిస్కంపై బహిరంగ విచారణ ముగిసిన నెలన్నర రోజుల తర్వాత శనివారం విద్యుత్ పంపిణీ లైసెన్స్ జారీ చేస్తూ ఈఆర్సీ ఉత్తర్వులు జారీ చేసింది. అందరి అభిప్రాయాలను అంశాలవారీగా పరిగణనలోకి తీసుకొని కమిషన్ సమాధానాలు ఇచ్చింది. విద్యుత్ చట్టం2003లోని సెక్షన్ 14తో పాటు సెక్షన్ 131 ప్రకారం లైసెన్స్ మంజూరు చేస్తూ మొత్తం 81 పేజీలతో కూడిన నివేదిక రిలీజ్ చేసింది. మొత్తం 29 లక్షలకు పైగా ఉచిత వ్యవసాయ, ఇరిగేషన్ తదితర విద్యుత్ కనెక్షన్లతోపాటు రూ.2,792 కోట్ల విలువ చేసే 5.22 లక్షల డిస్ట్రిబ్యూటర్ ట్రాన్స్‌ఫార్మర్లు, రూ.2,137 కోట్ల విలువ చేసే 2.61 లక్షల కిలోమీటర్ల ఎల్‌టీ విద్యుత్ లైన్లను రైతు డిస్కంలోకి మార్చుతూ ఈఆర్సీ నిర్ణయం తీసుకున్నది. ఈ ఉత్తర్వు తేదీ నుంచి 4 నెలల తర్వాత రైతు డిస్కం వ్యాపార కార్యకలాపాలు ప్రారంభమయ్యే తేదీగా కమిషన్ ప్రకటించింది. కాగా, రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చట్టంలోని సెక్షన్ 131 ప్రకారం చట్టబద్ధమైన ట్రాన్స్‌ఫర్ స్కీమ్‌ను జారీ చేశాకే లైసెన్స్ అమల్లోకి వస్తుందని ఈఆర్సీ పేర్కొన్నది.

**ఉత్తర, దక్షిణ డిస్కంల లైసెన్స్‌లు మార్పు**

రైతు డిస్కమ్ పరిధిలోకి ఉచిత వ్యవసాయ, ఇరిగేషన్ తదితర విద్యుత్ కనెక్షన్లు బదిలీ అవుతుండటంతో తమ పరిధిలోని కనెక్షన్లను తొలగించడానికి అనుమతించాలంటూ ఉత్తర, దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థలు చేసిన దరఖాస్తులకు ఈఆర్సీ ఆమోదించి లైసెన్సులను సవరించింది. మిగతా వినియోగదారులకు సేవలందించే భౌగోళిక పరిధిలో మార్పు ఉండదని స్పష్టం చేసింది.

**మోటార్లకు మీటర్లుండవ్..**

రైతుల వ్యవసాయ పంప్ సెట్లు, మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీని కూడా ఈఆర్సీ తన తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నది. రాష్ట్రంలోని వ్యవసాయ వినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరా యథావిధిగా కొనసాగుతుందని, భవిష్యత్తులో కూడా ఎలాంటి మార్పు ఉండదని సర్కారు చెప్పినట్టు స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కొత్త విద్యుత్ కనెక్షన్ల మంజూరు ప్రక్రియను నిలిపివేయవద్దని ఈఆర్సీ పాత డిస్కంలను ఆదేశించింది. రైతు డిస్కం పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించే వరకు ఉత్తర, దక్షిణ డిస్కంలే రైతుల నుంచి యథావిధిగా దరఖాస్తులు స్వీకరించి కొత్త కనెక్షన్లు మంజూరు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నది. ఉద్యోగుల హక్కులు, సీనియారిటీ, పెన్షన్, రిజర్వేషన్ రోస్టర్, పదోన్నతి అవకాశాలకు ఎలాంటి నష్టం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయాలని కమిషన్ స్పష్టం చేసింది.

# ఫిన్లాండ్‌లో అదృశ్యమైన హైదరాబాద్ యువకుడు మణిదీప్ మృతి

- 65 రోజుల తర్వాత సముద్ర ఒడ్డున డెడ్ బాడీ లభ్యం

**ఎల్బీనగర్, వెలుగు:** ఫిన్లాండ్‌లో అదృశ్యమైన హైదరాబాద్ వనస్థలిపురానికి చెందిన విద్యార్థి మణిదీప్ మృతదేహం లభ్యమైంది. దాదాపు 65 రోజుల తర్వాత సముద్ర తీరంలో అతని మృతదేహాన్ని అధికారులు గుర్తించారు. మే 5వ తేదీన మణిదీప్ అకస్మాత్తుగా కనిపించకుండా పోయాడు. అప్పటి నుంచి ఫిన్లాండ్ పోలీసులు, స్థానిక అధికారులు అతని కోసం గాలించారు. ఈ క్రమంలో జులై 9న క్రూనువు ఒరెన్‌రంటా సముద్ర తీరంలో ఒక మృతదేహాన్ని కనుగొన్నారు. ఆ మృతదేహాన్ని నిశితంగా పరిశీలించిన అధికారులు.. అది అదృశ్యమైన మణిదీప్‌దేనని ధృవీకరించారు. అతని మృతికి గల అసలు కారణాలపై ఫిన్లాండ్ జాతీయ దర్యాప్తు బ్యూరో ప్రస్తుతం ఇన్వెస్టిగేషన్ కొనసాగిస్తోంది. కాగా.. మణిదీప్ మరణవార్త వినడంతో వనస్థలిపురంలోని అతని కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఏకంగా 65 రోజుల పాటు సముద్రంలో ఉన్న మృతదేహం ఇప్పుడు లభించడం పలు అనుమానాలకు తావిస్తోందని పేరెంట్స్, బంధువులు అంటున్నారు.



# ఉద్యమకారుల గుర్తింపునకు టీజేఏసీ మద్దతు

**హైదరాబాద్, వెలుగు:**

రాజకీయాలకు అతీతంగా నిజమైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియకు నాటి టీజేఏసీ స్టీరింగ్ కమిటీ ఏకగ్రీవంగా సంపూర్ణ మద్దతు ప్రకటించింది. శనివారం అమరవీరుల స్మారక చిహ్నం కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం నిర్వహించింది. ఉద్యమ కాలంలో యావత్ తెలంగాణను ఏకతాటిపైకి తెచ్చిన ప్రొఫెసర్ కోదండరామ్‌తో పాటు నాటి ఉద్యోగ, ఉపాధ్యాయ, రవాణా, న్యాయవాద, సామాజిక రంగాల జేఏసీ ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాటి స్టీరింగ్ కమిటీ సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. ప్రస్తుత రాజకీయ అనుబంధాలతో ఏమాత్రం సంబంధం లేకుండా, నిజమైన పోరాట యోధులను ఖచ్చితంగా గుర్తించే విధివిధానాలపై ఈ కమిటీకి తమ సలహాలు, సూచనలను రాతపూర్వకంగా అందజేశారు. ప్యానల్ సమక్షంలో జరిగిన ఈ భేటీలో, ఉద్యమకారుల సంక్షేమం కోసం చరిత్రాత్మక ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించి సంఘీభావాన్ని ప్రకటించారు. సమావేశంలో పాల్గొన్న వివిధ రంగాల ప్రతినిధులు, ఉద్యమ శ్రేణుల ఆత్మగౌరవాన్ని కాపాడేలా పటిష్టమైన డిమాండ్లు, సంక్షేమ సూచనలను ప్యానల్ ముందు ఉంచారు. క్షేత్రస్థాయిలో లాఠీదెబ్బలు తిని, జైలుకు వెళ్లి, ఉద్యమాన్ని సజీవంగా ఉంచిన ప్రతి నిజమైన పోరాట యోధునికి పార్టీల హద్దులతో సంబంధం లేకుండా అధికారిక ప్రభుత్వ ప్రశంసాపత్రం మంజూరు చేయాలని కోరారు. అలాగే ఇండ్లు లేని నిరుపేద ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకునేందుకు కనీసం 250 గజాల నివాస స్థలాన్ని ప్రభుత్వం కేటాయించాలని డిమాండ్ చేశారు. వృద్ధాప్యంలో ఉన్న ఉద్యమకారులకు ప్రత్యేక ఆసరా పెన్షన్లతో పాటు, ఉచిత కార్పొరేట్ వైద్య సదుపాయం కల్పించేందుకు హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ రవాణా వ్యవస్థల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కూడా కల్పించాలని ప్రతిపాదనలు సమర్పించారు.

**పారదర్శకంగా తుది నివేదిక..**

టీజేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యుల నుంచి వ్యక్తమైన ఏకగ్రీవ మద్దతును గుర్తింపు కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోతె శోభన్ రెడ్డి స్వాగతించారు. పార్టీలకతీతంగా నాటి ఉమ్మడి స్టీరింగ్ కమిటీ డైరెక్టరీ ఆధారంగా లభించిన ఈ సంపూర్ణ సహకారం ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను మరింత సులభతరం చేస్తుందని ప్యానల్ స్పష్టం చేసింది. అర్హులైన చివరి ఉద్యమకారుడిని సైతం ఎలాంటి తప్పులు లేకుండా గుర్తించడమే తమ కమిటీ ప్రధాన లక్ష్యమని చైర్మన్ ఈ సందర్భంగా ప్రకటించారు. సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రస్తుతం జరుగుతున్న డిజిటల్ స్క్రీనింగ్ ఆధారంగా డేటాను పటిష్టంగా విశ్లేషిస్తున్నట్లు వెల్లడించారు. ఈ స్క్రీనింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం అత్యంత పారదర్శకమైన, సమగ్రమైన తుది నివేదికను తయారు చేసి సీఎం రేవంత్ రెడ్డికి అందజేస్తామన్నారు.

**ప్రతిపాదనలు అందజేసింది వీరే..**

సమావేశంలో టీజీవో తరపున వి. శ్రీనివాస్ గౌడ్, ఏలూరి శ్రీనివాసరావు, టీఎన్జీవో తరపున కె. స్వామిగౌడ్, జి. దేవీప్రసాద్, కారం రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. ఆర్టీసీ జేఏసీ తరపున దొంతు ఆనందం, రాజిరెడ్డి, ఎలక్ట్రిసిటీ జేఏసీ నుంచి కె. రఘు ఉన్నారు. న్యాయవాదుల తరపున ఎమ్.రాజేంద్ర రెడ్డి, ఎన్.ప్రహ్లాద్, డాక్టర్స్, ఇంజనీర్స్ జేఏసీల నుంచి డా.సురేష్ చంద్ర, శ్రీధర్ దేశ్‌పాండే, టి. వెంకటేశం, ఎమ్.బాలనర్సయ్య హాజరయ్యారు. టీచర్ల తరపున ఎమ్. మణిపాల్ రెడ్డి, టీఏమ్ఆర్పీఎస్ నుంచి బొట్ల భిక్షపతి, తెలంగాణ వికాస సమితి నుంచి పిట్టల రవీందర్ తదితరులు ఉన్నారు.



- 250 గజాల స్థలం, పెన్షన్, ఉచిత వైద్యం అందించాలి
- గుర్తింపు కమిటీకి ప్రతిపాదనలు
- త్వరలోనే సీఎంకు నివేదిక: చైర్‌పర్సన్ కే కేశవరావు

# రేపటి నుంచి బీజేపీ 'సింగరేణి భరోసా యాత్ర'

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నేతృత్వంలో రెండు రోజుల టూర్
- కార్మికులతో ముఖాముఖి.. గనుల వద్ద గేట్ మీటింగ్‌లు

**హైదరాబాద్, వెలుగు:** కేంద్రం ఇటీవల తాడిచర్ల 2 బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడంతో దీనిని కార్మికుల్లోకి తీసుకెళ్లడంతోపాటు వారి సమస్యలను తెలుసుకునేందుకు బీజేపీ 'సింగరేణి భరోసా యాత్ర'కు శ్రీకారం చుట్టింది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నేతృత్వంలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు బొగ్గు గనుల ప్రాంతాల్లో నేతలు పర్యటించనున్నారు. బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ ఎన్. రాంచందర్ రావు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డితో కలిసి కిషన్ రెడ్డి కోల్‌బెల్ట్ ప్రాంతాల్లోని గనులను సందర్శించి, కార్మికులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను శనివారం బీజేపీ నేతలు హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు.





# క్లీన్ స్వీప్ అయ్యారు..

- ఐదో టీ20లోనూ ఇండియా ఓటమి
- 56 రన్స్ తేడాతో ఇంగ్లండ్ విజయం
- 4-0తో సిరీస్ సొంతం
- దంచికొట్టిన బట్లర్, బ్రూక్




**సౌతాంప్టన్:** ఇంగ్లండ్ గడ్డపై టీమిండియాకు ఘోర పరాజయం మిగిలింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఒక్కటి కూడా గెలవలేకపోయింది. జోస్ బట్లర్ (64 బాల్స్‌లో 12 ఫోర్లు, 8 సిక్స్‌లతో 131), హ్యారీ బ్రూక్ (45 బాల్స్‌లో 4 ఫోర్లు, 8 సిక్స్‌లతో 95 నాటౌట్) దంచికొట్టుడును ఆపలేకపోయిన ఇండియా.. శనివారం జరిగిన ఆఖరిదైన ఐదో టీ20లోనూ 56 రన్స్ తేడాతో ఓటమిపాలైంది. దాంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను హోమ్ టీమ్ 4-0తో సొంతం చేసుకుంది. టాస్ ఓడిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 257/3 స్కోరు చేసింది. తర్వాత ఇండియా 20 ఓవర్లలో 201/8 స్కోరు చేసింది. ఇషాన్ కిషన్ (56), తిలక్ వర్మ (53) రాణించినా ప్రయోజనం దక్కలేదు. బట్లర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', బ్రూక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు లభించాయి.

**రికార్డు భాగస్వామ్యం..**

రెండో ఓవర్‌లోనే ఫిల్ సాల్ట్ (6)ను ఔట్ చేసి ప్రసిధ్ కృష్ణ (1/38) శుభారంభాన్నిచ్చినా.. బట్లర్, బెథెల్ ఇండియా బౌలింగ్‌ను ఉతికేశారు. భారీ సిక్సర్లు, ఫోర్లతో స్కోరు బోర్డును పరుగెత్తించారు. ఇంగ్లండ్ పవర్‌ప్లేలో 61/1 స్కోరు చేసింది. ఫీల్డింగ్ పెరిగిన తర్వాత కూడా ఈ ఇద్దరు దూకుడును తగ్గించలేదు. 10వ ఓవర్‌లో బ్రూక్ 6, 6, 4తో 19 బాల్స్‌లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. దాంతో ఇంగ్లండ్ 111/1తో ఫస్ట్ టెన్ ఓవర్స్‌ను ముగించింది. ఇక్కడి నుంచి బట్లర్ జోరందుకున్నాడు. వరుస ఫోర్లతో 35 బాల్స్‌లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. సూర్యాన్ష్ షెడ్జే వేసిన 14వ ఓవర్‌లో బ్రూక్ 6, 4, 6తో 24 రన్స్ దంచాడు. తర్వాతి ఓవర్‌లో ప్రిన్స్ యాదవ్‌కు బట్లర్ 4, 6, 6, 4తో చుక్కలు చూపించాడు. దాంతో 15 ఓవర్లలో స్కోరు 189/1కి చేరింది. 16వ ఓవర్‌లో అక్షర్ పటేల్‌కు 6, 6, 4తో స్వాగతం పలికిన బట్లర్ కేవలం 17 బాల్స్‌లోనే రెండో ఫిఫ్టీని పూర్తి చేశాడు. ఈ క్రమంలో బట్లర్ ఇచ్చిన క్యాచ్‌ను ఎక్స్‌ట్రా కవర్స్‌లో అక్షర్ పటేల్ డ్రాప్ చేసి మూల్యం చెల్లించుకున్నాడు. 19వ ఓవర్‌లో 6, 6, 4తో విరుచుకుపడిన బట్లర్‌కు శివమ్ దూబే (2/22) చెక్ పెట్టాడు. దాంతో రెండో వికెట్‌కు 233 రన్స్ పార్ట్‌నర్‌షిప్ ముగిసింది. టీ20 ఇంటర్నేషనల్ క్రికెట్‌లో ఏ వికెట్‌కైనా ఇదే అత్యుత్తమ రికార్డు భాగస్వామ్యం. తర్వాతి బాల్‌కే జాకబ్ బెథెల్ (0) కూడా వెనుదిరిగినా విల్ జాక్స్ (7 నాటౌట్) సిక్స్‌తో ఖాతా తెరిచాడు. లాస్ట్ ఓవర్‌లో బ్రూక్ ఫోర్‌తో ఇంగ్లండ్ భారీ స్కోరు నమోదు చేసింది.

**బ్యాటర్లు ఫెయిల్..**

ఛేజింగ్‌లో ఇండియాకు మెరుగైన ఆరంభం దక్కలేదు. సంజూ శాంసన్ (27) రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లతో ఖాతా తెరిచినా.. మూడో ఓవర్‌లోనే అభిషేక్ శర్మ (3) పెవిలియన్‌కు చేరాడు. దాంతో 25/1 స్కోరు వద్ద క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ మూడు ఫోర్లతో ఆట మొదలుపెట్టాడు. ఐదో ఓవర్‌లో 6, 4 దంచాడు. కానీ ఆరో ఓవర్‌లో శాంసన్ ఔట్‌తో రెండో వికెట్‌కు 30 రన్స్ భాగస్వామ్యం ముగిసింది. వచ్చీ రాగానే శ్రేయస్ అయ్యర్ (28) 4, 4 కొట్టడంతో పవర్‌ప్లేలో ఇండియా 65/2 స్కోరు చేసింది. తర్వాత ఇషాన్ వరుసగా ఫోర్లు కొట్టాడు. తర్వాతి నాలుగు ఓవర్లలో 45 రన్స్ రావడంతో తొలి 10 ఓవర్లలో స్కోరు 110/2గా మారింది. అయితే 11వ ఓవర్‌లో శ్రేయస్ ఔట్ కావడంతో మూడో వికెట్‌కు 55 రన్స్ జతయ్యాయి. ఇదే టైమ్‌లో ఇషాన్ 27 బాల్స్‌లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. కానీ 13వ ఓవర్‌లో ఆదిల్ రషీద్ (1/19)కు వికెట్ ఇచ్చుకున్నాడు. ఎదుర్కొన్న తొలి బాల్‌కే శివమ్ దూబే (14) క్యాచ్ ఔట్ నుంచి బయటపడగా, తిలక్ 4, 6తో జోరు పెంచాడు. ఆ వెంటనే రెండు ఫోర్లు కొట్టిన దూబే వెనుదిరిగాడు. సూర్యాన్ష్ షెడ్జే (7)తో కలిసి తిలక్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేసినా సక్సెస్ కాలేదు. చేయాల్సిన రన్‌రేట్ ఎక్కువగా ఉండటంతో ఇండియాకు ఓటమి తప్పలేదు.

**సంక్షిప్త స్కోర్లు**

**ఇంగ్లండ్:** 20 ఓవర్లలో 257/3 (బట్లర్ 131, బ్రూక్ 95*, దూబే 2/22). **ఇండియా:** 20 ఓవర్లలో 201/8 (ఇషాన్ 56, తిలక్ వర్మ 53, సామ్ కరన్ 3/36).

# వింబుల్డన్ క్వీన్ నోస్కోవా



**లండన్:** వింబుల్డన్‌లో ఈసారి కొత్త చరిత్ర నమోదైంది. ఇద్దరు చెక్ ప్లేయర్ల మధ్య జరిగిన విమెన్స్ సింగిల్స్ ఫైనల్లో లిండా నోస్కోవా టైటిల్‌ను సాధించింది. శనివారం జరిగిన ఫైనల్లో 9వ సీడ్ నోస్కోవా 6-2, 5-7, 6-3తో కరోలినా ముచోవా (చెక్)పై విజయం సాధించింది. దాంతో క్విటోవా (2011) తర్వాత అత్యంత పిన్న వయస్కురాలైన చాంపియన్‌గా నోస్కోవా రికార్డులకెక్కింది. 2 గంటలా 28 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్.. వింబుల్డన్ విమెన్స్ సింగిల్స్ చరిత్రలోనే మూడో అత్యంత సుదీర్ఘమైన ఫైనల్ మ్యాచ్‌గా నిలిచింది. అలాగే వింబుల్డన్ వేదికపై సరికొత్త విమెన్స్ చాంపియన్లు ఆవిర్భవించడం ఇది వరుసగా తొమ్మిదో ఏడాది కావడం విశేషం. దాంతో ప్రతి ఏటా సరికొత్త విజేతను పరి చయం చేసే సాంప్రదాయాన్ని వింబుల్డన్ ఈసారి కూడా కొనసాగించింది. ఇక హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో నోస్కోవా అటాకింగ్ గేమ్‌తో ఆకట్టుకుంది. 10 ఏస్‌లు, 4 డబుల్ ఫాల్ట్స్ చేసింది. తన సర్వీస్‌లో 74 పాయింట్లు రాబట్టింది. 13 బ్రేక్ పాయింట్లలో నాలుగింటిని కాచుకుంది. 44 విన్నర్లు, 36 అన్‌ఫోర్స్‌డ్ ఎర్రర్స్ చేసింది. 27 అన్‌ఫోర్స్‌డ్ ఎర్రర్స్, 35 విన్నర్లు కొట్టిన ముచోవా రెండు బ్రేక్ పాయింట్లను మాత్రమే కాపాడుకుంది. తన సర్వీస్‌లో 53 పాయింట్లు మాత్రమే రాబట్టింది. 6 ఏస్‌లతో సరిపెట్టుకుంది.

# లా ప్లాగ్నే ఓపెన్ చెస్ విజేత ఇనియన్

**లా ప్లాగ్నే:** ఫ్రాన్స్‌లో జరిగిన ప్రతిష్టాత్మక '6వ లా ప్లాగ్నే ఓపెన్ ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్ టైటిల్‌ను ఇండియా గ్రాండ్ మాస్టర్ పి. ఇనియన్ గెలుచుకున్నాడు. మాస్టర్స్ కేటగిరీలో ఒక్క మ్యాచ్‌లోనూ ఓడకపోవడం విశేషం. తొమ్మిది రౌండ్ల పాటు సాగిన ఈ పోటీల్లో ఇనియన్ 7.5 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. మొత్తం ఆరు విజయాలు, మూడు డ్రాలతో స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించాడు. మొదటి రౌండ్‌లో ప్రత్యర్థి వాకోవర్ ఇవ్వడంతో పాయింట్ సాధించిన ఇనియన్, రెండో రౌండ్‌ను డ్రాగా ముగించాడు. ఆ తర్వాత వరుసగా రెండు విజయాలతో ఊపుందుకున్నాడు. ఐదో రౌండ్ డ్రా అయినప్పటికీ, తర్వాతి మూడు రౌండ్లలో వరుస విజయాలు నమోదు చేసి టైటిల్ వైపు దూసుకెళ్లాడు. ఈ క్రమంలో ఇటలీకి చెందిన జీఎం లూకా మొరోని, ఉక్రెయిన్‌కు చెందిన ఐఎం డానియల్ మోసెసోవ్‌లపై సాధించిన కీలక విజయాలు ఇనియన్ చాంపియన్‌గా నిలవడంలో ప్రధాన పాత్ర పోషించాయి. మోసెసోవ్ రన్నరప్‌గా నిలవగా, లూకా మొరోని మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. అరోణ్యక్ ఘోష్, దిప్తాయన్ ఘోష్ చెరో 6.5 పాయింట్లతో ఉమ్మడిగా మూడో స్థానాన్ని పంచుకున్నారు. ఇనియన్‌కు ఈ ఏడాది (2026) ఇది నాలుగో టోర్నమెంట్ టైటిల్ కాగా, క్లాసికల్ చెస్ విభాగంలో రెండోది కావడం విశేషం.

# ప్రీతిక డబుల్ ధమాక

**మాడ్రిడ్:** ఇండియా యంగ్ ఆర్చర్ ప్రీతిక ప్రదీప్.. ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-4లో డబుల్ మెడల్స్‌తో మెరిసింది. శనివారం జరిగిన హోరాహోరీ ఫైనల్లో జ్యోతి సురేఖ వెన్నం-ప్రీతిక ప్రదీప్-చికితా తానిపర్తిలతో కూడిన ఇండియా త్రయం 228-232 స్కోరుతో కొలంబియా చేతిలో ఓడి రజత పతకంతో సరిపెట్టుకుంది. తర్వాత జరిగిన వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో ప్రీతిక కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. బ్రాంజ్ మెడల్ ప్లే ఆఫ్ మ్యాచ్‌లో ప్రీతిక 145-142 స్కోరుతో వరల్డ్ 11వ ర్యాంకర్ హజాల్ బురున్ (టర్కీ)కు షాకిచ్చింది. అంతకుముందు టీమ్ విభాగంలో 17 ఏళ్ల ప్రీతిక ఆరుసార్లు పర్ఫెక్ట్ 10 పాయింట్లు సాధించినా.. సీనియర్ ఆర్చర్ జ్యోతి సురేఖ ఫామ్ కోల్పోవడం జట్టు లయను దెబ్బతీసింది. ఆమె వేసిన 8 బాణాల్లో కేవలం మూడు మాత్రమే 10 పాయింట్ల లక్ష్యాన్ని చేరాయి. కొలంబియా ఆర్చర్ ఉస్కియానో వరుసగా 8 పర్ఫెక్ట్ 10 స్కోరు చేసింది. తొలి రౌండ్ నుంచే జోరు చూపెట్టిన కొలంబియా 57 పాయింట్లు సాధించగా, ఇండియా 55 పాయింట్లకే పరిమితమైంది. రెండో రౌండ్‌లో కొలంబియా 60/60 స్కోరు చేసి ఆధిక్యాన్ని 117-113కు పెంచుకుంది. థర్డ్ రౌండ్‌లో ఇండియా వరుసగా ఐదుసార్లు 10/10 పాయింట్లు సాధించి తేడాను 172-174కు తగ్గించింది. కానీ నిర్ణయాత్మక ఆఖరి రౌండ్‌లో ఒత్తిడికి లోనైన ఇండియా త్రయం 56 పాయింట్లే చేయగా.. కొలంబియా 58 పాయింట్లు సాధించింది.

# నీరూ ధండాకు స్వర్ణం

**లొనాటో:** ఇండియా షూటర్ నీరూ ధండా.. ఐఎస్‌ఎస్‌ఎఫ్ షాట్‌గన్ వరల్డ్ కప్‌లో స్వర్ణ పతకంతో మెరిసింది. శనివారం జరిగిన విమెన్స్ ట్రాప్ ఫైనల్లో నీరూ 27 పాయింట్లతో టాప్ ప్లేస్‌లో నిలిచింది. కరోల్ కోర్మేనియర్ (25), ఎరికా సెస్సా (23) వరుసగా రజతం, కాంస్యం సొంతం చేసుకున్నారు. క్వాలిఫికేషన్‌లో నీరూ 75/75 పాయింట్లతో టాప్ ప్లేస్‌తో ఫైనల్స్‌కు అర్హత సాధించింది. తర్వాతి రెండు రౌండ్లలో రెండేసి లక్ష్యాలను మాత్రమే చేజార్చుకుని 121 పాయింట్లతో నంబర్‌వన్‌గా నిలిచింది. ఫైనల్లోనూ అదే జోరు కొనసాగించి కేవలం 2, 13, 25వ షాట్లను మాత్రమే మిస్ చేసినా చివరివరకు నిలకడగా ఆడి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. క్వాలిఫయింగ్‌లో మనీషా కీర్, ఆషిమా అహ్లావత్ నిరాశపర్చారు. మెన్స్ ట్రాప్ విభాగంలో అన్వర్ రిజ్వీ 118 పాయింట్లతో 40వ స్థానంలో, సీనియర్ షూటర్ కైనన్ చెనాయ్ (116) 71వ స్థానంలో నిలిచారు.

# సర్వేష్ కొత్త చరిత్ర

**మొనాకో:** ఇండియా హై జంపర్ సర్వేష్ కుషారే సరికొత్త చరిత్ర సృష్టించాడు. ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్‌లో బ్రాంజ్ మెడల్‌తో మెరిశాడు. శుక్రవారం రాత్రి జరిగిన హైజంప్ ఫైనల్లో సర్వేష్ 2.26 మీటర్ల ఎత్తు పైనుంచి దూకి మూడో ప్లేస్‌లో నిలిచాడు. దాంతో డైమండ్ లీగ్ హై జంప్‌లో పతకం సాధించిన తొలి ఇండియన్ అథ్లెట్‌గా అరుదైన ఘనత సాధించాడు. ఇప్పటికే జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా, లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్, డిస్కస్ త్రోయర్ వికాస్ గౌడ మాత్రమే ఈ ఘనత సాధించారు. ఒలేహ్ డోరోష్‌చుక్ (ఉక్రెయిన్, 2.32 మీటర్లు), జాక్ కిమాని (బ్రిటన్, 2.30 మీటర్లు) వరుసగా స్వర్ణం, రజతం నెగ్గారు.

# క్రాంతి పాంచ్

**లండన్:** ఇంగ్లండ్ విమెన్స్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్‌లో ఇండియా పట్టు బిగించింది. క్రాంతి గౌడ్ (5/37) బౌలింగ్‌లో చెలరేగడంతో.. 27/1 ఓవర్‌నైట్ స్కోరుతో శనివారం రెండో రోజు ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 59.1 ఓవర్లలో 170 రన్స్‌కు ఆలౌటైంది. అమీ జోన్స్ (52), నాట్ సివర్ బ్రంట్ (44) మినహా మిగతావారు నిరాశపర్చారు. ఈ ఇద్దరు ఐదో వికెట్‌కు 84 రన్స్ జోడించడంతో ఆ మాత్రం స్కోరైనా వచ్చింది. తొలి సెషన్ నుంచే క్రాంతి అద్భుతమైన బౌలింగ్‌తో ఇంగ్లండ్ బ్యాటర్ల పని పట్టింది. మియా బౌచర్ (23), మ్యాడీ విలియర్స్ (10), ఎకిల్‌స్టోన్ (11) ఓ మాదిరిగా ఆడారు. ట్యామీ బ్యూమెంట్ (2), హీథర్ నైట్ (6), అలైస్ క్యాప్సీ (9), ఇసీ వాంగ్ (7 నాటౌట్), లారెన్ బెల్ (3), లారెన్ ఫిలర్ (0) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. సయాలీ, స్నేహ్ రాణా చెరో రెండు వికెట్లు తీశారు. తర్వాత రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ఇండియా ఆట ముగిసే టైమ్‌కు 42 ఓవర్లలో 154/1 స్కోరు చేసింది. షెఫాలీ వర్మ (33) ఔటైనా.. స్మృతి (69 బ్యాటింగ్), యాస్తిక భాటియా (39 బ్యాటింగ్) మెరుగ్గా ఆడారు. ప్రస్తుతం ఇండియా 269 రన్స్ ఆధిక్యంలో కొనసాగుతోంది.




క్రాంతి గౌడ్ (5/37)

# టాకీస్

# మూగబోయిన మధుర స్వరం

**భారతీయ సినీ సంగీత ప్రపంచంలో ఒక స్వర్ణయుగానికి ముగింపు పలికింది. దక్షిణ భారత సినీ సంగీతానికి తన అపూర్వమైన గాత్రంతో చిరస్థాయిగా నిలిచిన ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకి 88 ఏళ్ల వయసులో కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె మరణంతో భారతీయ సంగీత ప్రపంచం ఒక అపూర్వ గానరత్నాన్ని కోల్పోయింది. ఆరు దశాబ్దాలకు పైగా సాగిన ఆమె సంగీత ప్రయాణం కోట్లాది మంది హృదయాలను తాకింది. ప్రేమ, విరహం, భక్తి, మాతృత్వం, విషాదం, ఉల్లాసం... ఏ భావాన్నైనా తన గాత్రంలో పలికించి శ్రోతలను మంత్రముగ్ధులను చేసిన మహాగాయని ఎస్. జానకి.**



**పల్లెటూరి నుంచి సంగీత శిఖరాల వరకు**

ఎస్. జానకి పూర్తి పేరు శిష్టా శ్రీరామమూర్తి జానకి. 1938 ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా రేపల్లె సమీపంలోని పల్లపట్ల గ్రామంలో జన్మించారు. చిన్నతనం నుంచే సంగీతంపై అపారమైన ఆసక్తి ఉండేది. సాంప్రదాయ శాస్త్రీయ సంగీతంలో పూర్తి స్థాయి శిక్షణ పొందకపోయినా, సహజసిద్ధమైన గాత్రమే ఆమెకు గొప్ప బలం అయింది.

**తెలంగాణతో అనుబంధం**

ఎస్. జానకి పుట్టింది ఏపీలో అయినా పెరిగింది మొత్తం తెలంగాణలోనే. ఉద్యోగం కోసం తండ్రి సిరిసిల్లకు రావడంతో జానకి బాల్యం, విద్యాభ్యాసం మొత్తం ఇక్కడే సాగింది. చిన్నప్పటి నుంచే సంగీతం పట్ల జానకిలో ఆసక్తి మొదలైంది. మూడేళ్ల వయసులోనే సినిమా పాటలను అనుకరిస్తూ ముద్దుముద్దుగా పాడేవారు. తన పదేళ్ల వయసులో నాదస్వర విద్వాంసుడైన పైడిస్వామి వద్ద సంగీతంలో ప్రాథమిక శిక్షణ పొందారు. సినిమాల కోసం ఇరవై ఏళ్ల వయసులో మద్రాస్ పయనమయ్యారు.

**17 భాషల్లో..**

1957లో తమిళ చిత్రం 'విధియిన్ విలయట్టు' ద్వారా నేపథ్య గాయనిగా సినీ రంగంలో అడుగుపెట్టారు. అదే ఏడాది తెలుగులోనూ పాడారు. తెలుగులో ఆమె తొలి చిత్రం 'ఎమ్మెల్యే'. తొలి అవకాశంతోనే సంగీత దర్శకుల దృష్టిని ఆకర్షించారు. దాంతో కెరీర్ ప్రారంభించిన తొలి ఏడాదే ఆరు భాషల్లో పాటలు పాడటం విశేషం. అనంతరం తమిళ, తెలుగు, కన్నడ, మలయాళం మాత్రమే కాకుండా హిందీ, ఒడియా, బెంగాలీ, మరాఠీ, తుళు, కొంకణి, సంస్కృతం సహా 17 భాషల్లో పాటలు పాడి అసాధారణ గాన ప్రతిభను చాటారు. ఇంగ్లీష్, జర్మనీ, సింహళీ భాషల్లోనూ ఆమె పాటలు పాడటం విశేషం.

**చిన్నారైనా, పండు ముసలైనా..**

1960ల నుంచి ఆమెకు బ్రీతింగ్ సమస్య మొదలైంది. పాడేటప్పుడు ఆయాసం ఇబ్బంది పెడుతున్నా లక్ష్యపెట్టకుండా ఎన్నో సూపర్ హిట్ సాంగ్స్ పాడారామె. 1989లో వచ్చిన 'మౌన పోరాటం' చిత్రానికి ఆమె సంగీతం అందించారు. అలాగే ప్రైవేట్ సాంగ్స్‌ను ఆమె కంపోజ్ చేశారు. చందమామ రావే, జడ్జిమెంట్ లాంటి చిత్రాల్లో డబ్బింగ్ చెప్పారు. మూడేళ్ల చిన్నారి వయసుకు తగ్గట్టుగా పాడటమే కాదు.. మగ గొంతుతోనూ, పండు ముసలి గొంతుతోనూ పాటలు పాడి ఆమె మెప్పించారు.



**ప్రతి పాట ఒక అద్భుతం**

తెలుగులో ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, పి.బి. శ్రీనివాస్, యేసుదాస్, పి.సుశీల వంటి దిగ్గజ గాయనీగాయకులతో కలిసి ఎన్నో చిరస్మరణీయ గీతాలను ఆలపించారు. నాదస్వరం, వయలిన్, ఫ్లూట్ లాంటి సంప్రదాయ వాయిద్యాలతో పాటు మోడ్రన్ ఇన్‌స్ట్రుమెంట్స్‌తో ఆమె గాత్రం పోటీపడేది. ఆమె పాడిన పాటల్లో ఎన్నో ఇప్పటికీ సంగీత ప్రియుల పెదవులపై వినిపిస్తూనే ఉంటాయి. ప్రేమగీతాలు, జానపదాలు, భక్తి గీతాలు, విషాద గీతాలు, పిల్లల పాటలు... ఏ ప్రక్రియలోనైనా ఆమె తనదైన ముద్ర వేశారు.

**సంగీత దర్శకుల అభిమాన గాయని**

ఎస్.రాజేశ్వరరావు, పెండ్యాల, కె.వి. మహదేవన్, ఎం.ఎస్. విశ్వనాథన్, చక్రవర్తి, ఇళయరాజా, రాజ్‌కోటి, ఎ.ఆర్. రెహమాన్, ఎం.ఎం. కీరవాణి, వందేమాతరం శ్రీనివాస్, ఎస్.ఎ.రాజశేఖర్ వంటి పలువురు ప్రముఖ సంగీత దర్శకుల స్వరాలకు ఆమె గాత్రం అపూర్వమైన అందాన్ని తీసుకొచ్చింది. ప్రత్యేకించి ఇళయరాజా స్వర కల్పనల్లో ఎస్. జానకి గాత్రం ఒక ప్రత్యేక మాధుర్యాన్ని సంతరించుకుంది. ఆమె గాత్రంతో ఇళయరాజా ఎన్నో ప్రయోగాలు చేశారు. దక్షిణ భారత సినీ సంగీత స్వర్ణయుగంలో ఈ ఇద్దరి కలయిక ఎన్నో చిరస్మరణీయ గీతాలకు కారణమైంది.

**జాతీయ స్థాయిలో గుర్తింపు**

ఎస్. జానకి తన సంగీత జీవితంలో నాలుగు జాతీయ ఉత్తమ నేపథ్య గాయని పురస్కారాలు అందుకున్నారు. అలాగే పది నంది అవార్డులు, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనేక పురస్కారాలు, 33కు పైగా ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. అనేక విశ్వవిద్యాలయాలు ఆమెకు గౌరవ డాక్టరేట్లు కూడా ప్రదానం చేశాయి.



**పద్మభూషణ్‌ను ఎందుకు తిరస్కరించారు?**

2013లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మభూషణ్ పురస్కారాన్ని ఎస్. జానకి మర్యాదపూర్వకంగా తిరస్కరించారు. తనకు ఈ గౌరవం చాలా ఆలస్యంగా లభించిందని, దక్షిణ భారత కళాకారులకు తగిన గుర్తింపు లభించడం లేదని ఆమె బహిరంగంగానే అభిప్రాయం వ్యక్తం చేశారు. వ్యక్తిగత గౌరవం కంటే కళాకారుల గౌరవమే ముఖ్యమని చెప్పిన ఆమె నిర్ణయం అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**సంగీతానికి వీడ్కోలు**

2017లో మైసూరులో జరిగిన ఒక సంగీత కార్యక్రమం తర్వాత ఇకపై వేదికలపై పాటలు పాడబోనని ప్రకటించారు. అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతూ తన సంగీత ప్రయాణానికి ముగింపు పలికారు.

**వ్యక్తిగత జీవితంలో విషాదం**

ఎస్. జానకి ఎప్పుడూ తన కుటుంబ జీవితాన్ని ప్రచారానికి దూరంగా ఉంచారు. ఆమె భర్త రాంప్రసాద్ కూడా మీడియాకు చాలా అరుదుగానే కనిపించేవారు. జానకి తన ఇంటర్వ్యూలలో, తన సంగీత ప్రస్థానం విజయవంతం కావడంలో భర్త ఇచ్చిన ప్రోత్సాహం ఎంతో కీలకమని పలుమార్లు పేర్కొన్నారు. 1959లో వీరి వివాహం జరిగింది. నుదుటన పెద్ద బొట్టు, సంప్రదాయ చీరకట్టుతో ఎంతో హుందాగా కనిపించేవారామె. 1997లో భర్త మరణం తర్వాత తెల్ల చీర, నుదుట విభూతిని కొనసాగించారు. జీవిత చరమాంకంలో ఎస్. జానకి తీవ్ర వ్యక్తిగత విషాదాన్ని కూడా ఎదుర్కొన్నారు. ఆమె ఏకైక కుమారుడు మురళీకృష్ణ ఈ ఏడాది జనవరిలో ఆకస్మికంగా మరణించడం ఆమెను తీవ్రంగా కలిచివేసింది. ఆ దుఃఖం నుంచి పూర్తిగా కోలుకోకముందే ఆమె కూడా కన్నుమూశారు.

**భారతీయ సంగీతానికి తీరని లోటు**

ఎస్. జానకి మరణం ఒక వ్యక్తి మరణం మాత్రమే కాదు. ఒక సంగీత యుగానికి ముగింపు. ఆమె గాత్రంలో భావాలు పలికాయి. ఆమె పాటల్లో జీవితం వినిపించింది. ఎన్నో తరాల ప్రేమకు, బాధకు, ఆనందానికి, భక్తికి ఆమె స్వరం నేపథ్య సంగీతమైంది. ఈరోజు ఆమె శరీరంగా మన మధ్య లేకపోయినా, ఆమె ఆలపించిన వేలాది పాటలు తరతరాల పాటు భారతీయ సంగీత సంపదగా నిలిచిపోతాయి. ''గానం ఆగిపోయినా... ఆ గాత్రం ఎన్నటికీ మూగబోదు''.

## ఎస్.జానకి పాడిన మధుర గీతాల్లో కొన్ని..



నీ లీల పాడెద దేవా (మురిపించే మువ్వలు), పగలే వెన్నెల (పూజాఫలం), గున్నమామిడి కొమ్మపైన (బాల మిత్రుల కథ), ఏ దివిలో విరిసిన (కన్నె వయసులు) సిరిమల్లె పూవా (పదహారేళ్ల వయసు), కన్నెపిల్లవని కన్నులున్నవని (ఆకలి రాజ్యం), తొలిసారి మిమ్మల్ని చూసింది, మనసా తుళ్లి పడకే (శ్రీవారికి ప్రేమలేఖ), శివపూజకు చిగురించిన సిరిసిరి మువ్వ (స్వర్ణ కమలం), ఏ తీగ పువ్వునో (మరో చరిత్ర), గోవుల్లు తెల్లన గోపయ్య నల్లన (సప్తపది), వెన్నెల్లో గోదారి అందం (సితార), వేణువై వచ్చాను భువనానికి (మాతృదేవోభవ), మంచు కురిసే వేళలో, అరె ఏమైందీ.. (అభినందన), బంతి చామంతి (అభిలాష), ఓం నమశివాయ, మౌనమేలనోయి (సాగర సంగమం), ప్రియతమా నా హృదయమా (ప్రేమ), ఈ దుర్యోధన దుశ్శాసన (ప్రతిఘటన), మాటే మంత్రము (సీతాకోక చిలుక), సుందరి నీవే (దళపతి) ముద్దుగారే యశోద (పడమటి సంధ్యారాగం), ఆకాశం ఏనాటిదో (నిరీక్షణ), నీ ఇల్లు బంగారం కాను (గజదొంగ), కోడి కూయక ముందే (చీమలదండు), మహా కనకదుర్గ (దేవుళ్లు), అమ్మా అని పిలిచిపిలిచి (సింహరాశి), ఎంతెంత దయనీది ఓ సాయి (శ్రీ సాయి మహిమ).

## 50 వేలకుపైగా పాటలు

ఎస్. జానకి తన సుదీర్ఘ సంగీత జీవితంలో సుమారు 50 వేలకుపైగా పాటలు ఆలపించారు. భారతీయ సినీ సంగీత చరిత్రలో అత్యధిక పాటలు పాడిన గాయనిలలో ఆమె ఒకరు. ప్రతి సంగీత దర్శకుడి శైలికి, ప్రతి భాష ఉచ్చారణకు, ప్రతి నటీమణి భావవ్యక్తీకరణకు తగ్గట్టుగా తన గాత్రాన్ని మార్చుకోవడం ఆమె ప్రత్యేకత. తెరపై కనిపించే పాత్ర వయసు, అమాయకత్వం, బాధ, ప్రేమ, కోపం... ఏ భావమైనా తన గొంతుతోనే వినిపించగలిగే అసాధారణ ప్రతిభ ఆమె సొంతం. అందుకే ఆమెను చాలామంది సంగీత విమర్శకులు 'ద క్వీన్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ అండ్ మాడ్యులేషన్' గా పిలిచేవారు.

## చివరిగా పాడిన పాట

**ఎస్. జానకి సినీ గాన జీవితంలో చివరిగా అధికారికంగా రికార్డ్ చేసిన పాట మలయాళ చిత్రం '10 కల్పనకల్'లోని 'అమ్మా పూవినమ్' అనే జోల పాట. ఈ పాటకు మిథున్ ఈశ్వర్ సంగీతం అందించారు. 2016లో జానకి స్వయంగా ఇదే తన చివరి రికార్డింగ్ అని ప్రకటించారు. దాదాపు 60 ఏళ్లకు పైగా సాగిన ఆమె గాన ప్రస్థానానికి ఇది ముగింపు పాటగా నిలిచింది. అలాగే 2017లో మైసూరులో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో ప్రజల ముందర ఆమె చివరిసారిగా సంగీత కచేరీలో పాడారు.**



Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.

# ఆర్మీలో లెఫ్టినెంట్ పోస్టులు



దేశ రక్షణ రంగంలో పనిచేయాలనుకునే ఇంజినీరింగ్ అభ్యర్థులకు ఇండియన్ ఆర్మీ అద్భుతమైన అవకాశం కల్పిస్తోంది. 2027, ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న 68వ షార్ట్ సర్వీస్ కమిషన్ (టెక్నికల్) మెన్ కోర్స్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా మొత్తం 350 లెఫ్టినెంట్ స్థాయి పోస్టులను భర్తీ చేయనున్నారు. గుర్తింపు పొందిన విభాగాల్లో ఇంజినీరింగ్ పూర్తి చేసిన లేదా చివరి సంవత్సరం చదువుతున్న అవివాహిత పురుష అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులు. అర్హత గల అభ్యర్థులు జులై 09 నుంచి ఆగస్టు 07 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి 'లెఫ్టినెంట్' హోదాతోపాటు మగధ్ యూనివర్సిటీ నుంచి పీజీ డిప్లొమా డిగ్రీ లభిస్తుంది.

**పోస్టు పేరు:** షార్ట్ సర్వీస్ కమిషన్ (టెక్నికల్) -ఎస్ఎస్‌సీ(టీ)-68 పురుషులు.

**మొత్తం ఖాళీలు:** 350.

**విభాగాల వారీగా ఖాళీలు:** సివిల్ 75, కంప్యూటర్ సైన్స్ 60, ఎలక్ట్రికల్ 33, ఎలక్ట్రానిక్స్ 64, మెకానికల్ 101, ఇతర ఇంజినీరింగ్ స్ట్రీమ్స్ 17.

**వైవాహిక స్థితి:** కేవలం అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఓటీఏ)లో పూర్తి స్థాయి శిక్షణ ముగిసే వరకు అభ్యర్థులు వివాహం చేసుకోకూడదు. శిక్షణలో చేరడానికి ముందు లేదా శిక్షణ సమయంలో వివాహం చేసుకుంటే సదరు అభ్యర్థిత్వాన్ని రద్దు చేయడంతోపాటు వారిని విధుల నుంచి తొలగిస్తారు.

**ఎలిజిబిలిటీ:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగంలో ఇంజినీరింగ్ పూర్తిచేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. 2027, మార్చి 29 తర్వాత చివరి సంవత్సరం లేదా చివరి సెమిస్టర్ ఫలితాలు వెల్లడయ్యే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు కారు.

**వయోపరిమితి:** 2027, ఏప్రిల్ 1 నాటికి 20 నుంచి 27 ఏళ్ల మధ్యలో ఉండాలి. అంటే అభ్యర్థులు 2000, ఏప్రిల్ 1 నుంచి 2007, మార్చి 31 మధ్యలో జన్మించి ఉండాలి.

**అప్లికేషన్:** ఆన్‌లైన్ ద్వారా.

**అప్లికేషన్ ప్రారంభం:** జులై 9.

**ఎలాంటి అప్లికేషన్ ఫీజు లేదు.**

**లాస్ట్ డేట్:** ఆగస్టు 7.

**షార్ట్‌లిస్టింగ్ కటాఫ్:** అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన కటాఫ్ మార్కుల వివరాలను సెప్టెంబర్ మొదటి వారంలో విడుదల చేస్తారు.

**సెలెక్షన్ ప్రాసెస్:** షార్ట్ లిస్టింగ్, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ www. joinindianarmy.nic.inను సందర్శించండి.**

**ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ:** ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ రెండు దశల్లో ఉంటుంది. స్టేజ్-1లో ఉత్తీర్ణులైన వారిని మాత్రమే స్టేజ్-2కు అనుమతిస్తారు. మొదటి దశలో అర్హత సాధించని అభ్యర్థులను అదేరోజు తిరిగి పంపించివేస్తారు. ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలు ఐదు రోజులపాటు జరుగుతాయి. 2026, అక్టోబర్- డిసెంబర్ నెలల మధ్య నిర్వహించే అవకాశం ఉన్నది.

**సెలెక్షన్ సెంటర్స్:** షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ప్రయాగ్‌రాజ్ (ఉత్తరప్రదేశ్), భోపాల్ (మధ్యప్రదేశ్), బెంగళూరు (కర్ణాటక), జలంధర్ (పంజాబ్)ల్లోని ఏదో ఒక సెలెక్షన్ సెంటర్‌లో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

**కోర్స్ ప్రారంభం:** 2027, ఏప్రిల్.

**శిక్షణా కాలం:** 2027, ఏప్రిల్ నుంచి 2028, మార్చి వరకు (49 వారాలు). శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు బోధ్‌గయలోని మగధ్ యూనివర్సిటీ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మిలిటరీ స్టడీస్ & డిఫెన్స్ మేనేజ్‌మెంట్ డిగ్రీని ప్రదానం చేస్తుంది.

**శిక్షణా కాలంలో స్టైపెండ్:** నెలకు రూ. 56,100ల స్టైపెండ్ చెల్లిస్తారు.

**కమిషనింగ్ హోదా:** ప్రొబేషన్‌పై అభ్యర్థులకు లెఫ్టినెంట్ హోదాతో షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) కేటాయిస్తారు.

**కనీస సేవా కాలం:** 10 సంవత్సరాలు.

**గరిష్ట సేవా కాలం:** అర్హతను బట్టి 10 సంవత్సరాల తర్వాత మరో 4 ఏళ్ల పాటు పొడిగింపు అవకాశంతో గరిష్టంగా 14 సంవత్సరాల వరకు సేవలు అందించవచ్చు.

**పర్మనెంట్ కమిషన్ ఆప్షన్:** అభ్యర్థి అర్హత, సామర్థ్యం, అప్పటి నిబంధనల ఆధారంగా.. వారి 10 సంవత్సరాల సర్వీసులో పర్మనెంట్ కమిషన్ కల్పించే అంశాన్ని పరిశీలిస్తారు.

## డీఆర్‌డీఓ ఎస్ఏజీలో వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) సైంటిఫిక్ అనాలసిస్ గ్రూప్ (ఎస్ఏజీ) జూనియర్ రీసెర్చ్ ఫెలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

**పోస్టు పేరు:** జూనియర్ రీసెర్చ్ ఫెలో.

**మొత్తం ఖాళీలు:** 11.

**విభాగాల వారీగా ఖాళీలు:** మ్యాథమెటిక్స్ 3, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ/ కంప్యూటర్ సైన్స్ (సీఎస్) 4, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈ)/ ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) 3, ఫిజిక్స్ 1.

**ఎలిజిబిలిటీ:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగంలో బీఈ/ బి.టెక్‌లో



ఉత్తీర్ణత సాధించి ఉండాలి. వీటితోపాటు నెట్ లేదా గేట్ స్కోర్ తప్పనిసరి. లేదా సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ రెండింటిలోనూ ఫస్ట్ క్లాస్ మార్కులతో ఎంఈ/ ఎం.టెక్ పూర్తిచేసి ఉండాలి.

అభ్యర్థులు మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ విభాగాల్లో ఫస్ట్ క్లాస్ మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి. దీంతోపాటు నెట్ అర్హత సాధించి ఉండటం తప్పనిసరి.

**గరిష్ట వయోపరిమితి:** 35 ఏళ్లు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వ్‌డ్ వర్గాలకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

**అప్లికేషన్:** ఆన్‌లైన్ ద్వారా.

**ఎలాంటి అప్లికేషన్ ఫీజు లేదు.**

**వాక్‌ఇన్ ఇంటర్వ్యూ:** ఆగస్టు 5.

**సెలెక్షన్ ప్రాసెస్:** ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ drdo.gov.inను సందర్శించండి.**

## యంగ్ ప్రొఫెషనల్స్

ఐసీఎంఆర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ ప్రివెన్షన్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐసీపీఆర్) యంగ్ ప్రొఫెషనల్స్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

**ఎలిజిబిలిటీ:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో ఎం.కామ్ లేదా ఎంబీఏ పూర్తిచేసి ఉండాలి. లేదా సీఏ ఇంటర్/ ఐసీడబ్ల్యూఏ ఇంటర్/ సీఎస్ ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి.


**వాక్‌ఇన్ ఇంటర్వ్యూ:** జులై 31.

**సెలెక్షన్ ప్రాసెస్:** ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ icmr.gov.inను సందర్శించండి.**

## దేశంలో గిరిజన తెగలు

| రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలు | తెగలు |
|---|---|
| అండమాన్, నికోబార్ దీవులు | షోంపైన్స్, జార్వాస్, సెంటినెలీస్, ఓంజెస్, నికోబారిస్ |
| కేరళ | కనిక్కర్, పులియాన్స్, మొరాలిన్, మత్తువన్, కానీస్, అరుందన్, మన్నార్, మలైకండి, ఉరదలి. |
| తమిళనాడు | తోడాలు, బడగాలు, కోటాలు, ఇరుల, కనికర, ఆదియన్, యూజుల, షోల్గా |
| కర్ణాటక | అడియాన్, బార్డియా, భిల్, చెంచు, చెంచువార్, దుబా, తలావియా, పద్వి, మేవాసి, బగాలియ, చోదర |
| అరుణాచల్‌ప్రదేశ్ | అపటానిస్, అబోర్, మిష్మి, డాఫ్లా, గెలాంగ్, మోంపా |
| సిక్కిం | లెప్చాస్ |
| అసోం | లెప్చాస్, అబోర్స్, చెక్మా, చుటియా, మికిర, థింసా, రబాస్ |
| మధ్యప్రదేశ్ | అంధ్, మీనా, బాట్రా, బైగా, కారియ,కట్కారి, బిరోర్, కోల్, భిల్లులు, గడబా,భారియా, పార్థి, ఆదివాసీలు, గోండులు, మూరియాస్ |
| ఉత్తరాఖండ్ | బొటియా, కుమయున్, గుజ్జాస్ |
| త్రిపుర | భుటియా, భిల్, చక్మా, గారో, కుకి, ఖాసియా, లుషాయి, ముండా, ఒరాంగ్, సంతాల్ |
| ఆంధ్రప్రదేశ్ | అంథ్, బగత, భిల్, చెంచులు, కొండసవర, సుగాలి, కొండరెడ్డి, కోయ, కోలామ్, ఖారియా, యానాది, ఎరుకల |
| తెలంగాణ | చెంచు, గోండు, కోయ, తోటి, కొండరెడ్డి, లంబాడి |
| హిమాచల్‌ప్రదేశ్ | గడ్డిస్, భోట్, కిన్నర, పంగ్వాలా, లహోల్, సావంగ్లా, కనౌరా, ఖంప, గుజ్జరులు |
| మేఘాలయ | గారో, హమర్, జయంతియా, ఖాసీలు |
| బిహార్ | భూమిజ్, బైగా, బంజార్, ముండా, బేడియా, బింజియా, చిక్, కోర్వా, గోండులు, బిరోర్, ముండాలు, ఓరాన్, సంతాలు |
| ఉత్తర్‌ప్రదేశ్ | భోక్ష, భోటియా, జౌన్సారీ, రాజీ, థారూ, బోలియాలు, ఖాస్ |
| ఒడిశా | భాగట్టా, భూమియా, భుంజియా, గడబ,జువాంగ్, ఖోండులు, గోండు, ఒరాన్లు, సంతాల్, ముండాలు, చెంచు, థారువా, |
| మణిపూర్ | కుకి, రెంగ్మా |
| మిజోరాం | లఖేర్, మిజో, మాత్, పాకి, లూషాయి |
| నాగాలాండ్ | నాగాలు, సిటెంట్, అంగామి, జెలియాంగ్, ఆవో, సెమ, రెంగా |



పిల్లలు రోజూ ఉదయాన్నే లేచి, స్నానాలు చేసి అమ్మ రెడీ చేసిన వేడి వేడి టిఫిన్ తిని, ఇస్త్రీ చేసిన యూనిఫాం వేసుకుని, బ్యాగులు భుజాన తగిలించుకుని పరుగుపరుగున స్కూళ్లకు వెళ్తుంటే.. వాళ్ల హడావిడి చూడ్డానికి ఎంత ముచ్చటగా ఉంటుందో! ఇదంతా ఓకే. కానీ సాయంత్రానికి పిల్లలు వాడిపోయిన మొహాలతో అలసిపోయి ఇంటికి వస్తుంటారు. ఇలాగే కొనసాగితే పిల్లలు ఒత్తిడికి గురవ్వడం సహజం. వాళ్లకు ఒకింత ఊరట కలిగించేలా కొత్త ఉత్సాహాన్ని నింపాల్సిన అవసరం ఉంది. అందుకే సిటీలో సరికొత్త ఎంటర్టైన్మెంట్ సెంటర్స్ వెతుకుతున్నారు పేరెంట్స్. వాటిలో కిడ్స్ ప్లే జోన్స్ బాగా ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడికెళ్తే వారమంతా చదువుల్లో మునిగిపోయే పిల్లలకు వీకెండ్ ఒక చిన్న పండుగలా అనిపిస్తుంది.

# వీకెండ్ అంటే పిల్లలకు ప్లే టైమ్





ఒకప్పుడు పిల్లల ప్రపంచం వీధులే. కబడ్డీ, కోకో, దాగుడుమూతలు వంటి ఆటలు స్నేహం, శారీరక దృఢత్వం, టీం స్పిరిట్ను పెంచేవి. కానీ ఇప్పుడు అదే వినోదం ఇండోర్ ప్లే జోన్లు, పికిల్బాల్ కోర్టులు, ట్రాంపొలైన్ పార్కులు, గేమింగ్ సెంటర్ల రూపంలోకి మారింది. సేఫ్టీ, మోడర్న్ ఫెసిలిటీస్, సిటీ లైఫ్ స్టైల్ కారణంగా పిల్లల ఆటల వేదిక మారిపోయింది. అయితే లక్ష్యం మాత్రం మారలేదు. ఆనందం, ఆరోగ్యం, స్నేహబంధాలు. కాలంతోపాటు ఆటల రూపం మారినా, ఆటల విలువ మాత్రం అలాగే కొనసాగుతోంది.

**వినోదాన్ని అందిస్తున్న పిల్లల గేమ్ జోన్లు**

మాదాపూర్లోని ప్లే 'ఎన్' లెర్న్, జూబ్లీ హిల్స్లోని పీకజూ ప్లేహౌస్ వంటి కేంద్రాలు పిల్లల క్రియేటివిటీ పెంచే ప్రోగ్రామ్స్, ఆర్కేడ్ గేమ్లను అందిస్తున్నాయి. ఖాజాగూడలోని క్రియేటివ్ స్క్వేర్ ఆల్ట్ ప్లే డిస్కవరీ క్రియేటివ్ గేమ్గా ఫేమస్. గచ్చిబౌలిలోని క్రేజీ కిడ్జీ ప్లే అండ్ పార్టీ అనే ప్లే జోన్లో మినీ రేస్ ట్రాక్, ఇసుక గుంట, నటనా ఆటలు అందుబాటులో ఉన్నాయి.

హైటెక్ సిటీలోని ఇగ్యాలెరియా మాల్లో ఉన్న గేమ్ ఎక్స్ట్రీమ్ క్రికెట్ సిమ్యులేటర్లు, 360 డిగ్రీల వీఆర్ రోలర్ కోస్టర్లు, బౌలింగ్ అల్లేలకు ప్రసిద్ధి. స్కై సైక్లింగ్, జిప్లైనింగ్, బంపర్ కార్లు వంటివి అందిస్తారు. శరత్ సిటీ క్యాపిటల్ మాల్లోని టైమ్జోన్లు 60కి పైగా విభిన్నమైన ఇమ్మర్సివ్ వీఆర్ గేమ్లు, కార్నివాల్ క్లాసిక్స్, కాంపిటేటివ్ బౌలింగ్ ఉన్న ఒక అల్టిమేట్ మాసివ్ ఆర్కేడ్ గేమ్స్ ఉన్నాయి. సత్వా నెక్లెస్ మాల్ ర్చువల్ రియాలిటీ పాడ్లు, క్లాసిక్ క్లామెషిన్ గేమ్లతో కూడిన అత్యంత ఇంటరాక్టివ్ సెంటర్.

ఖైరతాబాద్ నెక్లెస్ రోడ్లో ఉన్న పిట్ స్టాప్ క్రేజీ కిడ్జీ బర్త్ డే పార్టీలు జరుపుకునేందుకు అనువైన స్థలం. ఈ కేంద్రంలో 15 రకాల అడ్వెంచర్ యాక్టివిటీస్ పిల్లల కోసం నిర్వహిస్తున్నారు. ఈ గేమింగ్ సెంటర్లో గో కార్టింగ్, బౌలింగ్, స్కై సైక్లింగ్, జిప్ లైన్, ఏటీవీ బైక్, జిరో రైడ్, రైఫిల్ షూటింగ్ యాక్టివిటీస్ చిన్నారులకు ఫన్ అందిస్తున్నాయి.

**ఇండోర్ ప్లే ఏరియాలు..**

వర్షాల సీజన్ను దృష్టిలో ఉంచుకుని ఇండోర్ ప్లే ఏరియాలతోపాటు అవుట్ డోర్ లొకేషన్లను పిల్లల కోసం అందుబాటులోకి తీసుకొచ్చారు. దూ సైన్స్.. పిల్లలు ఆడుకుంటూ సైన్స్ సూత్రాలను ఈజీగా నేర్చుకోవడానికి అద్భుతమైన లెర్నింగ్ స్పేస్. ఇంటరాక్టివ్ ఎగ్జిబిట్స్, లైఫ్సైజ్ పరికరాలు, వీఆర్ ఆస్ట్రానమీ షోలు ఇక్కడ ప్రత్యేకం. సంజీవయ్య చిల్డ్రన్స్ పార్క్ లోపల థ్రిల్ సిటీ వర్చువల్ రియాలిటీ సెంటర్, గేమింగ్ ఇష్టపడే పిల్లలను ఆకట్టుకుంటోంది.

ఇనార్బిట్ మాల్లోని ఫన్ సిటీలో పసిపిల్లల నుంచి పెద్దపిల్లల కోసం ఉత్కంఠభరితమైన ఇండోర్ వినోదపు రైడ్లు, ఆర్కేడ్ గేమ్లు, బంపర్ కార్లను అందుబాటులో ఉంచారు. కొండాపూర్లోని ప్లే2 గ్రో పిల్లలకు శారీరక, మేధోపరమైన ఆటలు నిర్వహించడంలో పాపులర్. బంజారాహిల్స్లోని జంగిల్ జిమ్ ఇండోర్ ప్లే జోన్ అద్భుతమైన సాఫ్ట్ ప్లే స్పేస్. జూబ్లీహిల్స్ ఒడిస్సీ మాల్లో మినిస్ట్రీ ఆఫ్ కిడ్స్, పసిపిల్లల కోసం ఇండోర్ ఆట స్థలాన్ని రెడీ చేశారు.

**హైదరాబాద్ కిడ్జ్ రన్**

హైదరాబాద్లో పిల్లల కోసం పలు కిడ్స్ జోన్లు ఈవెంట్లు నిర్వహిస్తున్నాయి. కుటుంబం మొత్తానికి ఫిట్నెస్ను ప్రోత్సహించే లక్ష్యంతో జులై 12వతేదీన యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీలో అవుట్ డోర్ మారథాన్ జరగనుంది. బేగంపేటలోని థ్రిల్ సిటీ ట్రాంపొలైన్, నింజా కోర్స్, వీఆర్ గేమ్స్, ఇండోర్ అడ్వెంచర్ యాక్టివిటీలతో ఈవెంట్లు చేస్తోంది. కోకాపేట జోన్ హైదరాబాద్లో ట్రాంపొలైన్ పార్క్, జిప్లైన్, క్లైంబింగ్, అడ్వెంచర్ గేమ్స్ నిర్వహించనున్నారు. బంజారాహిల్స్ లోని ఫంకీ మంకీ ప్లే సెంటర్ సాఫ్ట్ ప్లే, బాల్ పిట్, క్లైంబింగ్ యాక్టివిటీలను చేపట్టనున్నారు. దీంతోపాటు సిటీలో పిల్లల కోసం వర్క్షాప్లు, స్టోరీ టెల్లింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, సైన్స్ షోలు వంటి ఈవెంట్లు ఈ నెలలో నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ కిడ్స్ ఫెయిర్ కూడా జరగబోతోంది. సిటీలో ఉండే పిల్లలకు ఇవన్నీ క్రేజీ ఎక్స్పీరియెన్స్ని ఇవ్వబోతున్నాయి. ఇక వీకెండ్ అంటే పిల్లలకు ప్లే టైమ్!

వారమంతా చదువుల ఒత్తిడిలో ఉండే పిల్లలకు వీకెండ్లో కొంత సమయం స్వేచ్ఛగా ఆడుకునే అవకాశం కల్పించడం తల్లిదండ్రుల బాధ్యత.

### టాప్ 5 ట్రెండింగ్ యాక్టివిటీస్

**ట్రాంపొలైన్ పార్క్లు, పికిల్బాల్, ప్యాడెల్ టెన్నిస్, వర్చువల్ రియాలిటీ గేమ్స్, ఇండోర్ అడ్వెంచర్ కోర్సులు.**



### డిజిటల్ స్క్రీన్ల నుంచి బయటకు..

**డిజిటల్ స్క్రీన్ల నుంచి పిల్లలను బయటకు తీసుకొచ్చేందుకు తల్లిదండ్రులు వెతుకుతున్న ప్రత్యామ్నాయాలు ఈ కిడ్స్ జోన్లు అని చైల్డ్ సైకాలజీ డాక్టర్లు చెప్తున్నారు. ఒకప్పుడు వీకెండ్ అంటే క్రికెట్ లేదా బ్యాడ్మింటన్ మాత్రమే గుర్తొచ్చేది. ఇప్పుడు పికిల్బాల్, ప్యాడెల్ టెన్నిస్ వంటి కొత్త ఆటలు సిటీలో పాపులర్ అవుతున్నాయి. పిల్లలతోపాటు తల్లిదండ్రులు కూడా కలిసి ఆడేందుకు ఈ సెంటర్స్ వీలు కల్పిస్తున్నాయి. కుటుంబ సభ్యులు కలిసి గడిపే సమయం దొరుకుతుంది. శారీరక దృఢత్వం, ఏకాగ్రత, టీమ్ స్పిరిట్ డెవలప్ అవుతాయి. స్క్రీన్ టైమ్ తగ్గుతుంది. ఒత్తిడి తగ్గి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. పిల్లలకు విద్య ఎంత ముఖ్యమో.. ఆట కూడా అంతే ముఖ్యం అంటున్నారు పిల్లల డాక్టర్లు. అయితే వినోదంతోపాటు భద్రత కూడా చూసుకోవాలి. ఆట పరికరాల నిర్వహణ, శిక్షణ పొందిన సిబ్బంది, పరిశుభ్రత, ప్రథమ చికిత్స సౌకర్యాలు వంటి అంశాలను పరిశీలించిన తర్వాతే కిడ్స్ జోన్లను ఎంచుకోవాలని ఎక్స్పర్ట్స్ సూచిస్తున్నారు.**



# చియా సీడ్స్ తినడం మంచిదే కానీ..

'ఉదయం ఒక గ్లాస్ చియా వాటర్ తాగితే చాలు.. ఆరోగ్యం మీ సొంతం' అంటూ సోషల్ మీడియాలో ఎన్నో వీడియోలు కనిపిస్తుంటాయి. నిజమే.. చియా సీడ్స్లో పీచు, ఒమెగా– 3 ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కానీ వాటిని ఎలా తింటున్నామన్నదే అసలు విషయం. తప్పు పద్ధతిలో తీసుకుంటే జీర్ణ సమస్యల నుంచి అత్యవసర చికిత్స అవసరమయ్యే పరిస్థితి కూడా రావొచ్చని హార్వర్డ్, స్టాన్ఫోర్డ్లో శిక్షణ పొందిన గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సౌరభ్ సేథి హెచ్చరిస్తున్నారు.

చియా సీడ్స్ను నేరుగా నోట్లో వేసుకుని తినడం అస్సలు మంచిది కాదు అని డాక్టర్ సేథి చెప్తున్నారు. చియా సీడ్స్ను నానబెట్టినప్పుడు అవి నీటిని బాగా పీల్చుకుని తమ పరిమాణం కంటే చాలారెట్లు ఉబ్బుతాయి. ఇలా గొంతులోనే ఉబ్బిపోతే ఆహారనాళంలో ఇరుక్కుపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా మింగడంలో ఇబ్బంది ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి.

**ముందుగా నానబెట్టాలి**

చియా సీడ్స్ను కనీసం 20 నిమిషాలు నీటిలో నానబెట్టి తీసుకోవడం మంచిది. ఇలా చేస్తే అవి జెల్లా మారి సులభంగా జీర్ణమవుతాయి. పెరుగు, పాలు, స్మూతీలు లేదా ఓట్స్లో కలిపి కూడా తీసుకోవచ్చు.

**నీళ్లు తప్పనిసరిగా తాగాలి**

చియా సీడ్స్లో పీచు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వాటితోపాటు ఒక గ్లాస్ నీరు తాగడం అవసరం. తగినంత నీళ్లు తాగకపోతే మలబద్ధకం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.

**చివరగా..**

చియా సీడ్స్ నిజంగా పోషకాలతో నిండిన ఆహారమే. అయితే వాటిని సరైన పద్ధతిలో తీసుకుంటేనే పూర్తి ప్రయోజనం లభిస్తుంది. నానబెట్టి, తగినంత నీటితో, పరిమిత మోతాదులో తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని ఎక్స్పర్ట్స్ సూచిస్తున్నారు.

### మొదట తక్కువ మోతాదుతో..

**మొదటి నుంచే ఎక్కువ మోతాదులో తినకండి. రోజుకు ఒక టీస్పూన్తో ప్రారంభించి, శరీరం అలవాటు పడిన తర్వాత ఒకటి నుంచి రెండు టేబుల్ స్పూన్ల వరకు పెంచుకోవచ్చు. ఒక్కసారిగా ఎక్కువగా తీసుకుంటే జీర్ణ సమస్యలు రావచ్చు.**

### ఈ మందులు వాడేవారు జాగ్రత్త

**చియా సీడ్స్లో ఉండే ఒమెగా-3 కొవ్వు ఆమ్లాలు స్వల్పంగా రక్తాన్ని పలుచబరిచే ప్రభావం చూపొచ్చు. అందుకే వార్ఫరిన్ వంటి రక్తాన్ని పలుచబరిచే మందులు వాడుతున్నవారు ప్రతిరోజూ ఎక్కువ మోతాదులో చియా సీడ్స్ తీసుకోవాలంటే ముందు వైద్యుడి సలహా తీసుకోవాలి.**


## గ్యాడ్జెట్స్

### ఆటోమెటిక్ అంబ్రెల్లా — ₹ 949




వర్షంలో తడవకుండా, బలమైన గాలుల్లో కూడా సేఫ్గా బయటికెళ్లాలంటే ఎనిఖో కంపెనీ డిజైన్ చేసిన ఈ గొడుగు చాలా బాగా పనికొస్తుంది. 54 ఇంచుల పెద్ద కవరేజీతో రూపొందించిన ఈ గొడుగు కింద ఇద్దరు వ్యక్తులు నిలబడొచ్చు. డబుల్లేయర్ వెంటెడ్ కానోపీ ఉండటం వల్ల బలమైన గాలులు వీచినప్పుడు కూడా గొడుగు తలకిందులయ్యే అవకాశం తక్కువ. ఎనిమిది డబుల్ రిబ్స్తో కూడిన బలమైన ఫ్రేమ్ దీనికి అదనపు మన్నికను అందిస్తుంది. వాటర్ప్రూఫ్ ఫ్యాబ్రిక్ వర్షపు నీటిని సమర్థంగా అడ్డుకోవడమే కాకుండా, ఎండలోనూ మంచి రక్షణ కల్పిస్తుంది. ఒక్క బటన్ నొక్కగానే ఆటోమేటిక్గా తెరుచుకునే వ్యవస్థ ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఉపయోగించుకోవచ్చు. కారబైనర్ హ్యాండిల్ ప్రత్యేక ఆకర్షణగా ఉండి, బ్యాగ్కు లేదా హుక్కు ఈజీగా తగిలించుకునే సౌకర్యాన్ని ఇస్తుంది. రోజూ ఆఫీస్కు వెళ్లేవారు, ప్రయాణాలు ఎక్కువగా చేసేవాళ్లు, వర్షాకాలంలో మన్నికైన ప్రీమియం గొడుగు కోరుకునే పురుషులు, మహిళలు ఇద్దరికీ ఇది ఉపయోగకరమైన ఎంపికగా చెప్పొచ్చు.

### రెయిన్ బాల్ — ₹ 250 - 400



అకస్మాత్తుగా వర్షం వస్తే వెంటనే ఉపయోగించుకునేందుకు డిస్పోజబుల్ రెయిన్ బాల్ అండ్ రీఫిల్ రెయిన్ కార్డ్ ఎంతో ఉపయోగపడుతుంది. జేబులో కూడా ఈజీగా ఇమిడిపోయేంత చిన్న పరిమాణంలో ఉండే ఈ రెయిన్కోట్ను అవసరమైనప్పుడు మాత్రమే తెరిచి ధరించొచ్చు. ప్యాక్లో రెండు డిస్పోజబుల్ రెయిన్ బాల్స్తో పాటు మూడు రీఫిల్ రెయిన్ కార్డులు వస్తాయి. పలుచని వాటర్ప్రూఫ్ ప్లాస్టిక్తో తయారైన ఈ రెయిన్కోట్ తేలికపాటి నుంచి మోస్తరు వర్షం వరకు శరీరాన్ని తడవకుండా కాపాడుతుంది. ఫ్రీ సైజ్లో ఉండటంతో మహిళలు, పురుషులు ఇద్దరూ సులభంగా ధరించొచ్చు. ఒక్కసారి వాడేసి పారేయాల్సిన అవసరం లేకుండా, జాగ్రత్తగా వాడితే రెండు నుంచి మూడు సార్లు తిరిగి ఉపయోగించుకోవచ్చు. ప్రయాణాలు, బైక్ రైడింగ్, ట్రెక్కింగ్, క్యాంపింగ్, ఆఫీస్కు వెళ్లేవారు లేదా ఎప్పుడైనా వర్షం పడే అవకాశం ఉన్న రోజుల్లో బ్యాగ్లో తప్పనిసరిగా ఉంచుకోవాల్సిన అత్యవసర రక్షణ వస్తువుగా ఇది పనికొస్తుంది.

### క్లోత్స్ వార్మర్ — ₹ 2,500 - 3,500




వర్షాకాలం లేదా చలికాలంలో బట్టలు త్వరగా ఆరబెట్టేందుకు కోస్టార్ మేటర్ క్లోత్స్ వార్మర్ మంచి పరిష్కారంగా ఉపయోగపడుతుంది. మినీ పోర్టబుల్ డిజైన్తో రూపొందించిన ఈ వార్మర్లో పీటీసీ హీటింగ్ టెక్నాలజీ ఉండటంతో తక్కువ సమయంలోనే వేడి ఉత్పత్తి చేసి బట్టలను సమర్థంగా ఆరబెడుతుంది. తెలివైన ఇంటెలిజెంట్ టైమర్ ఉండటం వల్ల నిర్ణయించిన సమయం తర్వాత ఆటోమేటిక్గా ఆఫ్ అవుతుంది. 41 ఇంచుల పొడవుతో రూపొందించిన ఈ పరికరాన్ని వేలాడదీయొచ్చు, అవసరం లేనప్పుడు మడతపెట్టి ఈజీగా భద్రపరచుకోవచ్చు. లోదుస్తులు, శిశువుల బట్టలు, సాక్స్, టీషర్ట్లు వంటి చిన్న దుస్తులను త్వరగా ఆరబెట్టేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. అపార్ట్మెంట్లు, హాస్టళ్లు, ఆర్వీలు, ప్రయాణాల సమయంలో కూడా ఈజీగా తీసుకెళ్లేలా తేలికగా రూపొందించారు. వర్షం వల్ల బట్టలు ఆరడానికి ఇబ్బంది పడేవారికి, తక్కువ స్థలంలో వేగంగా బట్టలు ఆరబెట్టాలనుకునేవారికి ఈ క్లాత్స్ వార్మర్ ఒక ఉపయోగకరమైన వస్తువుగా చెప్పొచ్చు.



# షిఫ్ట్ ఏదైనా ఫిట్నెస్లో నో చేంజ్!

హైటెక్ సిటీలో కొత్తగా నైట్ సైక్లింగ్ ట్రెండ్ నడుస్తోంది. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా.. ఇప్పుడు ఈ ట్రెండ్ బాగా ఫాలో అవుతున్నారు టెకీలు. షిఫ్ట్లు మారినా.. ఫిట్నెస్ మెయింటెయిన్ చేయొచ్చు అంటున్నారు వాళ్లు. ఏ టైమ్ అయినా సరే.. సైక్లింగ్ చేయకుండా ఇంటికెళ్లరు అని నిర్వాహకులు చెప్తున్నారు.

రాత్రిపూట ట్రాఫిక్ తక్కువగా ఉండటం, ఆహ్లాదకరమైన వాతావరణం వల్ల చాలామంది సైక్లింగ్ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు పక్కన నార్సింగి దగ్గర ఉన్న సోలార్ కవర్డ్ సైక్లింగ్ ట్రాక్, హుస్సేన్ సాగర్ నెక్లెస్ రోడ్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ రోడ్లు సైక్లింగ్ చేయడానికి అనువుగా ఉన్నాయి. కొన్ని సైక్లింగ్ గ్రూపులు ఐటీ ఉద్యోగుల కోసం గచ్చిబౌలి, హైటెక్ సిటీ ప్రాంతాల్లో గైడెడ్ నైట్ రైడ్స్ ఈవెంట్లు నిర్వహిస్తున్నాయి.

దేశంలోనే మొట్టమొదటి అతిపెద్ద నార్సింగి సోలార్ రూఫ్ సైక్లింగ్ ట్రాక్.. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద సౌర విద్యుత్ పైకప్పు సైక్లింగ్ ట్రాక్ 23 కిలో మీటర్ల పొడవు ఉంటుంది. ఈ ట్రాక్ పక్కనే స్మార్ట్ బైక్ స్టేషన్.. 24/7 అందుబాటులో ఉంటుంది. సైక్లింగ్ చేసే వాళ్లు తమ ఫోన్లలో ఉన్న స్మార్ట్ బైక్ యాప్లో సాధారణ పెడల్ సైకిళ్లు, ఎలక్ట్రిక్ సైకిల్, ఎలక్ట్రిక్ ఈ-బైక్లను బుక్ చేసుకోగానే బైక్ స్టేషన్లో సైకిల్ స్మార్ట్ బైక్ తాళాలు ఆటోమెటిక్గా తెరుచుకుంటాయి. ఐటీ ఉద్యోగులు రాత్రివేళ సైకిళ్లతో నార్సింగ్ రూఫ్ సైక్లింగ్ ట్రాక్పై గ్రూప్ రైడింగ్ చేస్తూ కనిపిస్తారు. పెడల్ సైకిల్కు గంటకు రూ.80, ఈ-బైక్కు రూ.100, అరగంటకు 59 రూపాయలు చార్జీలు ఉన్నాయి. "ఐటీ ఉద్యోగులు డే, నైట్ ఏ షిఫ్ట్లో పనిచేసిన వాళ్లైనా.. ఆఫీస్ అయిపోయాక ఇంటికి వెళ్లే ముందు కాసేపు గ్రూప్ సైక్లింగ్ చేయడం వాళ్లకు అలవాటైపోయింద"ని స్మార్ట్ బైక్ స్టేషన్ జీఎం మామిడి శ్రవణ్ కుమార్ చెప్పారు. "కంప్యూటర్ల ముందు గంటల తరబడి పనిచేసిన వాళ్లు శారీరక, మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవడానికి సైక్లింగ్ బెస్ట్ రిలాక్సేషన్గా ఫీలవుతున్నారు. సైక్లింగ్ చేయడం వల్ల వ్యాయామంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుంద"ని సీనియర్ టెక్కీ బొజెండ్ల నరేష్ బాబు చెప్పారు.

**విస్తరిస్తున్న సైక్లింగ్ సవారీ**

సిటీలో వేగంగా విస్తరిస్తున్న సైక్లింగ్ కమ్యూనిటీతో వివిధ క్లబ్లలో సభ్యుల సంఖ్య పదివేల మందికి పైగా పెరిగిందని హైదరాబాద్ బైసైకిల్ మేయర్ సంతాన సెల్వన్ చెప్పారు. హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్, బైక్ హాలిక్స్, హైదరాబాద్ సైక్లింగ్ రెవెల్యూషన్, హైదరాబాద్ రైడర్స్ క్రూ, హ్యాపీ హైదరాబాద్, సికింద్రాబాద్ సైక్లిస్ట్ గ్రూపులే కాకుండా నార్త్ స్పిన్నర్స్, సౌత్ స్పిన్నర్స్, ఈస్ట్ స్పిన్నర్స్, వెస్ట్ స్పిన్నర్స్ అపార్ట్మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, వివిధ ఐటీ కంపెనీల ఉద్యోగులు పలు సైక్లింగ్ అసోసియేషన్లను ఏర్పాటుచేసుకుని రైడింగ్లు చేస్తున్నారు. ఈ గ్రూపులతో సైక్లిస్ట్ల మధ్య స్నేహ సంబంధాలు పెరుగుతున్నాయని బైక్ హాలిక్స్ ప్రతినిధి రవి సాంబారి చెప్పారు.

నార్సింగి, అప్పాజంక్షన్, నానక్ రాంగూడ, కొల్లూరు, గచ్చిబౌలి, నెక్లెస్ రోడ్డు, నగర శివారు ప్రాంతాల్లో సైక్లిస్ట్లతో పిక్నిక్ పాయింట్లుగా మారాయి. బర్త్ డేలు, మ్యారేజ్ డేలు, ఇతర ఫెస్టివల్స్ను సైక్లిస్ట్లు సోలార్ సైక్లింగ్ ట్రాక్ దగ్గరే జరుపుకుంటున్నారు. పాలపిట్ట సైకిల్ పార్క్, గచ్చిబౌలి బయోడైవర్సిటీ పార్క్ల్లో హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్ సైకిల్ రైడ్స్ నిర్వహిస్తోంది. భవిష్యత్లో నెహ్రూ జూపార్క్లోనూ సైక్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు బైసైక్లింగ్ క్లబ్ నిర్వాహకులు చెప్పారు. మరికొన్ని ప్రధాన మార్గాల్లో సైకిల్ ట్రాక్లను నిర్మాణానికి హైదరాబాద్ యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్ పోర్ట్ అథారిటీ ప్లాన్ డిజైన్ చేసిందని సైక్లింగ్ యాక్టివిస్ట్లు రవి సాంబారి, ప్రియా లంగోటే చెప్పారు.

**జిల్లాల్లో కూడా..**

సైక్లింగ్ యాక్టివిటీస్ వరంగల్, కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్నగర్, సిద్దిపేట జిల్లాలకు విస్తరించాయి. హైదరాబాద్ సైక్లిస్ట్స్ గ్రూప్ సిటీలోని అతిపెద్ద స్వచ్ఛంద సైక్లింగ్ సంఘాల్లో ఒకటి. దీన్ని 2017లో రవీందర్ నందనూరి స్థాపించారు. లక్షమంది సైక్లిస్టులను తయారుచేయడం ద్వారా హైదరాబాద్ను సైక్లింగ్ రాజధానిగా మార్చడం లక్ష్యంగా హెచ్సీజీ ప్రోగ్రామ్స్ చేస్తోంది. ఈ గ్రూపు సైక్లిస్ట్ల కోసం రోజువారీ, వారాంతపు, ఎండ్యూరెన్స్ రైడ్లు, శిక్షణా తరగతులు, సైక్లింగ్ చాలెంజ్లు, సోషల్ రైడ్లను నిర్వహిస్తున్నారు. ఈ గ్రూపు స్కూల్ పిల్లల కోసం షూ డొనేషన్, రోడ్డు భద్రతపై అవేర్నెస్, ఎకోఫ్రెండ్లీ ట్రాన్స్పోర్ట్ను ప్రోత్సహించే ప్రోగ్రామ్లు చేస్తోంది. అంతేకాదు.. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా 3,780 కిలో మీటర్ల దూరం కే2కే- 2017, కే2కే సెకండ్ ఎడిషన్ - 2021, కే2కే - 2023 హ్యాట్రిక్ ఎడిషన్లను హైదరాబాద్ సైక్లిస్ట్స్ గ్రూప్ చేపట్టింది. ఈ గ్రూప్ 2020లో మనదేశంలో మొట్టమొదటి సైక్లింగ్ లీగ్ను స్టార్ట్ చేసింది. హాఫ్ ఎవరెస్టింగ్, యాన్యువల్ ఎలివేషన్ చాలెంజ్లు వంటి ఎండ్యూరెన్స్ ఈవెంట్లను నిర్వహించింది. గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో పేద విద్యార్థులకు సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ ఫౌండర్ రవీందర్ నందనూరి చెప్పారు. పాఠశాల పేద విద్యార్థులకు వెయ్యి సైకిళ్లను అందించాలనే మిషన్ను తమ గ్రూప్ చేపట్టిందని ఆయన తెలిపారు.

**సైక్లింగ్ ద్వారా ఫిట్నెస్**

హైదరాబాద్కు చెందిన ఈ 2 ట్రైల్స్ కమ్యూనిటీ, ఫిట్నెస్, సామాజిక అనుబంధాన్ని మేళవిస్తూ కొత్తగా సైక్లింగ్ కార్యకలాపాలను ప్రోత్సహిస్తోంది. కొత్తగా సైక్లింగ్ ప్రారంభించేవారికోసం గైడెడ్ సైక్లింగ్ రైడ్లను నిర్వహిస్తోంది. హైదరాబాద్ సరస్సులు, వారసత్వ ప్రదేశాలు, పార్క్లు, అంతగా తెలియని మార్గాలను అన్వేషిస్తున్నప్పుడు, అపరిచితులు తరచుగా స్నేహితులుగా మారిపోతారని ఈ 2 ట్రైల్స్ వ్యవస్థాపకులు సంకురాత్రి అశోక్ చెప్పారు. ప్రతి రైడ్కు అనుభవజ్ఞులైన రైడ్ లీడర్లు నాయకత్వం వహిస్తారు. ఈ 2 ట్రైల్స్ హోలీ, ఉమెన్స్ డే స్పెషల్, ఇండిపెండెన్స్ డే, రిపబ్లిక్ డే, రమజాన్ రైడ్, శివరాత్రి సైకిల్ రైడ్స్ నిర్వహిస్తోంది.



### పర్యావరణం పరిరక్షణ..

**పర్యావరణం పరిరక్షణే పరమావధిగా తాము సైక్లింగ్ ఈవెంట్లు నిర్వహిస్తున్నామని హైదరాబాద్ సైక్లింగ్ రెవెల్యూషన్ కో ఫౌండర్, ఫిట్ ఇండియా తెలంగాణ బైసైకిల్ అంబాసిడర్ రవినేత చెప్పారు. తాను లండన్, దుబాయ్ దేశాల్లో సివిల్ ఇంజినీర్గా పనిచేస్తున్నపుడు ప్రారంభించిన సైక్లింగ్ హైదరాబాద్ వచ్చాక కొనసాగిస్తున్నానని తెలిపారు. జాతీయ పతాకాలు సైకిల్పై పెట్టుకుని చాలా సైకిల్ రైడ్స్ నిర్వహించారు.**

### వీకెండ్స్ లో సైక్లింగ్ స్పెషల్ రైడ్స్

**సైక్లింగ్ క్లబ్లు 20 నుంచి100 కిలోమీటర్ల వరకు రైడ్లు నిర్వహిస్తున్నాయి. మహిళల కోసం ప్రత్యేక రైడ్స్, కుటుంబాలతో కలిసి నిర్వహించే ఈవెంట్లు కూడా మంచి ఆదరణ పొందుతున్నాయి. సోషల్ మీడియాలో సైక్లింగ్ గ్రూపుల ప్రచారం కొత్తవారిని ఆకర్షిస్తోంది. ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, సీనియర్ సిటిజన్లు ఇలా ఒకరేమిటి పెద్ద సంఖ్యలో సైక్లింగ్ కమ్యూనిటీల్లో చేరి ప్రతివారం సందడి చేస్తున్నారు. గోల్కొండ, శంకరపల్లి, కొల్లూరు, నల్లగండ్ల, చార్మినార్, కేబీఆర్ పార్కు, లోటస్ పాండ్, ముచ్చింతల్ స్టాట్యూ, శివంపేట, దుర్గం చెరువు, కేబుల్ బ్రిడ్జి ప్రాంతాలకు వీకెండ్స్ సైకిల్ రైడ్స్ చేస్తున్నారని బైక్ హాలిక్స్ ప్రతినిధి మనోజ్ కుమార్ చెప్పారు. సైక్లింగ్ క్లబ్లు కేవలం వ్యాయామానికి మాత్రమే కాకుండా కొత్త స్నేహాలు, నెట్వర్కింగ్కు కూడా వేదికగా మారాయి. ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా సిటీలో జరిగిన అవగాహన కార్యక్రమాల తర్వాత యూత్లో సైక్లింగ్పై ఆసక్తి మరింత పెరిగిందని క్లబ్ నిర్వాహకులు చెప్తున్నారు.**



### రామమందిరం..
# స్పిరిచ్యువల్ స్మగ్లింగ్

**1990లో మండల్ రిజర్వేషన్ల ఉద్యమానికి వ్యతిరేకంగా రామమందిర నిర్మాణ ఉద్యమాన్ని ఆర్ఎస్ఎస్, వీహెచ్పీ, బీజేపీలు పెద్ద ఎత్తున మొదలుపెట్టాయి. ఆనాడు వీపీ సింగ్ ప్రభుత్వాన్ని కూలగొట్టింది కూడా ఈ అంశాన్ని ముందుపెట్టే. ఆనాడు రాజీవ్ గాంధీ కాంగ్రెస్ కూడా ఓబీసీ రిజర్వేషన్ల అనుకూల పార్టీ కాదు. అది ఈ ఉద్యమానికి పరోక్షంగా సహకరించింది. ఆ తరువాత మత కల్లోలాలు, కోర్టు కేసులు, ప్రభుత్వాలు మారుడు. ఇవన్నీ జరిగి చివరికి ఆ టెంపుల్ అంశంపైనే 1999లో బీజేపీ మొదటిసారి అధికారంలోకి వచ్చింది. ఈ మార్పు రావడానికి ఆర్ఎస్ఎస్, బీజేపీలు.. ముస్లిం సమస్యను ఈ దేశంలో 800 సంవత్సరాల ముస్లిం పాలకుల దోపిడీనే అని హిందూ మతానికున్న ప్రమాదాన్ని బాగా ప్రచారం చేశారు. శూద్రులు, దళితులు, ఆదివాసులు దాన్ని నమ్మారు. శ్రీరాముడు అందరి రక్షకుడని చెప్పారు. కానీ రామమందిరం నిర్మాణమైన 4 సంవత్సరాలలో రాముని ధనమే స్మగుల్ చేశారు. ఇక ప్రజలొక లెక్కా!**



- ప్రొ. కంచ ఐలయ్య షఫర్డ్

రామటెంపుల్ ట్రస్ట్ నిర్మాణం దేశ ప్రధాన మంత్రి పార్లమెంటులో ప్రకటించి చేశారు. దానికి 'తన వ్యక్తి' అనే చంపత్రాయ్ని జనరల్ సెక్రటరీని చేశాడు. దాన్ని పార్లమెంటు ఆమోదించింది అనిపించారు. ఆ ట్రస్ట్ వేలకోట్లు మాయం చేసింది అని బయటపడగానే ఇది ప్రైవేటు ట్రస్ట్ అని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ప్రధానమంత్రి, హోం మంత్రి, ఫైనాన్స్ మంత్రి మాకేం సంబంధంలేదంటూ మాట్లాడటం లేదు. మరి ప్రధానమంత్రి పార్లమెంటులో ట్రస్ట్ నిర్మాణం ఎందుకు పెట్టినట్టు? అది ప్రైవేటు ఎలా అవుతుంది? అది కేంద్ర ప్రభుత్వ ట్రస్ట్. కానీ ఇప్పుడు అది ప్రైవేటు ట్రస్ట్ అని తన బాధ్యతను తప్పించుకొంటున్నారు. పోనీ దాన్ని కాలక్రమేణా యూపీ ప్రభుత్వం ఎండోమెంటుకు కూడా ట్రన్స్ఫర్ చేయలేదు. యూపీ సీఎం ఆ రాష్ట్రంలో ఇంత ఘోరం జరుగుతుంటే, శ్రీరాముని డబ్బు రాష్ట్రంలో దోపిడీ జరుగుతుంటే తనకేమీపట్టనట్టు నాలుగేండ్లు గడిపాడు. ఇప్పుడు ఆయన పోలీసు సిట్ వేసి ఇన్వెస్టిగేట్ చేస్తే ఎలా నమ్ముతారు? ఇది మామూలు దొంగతనం కాదు కదా! రాముడి సొమ్ము స్మగ్లింగ్. దాని బాధ్యత మొత్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్లది. యావత్తు దేశం వాళ్లు వంద ఏండ్లుగా ప్రచారం చేసుకుని బతుకుదెరువు సాగించిన రాముని పేరుతో జమ అయిన కోట్లకొద్దీ ధనాన్ని ప్రజలకు ఉపయోగించకుండా దోచుకుపోతున్న స్థితిలో కూడా రాజీనామా చేయకుండా ఉన్నప్పుడు ఎలా సహిస్తుంది. మొత్తం దేశం ఆ ముగ్గురిని దిగిపొమ్మని ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉంది.

**ఈ అంశంలో ప్రతిపక్షాల ఐక్య పోరాటమేదీ?**

ఇండియా అలయన్స్, ఇతర పార్టీలు, సంఘాలు ఈపాటికే ఐక్యంగా మోదీ, అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్ల రాజీనామా కోసం, మోహన్ భగవత్ దేశానికి క్షమాపణ చెప్పి ఆ పదవి నుంచి దిగిపోవాలనే నినాదాలతో శాంతియుతంగా పోరాటం మొదలెట్టి ఉండాల్సింది. కానీ ఆ చైతన్యమే కనపడుట లేదు. శ్రీరామ టెంపుల్లో జరిగిన దోపిడీ మామూలు కరప్షన్ కాదు. అది ఈ మధ్యనే మొదలైంది కాదు. దేశం తాము సిట్ను నమ్మడంలేదని చెబుతున్నప్పటికీ అదే సిట్ 70సార్లు టెంపుల్ నుంచి డబ్బు, ఇతర విలువైన ఆభరణాలు దొంగిలించబడ్డాయని చెబుతున్నది. కాంగ్రెస్ (యూపీఏ) అధికారంలో ఉన్నప్పుడు ఆసియా గేమ్స్ సందర్భంగా జరిగిందని చెప్పిన కరప్షన్ మీద ఆర్ఎస్ఎస్, బీజేపీలే వెనుక ఉండి అన్నాహజారే, కేజ్రీవాల్లను రంగంలోకి తెచ్చి ఆ ప్రభుత్వాన్ని గందరగోళంలోకి నెట్టలేదా!. మరిప్పుడు ప్రతిపక్షాలు, కమ్యూనిస్టులతో సహా ఎందుకు సైలెంటుగా ఉంటున్నాయి?

**స్పిరిచ్యువల్ స్మగ్లింగ్ అంటే ఏమిటి?**

నేను గతంలో సోషల్ స్మగ్లింగ్ గురించి ఇంగ్లిష్, తెలుగులో చాలా రాశాను. దానిమీద చాలా చర్చ జరిగింది. ఇప్పుడు శ్రీరామ టెంపుల్లో జరిగినదాన్ని స్పిరిచ్యువల్ స్మగ్లింగ్ అని ఎందుకు అంటున్నాను? స్పిరిచ్యువాలిటీ మానవ నమ్మకానికి సంబంధించిన సమస్య. ఉదాహరణకు దేవునిపై బలంగా నమ్మే వ్యక్తులు ఆ నమ్మకంతో తమకున్న వనరులలో ఆ దేవుని పేరుతో దాన్ని నడిపే మనుషులకే ఇస్తారు. అది గుడికావొచ్చు. చర్చి కావొచ్చు. మసీద్ కావొచ్చు. ఆ సొమ్మును దేవుడు స్వయంగా తీసుకోడు. దేవుని పేరుతో ఉన్న స్థలాన్ని మేనేజ్ చేస్తున్న మనుషులు ఆ సొమ్మును తీసుకుంటారు. ఏ స్థితిలోనూ దేవుడు ఆ సొమ్మును తినడు. నగలిస్తే తాను వేసుకొని తిరగడు. ఆ సంస్థను నడిపే మనుషులు ఆ సొమ్మును తిరిగి ప్రజల అవసరాలకు వాడకుండా తమ సొంతం కోసం వాడుకుంటే ఆ సొమ్ము తిరిగి ప్రజల్లోకి రాదు. ఒక దేశం బార్డర్లు దాటిపోయిన సొమ్ము ఎలాగైతే తిరిగి మళ్లీ ఆ దేశానికి రాదో, ఆ సంస్థను నడిపే వ్యక్తులు భక్తులు నమ్మకంతో ఇచ్చే సొమ్మును తమ సొంతానికి వాడుకుంటే అది స్మగ్లింగే. స్మగ్లింగ్లో ముఖ్యంగా పెద్ద మొత్తాలు ఇన్వాల్వ్ అయి ఉంటాయి. చిన్న మొత్తాలు బతుకు గడపడానికి వాడుకుంటే వదిలేయవచ్చు. కానీ, వందలకోట్లు, కిలోల బంగారం, టన్నుల వెండి ఏండ్లు ఏండ్లు దోచుకుంటే దాన్ని కచ్చితంగా స్మగ్లింగ్ అనే అనాలి. ఇందులో ఒకరిద్దరు కాదు. ఒక పెద్ద వ్యవస్థ ఇన్వాల్వ్ అయిందని సిట్టే చెబుతున్నది. నమ్మకంతో అన్ని వర్గాలు, కులాలు, భక్తులు ఇచ్చిన సొమ్మంతా ఇలా స్మగ్లింగ్ చేయబడితే ట్రస్ట్ను ఏర్పరిచిన కేంద్ర ప్రభుత్వం అది ప్రయివేటు సంస్థ పని అంటే దేశం ఎలా నడుస్తుంది? ఇక్కడే అసలు ప్రమాదం ఉంది.



### మతం రాజ్యాన్ని నడిపిస్తే..

మతం రాజ్యాన్ని నడిపిస్తే మునుముందు ఈ దేశం చాలా పెద్ద తీవ్రమైన పరిణామాలను ఎదుర్కొంటుంది. మతశక్తులు రాజ్య వ్యవహార సంస్థల్ని తమ అధీనంలో ఉండాలని తీవ్రంగా పనిచేస్తాయి. అది రాజ్య సంస్థలను తమ అధీనంలోకి తెచ్చుకుంటాయి. భక్తితో నిరంతర మానవ ప్రవర్తనను అదుపులో పెట్టడం సాధ్యంకాదు. అందుకే రాజ్యాంగం ద్వారా ఏర్పరిచిన చట్టపర సంస్థలు మతాలకతీతంగా వ్యక్తుల ప్రవర్తనను నిరంతరం ప్రయత్నించాలి. మతపర సంస్థలు మేం చట్టానికి లోబడి కాదు మత నియమాలకు లోబడి పనిచేస్తామంటే రాజ్యవ్యవస్థ ఆ ఉనికిని కొనసాగిస్తే మొత్తం రాజ్యాంగ వ్యవస్థకే ప్రమాదం ఏర్పడుతుంది. సెక్యులర్ రాజ్య పర్యవేక్షణ రాజ్యాంగబద్ధంగా లేకుంటే మతసంస్థలు ఎలా పనిచేస్తాయో అయోధ్య రామమందిర వ్యవహారం బయటపెట్టింది. అయితే బీజేపీ, ఆర్ఎస్ఎస్లు సెక్యులర్ రాజ్యవ్యవస్థ అవసరం లేదని ముస్లిం దేశాలలోని థియోక్రాటిక్ వ్యవస్థవలె ఈ దేశ రాజ్యవ్యవస్థను మార్చాలనే క్రమంలో ఉన్నాయనేది తెలిసిందే. ఆ సిద్ధాంతంతోనే ఆర్ఎస్ఎస్ గత 100 ఏండ్లుగా రిజిస్ట్రేషన్ లేకుండా పనిచేస్తోంది. తమ సంస్థ హిందూమతంలాంటిదే కనుక రిజిస్ట్రేషన్ తమకు అవసరంలేదు అంటుంది. ఈ విధంగా కొనసాగే సంస్థలు ముస్లిం దేశాల్లో చాలా ఉన్నాయి. అవి రాజ్యాంగ చట్టబద్ధతను ఉనికిలోకి రానివ్వడం లేదు. ఈ స్థితే ఇక్కడ రావొచ్చు. అయితే అటువంటి రాజ్యాంగేతర సంస్థలు ఎలా నడుస్తాయో రామ టెంపుల్ ట్రస్ట్ నిరూపించింది.

### రామ టెంపుల్.. వాటికన్కు, మక్కాకు దీటు అన్నారు

అటువంటప్పుడు దాన్ని ఎలా నడపాల్సి ఉండే. అది ప్రారంభమై నాలుగేండ్లు కాకముందే ఇంత స్మగ్లింగ్ ఎలా జరిగింది? ఈ ట్రస్ట్ దేశ ప్రధానమంత్రి పార్లమెంటులో ప్రకటించి ఏర్పరిచింది కదా! ఇంతకాలం మొత్తం ట్రస్ట్ ఏం చేస్తుంది. పరాసరన్ దాని అధ్యక్షుడు కదా. ఆయన ఎప్పుడూ టెంపుల్ ఆదాయాన్ని రివ్యూ చేయలేదా! ఇక్కడే ప్రజలకు అనుమానం ఉంది. వాటికన్లో కూడా కరప్షన్ జరిగింది. కానీ అది ఏర్పడ్డాక 1300 ఏండ్లకు స్వర్గానికి సర్టిఫికెట్ ఇస్తామని చెప్పి డబ్బు దండుకున్నారు. మతాతీత మూఢ నమ్మకాలను ప్రచారం చేసే డబ్బులు సంపాదించుకున్నారు. పోపులు, బిషప్లు, ఫాస్టర్లు స్త్రీలను చెరిచారు. కానీ అతికొద్ది రోజుల్లో పెద్ద తిరుగుబాటును ఎదుర్కొన్నారు. అక్కడే మార్టిన్ లూథర్ పుట్టాడు. నమ్మకాన్ని దోచుకుంటే దాన్ని మతం అనరు. అందుకని మొత్తం క్రిస్టియన్ మతాన్నే సంస్కరించే ఉద్యమం మొదలైంది. ప్రతి సంస్థ సంస్కరణకు గురైతే తప్పనేది చాలాకాలం బతకదు. మక్కాలో కూడా లంచగొండితనం వల్ల ఉద్యోగులు పట్టుబడ్డారు. కానీ ఆ లంచగొండితనం చిన్న చిన్న మొత్తాలను వ్యక్తిపరం చేసుకున్నది. అయితే ఇస్లామ్లో బాగా సంస్కరణలు వచ్చినా తిరుగుబాట్లు రాలేదు. అందుకే అది కదలికలేని నీళ్లలా ఉన్నది. కొత్తగా నిర్మించిన రామమందిరం ఆరంభం నుంచి దాని ట్రస్ట్ తీవ్రమైన ఆర్థిక దోపిడీకి అవకాశమిచ్చింది. అదీ కేంద్ర ప్రభుత్వం మొత్తంగా గుడిపనిలో ఉండి సుప్రీం కోర్టు డైరక్షన్లో ఒక ట్రస్ట్ఏర్పాటుచేసి దాన్ని ప్రైవేటు ట్రస్ట్ అని ఎందుకు ప్రకటించారు. ఆ ట్రస్ట్ ఇంత ఘోరంగా ఎందుకు పట్టుబడ్డది? దానికిముందు కేవలం చిన్న ఉద్యోగులను అరెస్టు చేయడం. పెద్ద బాధ్యులను పదవుల నుంచి తప్పించడం కాదు చేయాల్సింది. దీనికి కేంద్రం కూడా బాధ్యురాలు.




శనివారం 'ప్రపంచ జనాభా దినోత్సవం' సందర్భంగా పాట్నాలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళా కళాశాల విద్యార్థినులు.



అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగమే కాదు, భూమి కొనుగోలు సమయంలో కూడా చాలా అవకతవకలు జరిగాయని ప్రజలు అంటున్నారు. దీనిపై ప్రధాని మోదీ ప్రకటన చేయాలని మేం డిమాండ్ చేస్తున్నాం. అదేవిధంగా దర్యాప్తు సుప్రీంకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో జరగాలని డిమాండ్ చేస్తున్నాం.

- సచిన్ పైలట్, కాంగ్రెస్ లీడర్



పశ్చిమ బెంగాల్లో ఆక్రమణల తొలగింపు చర్యలకు సంబంధించి మేం హాకర్ల సంఘంతో సమావేశమయ్యాం. ఈ నెల 9న షోకాజ్ నోటీసులు జారీ చేసి 15 రోజుల సమయానికి హామీ ఇచ్చాం. కానీ, 10వ తేదీనే మా సిబ్బంది బుల్డోజర్తో చర్యలు చేపట్టారు. దీనికి మేం బాధ్యత వహిస్తాం. మా సిబ్బంది సరైన వివరణ ఇవ్వకపోతే సస్పెండ్ చేస్తాం.

- అగ్నిమిత్ర పాల్, పశ్చిమ బెంగాల్ మంత్రి



ఒకే దేశం ఒకే ఎన్నికపై జేపీసీ వివిధ వర్గాలతో గోవాలో కమిటీ సమావేశాలు నిర్వహించింది. వేర్వేరు ఎన్నికలు, ఏకకాల ఎన్నికల వల్ల కలిగే ఆర్థిక ప్రభావం గురించి అన్ని వర్గాల అభిప్రాయాలను వినడం, బిల్లును పరిశీలించడం, పార్లమెంటుకు సిఫార్సులు సమర్పించడం మా పాత్ర. బిల్లును ఆమోదించడం పార్లమెంటు ప్రత్యేక హక్కు.

- పీపీ చౌదరి, బీజేపీ ఎంపీ

**ఓపెన్ పేజీకి వ్యాసాలు, లెటర్లు పంపాల్సిన మెయిల్ ఐడీ**

**openpage@v6velugu.com**



రచయితలు 'వెలుగు' కు మాత్రమే పంపుతున్నామని హామీ తప్పనిసరి రాయాలి.
స్వీయ రచన అయి ఉండాలి.
రచన 700 పదాలకు మించరాదు.

---

**జీవిత బీమా కంపెనీలు ఏజెంట్లకు చెల్లించే కమీషన్లను మాత్రమే కాకుండా, వాటి ఇతర నిర్వహణ ఖర్చులను కూడా పరిశీలించేందుకు 'భారత బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్డీఏఐ)' ముందుకొచ్చింది. బీమా పంపిణీ వ్యవస్థలో సంస్కరణలు చేపట్టేముందు, కమీషన్లను మినహాయించి సంస్థల నిర్వహణ వ్యయాలపై పూర్తి వివరాలు ఇవ్వాలని ఐఆర్డీఏఐ తొలిసారిగా జీవిత బీమా సంస్థలను కోరింది. ఇప్పటివరకు ఐఆర్డీఏఐ ప్రధానంగా 'ఎక్స్పెన్సెస్ ఆఫ్ మేనేజ్మెంట్ (ఈఓఎం)' అనే సమగ్ర ఖర్చు పరిమితిని మాత్రమే పర్యవేక్షించేది. ఇందులో ఏజెంట్ల కమీషన్లు, కార్యాలయ నిర్వహణ, సాంకేతిక వ్యయాలు, ఉద్యోగుల జీతభత్యాలు తదితర అన్ని ఖర్చులు కలిపి ఉండేవి. ఇప్పుడు వాటిని వేర్వేరుగా చూపించాలని కోరడం ద్వారా నియంత్రణ సంస్థ దృష్టి మరింత విస్తరించినట్లు భావిస్తున్నారు. ఐఆర్డీఏఐ ఈ నెలాఖరులో బీమా పంపిణీ వ్యవస్థపై చర్చా పత్రాన్ని విడుదల చేయనుంది. ఈ సంస్కరణల ప్రధాన ఉద్దేశం పాలసీదారుల ప్రయోజనాలను కాపాడటం, బీమా విక్రయాల్లో పారదర్శకత పెంచడం, అనవసర ఖర్చులను తగ్గించడం అని సమాచారం. కమీషన్ రేట్లను నేరుగా నిర్ణయించే అవకాశాలు తక్కువగా ఉన్నప్పటికీ, పంపిణీ వ్యవస్థ, పారితోషిక విధానం, వినియోగదారుల ఫలితాలపై విస్తృత మార్గదర్శకాలు ఉండే అవకాశం ఉందని రంగ నిపుణులు చెబుతున్నారు.**

### బీమా కంపెనీలపై
# ఐఆర్డీఏఐ దృష్టి

బీమా రంగంలో గత ఏడాదిగా ప్రధాన చర్చ కమీషన్ వ్యయాలపైనే సాగుతోంది. అయితే కమీషన్లు తగ్గించినంత మాత్రాన పాలసీల ధరలు తగ్గవని ఐఆర్డీఏఐ భావిస్తోంది. సంస్థల ఇతర నిర్వహణ ఖర్చులు అధికంగానే కొనసాగితే వినియోగదారుడికి ప్రయోజనం చేరదని నియంత్రణ సంస్థ అభిప్రాయం. రంగంలోని ఒక సీనియర్ అధికారి మాట్లాడుతూ 'ఉత్పత్తులు నిజంగా చౌక కావాలంటే కమీషన్లతోపాటు కార్యాలయ నిర్వహణ, సాంకేతిక మౌలిక వసతులు, ఉద్యోగ వ్యయాలు, పరిపాలనా ఖర్చులన్నింటినీ సమీక్షించాల్సిందే' అని పేర్కొన్నారు. సంప్రదాయంగా బీమాసంస్థల సేకరణ, నిర్వహణ ఖర్చుల్లో సుమారు 55-60 శాతం వరకు కమీషన్లే ఉంటాయి. మిగిలిన భాగం ఉద్యోగుల వ్యయం, టెక్నాలజీ పెట్టుబడులు, శాఖల నిర్వహణ, అండర్ రైటింగ్, సర్వీసింగ్ వంటి అంశాలకు వెళ్తుంది. అందువల్ల మొత్తం వ్యయ నిర్మాణాన్ని అర్థం చేసుకోవాలంటే కమీషన్లకు మించి చూడాల్సిన అవసరం ఉందని ఐఆర్డీఏఐ భావిస్తోంది.




**ఆర్బీఐ నివేదిక కూడా కారణం**

రిజర్వు బ్యాంక్ విడుదల చేసిన 2026 ఆర్థిక స్థిరత్వ నివేదికలో ప్రభుత్వ, ప్రైవేట్ జీవిత బీమా సంస్థల ఖర్చు నిర్మాణాల్లో పెరుగుతున్న వ్యత్యాసాలను ప్రస్తావించింది. ప్రైవేట్ జీవిత బీమా సంస్థల కమీషన్ వ్యయ నిష్పత్తి 2021-22లో సుమారు 4.5 శాతం ఉండగా 2025-26 నాటికి 9 శాతానికి పైగా పెరిగినట్లు నివేదిక పేర్కొంది. అదేకాలంలో ప్రభుత్వరంగ సంస్థల్లో పెరుగుదల పరిమితంగానే ఉన్నట్లు తెలిపింది.

**వినియోగదారుడికే లాభమా?**

ఐఆర్డీఏఐ చేపడుతున్న ఈ విధానం బీమా రంగంలో ఖర్చులపై మరింత పారదర్శకత తీసుకురావచ్చని నిపుణులు భావిస్తున్నారు. సంస్థలు వాస్తవ నిర్వహణ ఖర్చులను వెల్లడించాల్సి రావడంవల్ల అనవసర వ్యయాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. దీర్ఘకాలంలో ఇది పాలసీల ధరలు, సేవల నాణ్యత, వినియోగదారుల విశ్వాసంపై సానుకూల ప్రభావం చూపుతుందని అంచనా వేస్తున్నారు. బీమా విక్రయాల్లో తప్పుడు హామీలు, అధిక ముందస్తు కమీషన్లు, పాలసీ రద్దులు వంటి సమస్యలను తగ్గించేందుకు కూడా ఐఆర్డీఏఐ దశలవారీగా సంస్కరణలు తీసుకురానున్నట్లు సమాచారం. కమీషన్ వ్యవస్థలో మార్పులతోపాటు మొత్తం వ్యయ నిర్మాణాన్ని సమీక్షించడం ద్వారా బీమా రంగాన్ని మరింత సమర్థవంతంగా మార్చాలన్నదే నియంత్రణ సంస్థ లక్ష్యంగా కనిపిస్తోంది.



- శ్రీశైలం దూడం

---

### పాస్ శాతంలో శిఖరం..
# ప్రపంచస్థాయిలో పతనం

**ఒక డ్రైవరు లైసెన్స్ పరీక్షలో 100కి 100 మార్కులు సాధించాడు. కానీ రోడ్డుపైకి వచ్చాక కారు కూడా సరిగ్గా నడపలేకపోయాడు. ఇప్పుడు సమస్య డ్రైవరులో ఉందా? లేక కేవలం కాగితాల మీద మార్కులను మాత్రమే చూసే పరీక్షా విధానంలో ఉందా? ఈ ప్రశ్నలను ఇప్పుడు మన విద్యావ్యవస్థకు కూడా వర్తింపజేయాల్సిన సమయం వచ్చింది. ఈ ఏడాది తెలంగాణ పదోతరగతి ఫలితాలు దేశదృష్టిని ఆకర్షించాయి. మొత్తం 5,16,815 మంది విద్యార్థులలో కేవలం 4,844 మంది మాత్రమే ఫెయిల్ అయ్యారు. ఫలితంగా 99.07 శాతం ఉత్తీర్ణతతో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానం సాధించింది. ఇది నిస్సందేహంగా అభినందించదగ్గ విషయమే. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల శ్రమ, ప్రభుత్వ చర్యలను ప్రశంసించాల్సిందే. అయితే ఈ విజయం విద్యార్థులు నేర్చుకునే సామర్థ్యం, నాణ్యతకు కూడా ప్రతిబింబమా? అనే పశ్నకు సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే పరీక్షల్లో వచ్చిన మార్కులు, విద్యార్థుల వాస్తవ సామర్థ్యాన్ని ఎల్లప్పుడూ ప్రతిబింబించవని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి.**




ప్రతి సంవత్సరం ప్రథమ్ ఫౌండేషన్ నిర్వహించే యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ (ఏఎస్ఈఆర్) దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల ప్రాథమిక అభ్యాస సామర్థ్యాలను అంచనా వేస్తోంది. తెలంగాణకు సంబంధించిన తాజా నివేదికలో 6 నుంచి 8వ తరగతి విద్యార్థుల్లో 54 శాతం మంది రెండోతరగతి స్థాయి పాఠ్యాంశాన్ని కూడా సరిగా చదవలేకపోతున్నారు. అలాగే 65 శాతం మంది సాధారణ కూడికలు, తీసివేతలు చేయలేకపోతున్నారు. ఒకవైపు దాదాపు అందరూ పదో తరగతి ఉత్తీర్ణులు అవుతుంటే, మరోవైపు ప్రాథమిక నైపుణ్యాల్లో ఇంత వెనుకబాటు కనిపించడం ఆలోచించాల్సిన విషయమే. ఈ పరిస్థితిని ప్రపంచ విద్యా ప్రమాణాల కోణంలో చూస్తే మరింత స్పష్టత వస్తుంది. ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులో గణితం, సైన్స్, సమస్య పరిష్కార నైపుణ్యాలను అంచనా వేసే రెండు ప్రపంచస్థాయిలో నిర్వహించే ప్రతిష్టాత్మక పరీక్షలు పీఐఎస్ఏ, టీఐఎంఎస్ఎస్. ఈ పరీక్షల్లో పాఠ్యపుస్తకాన్ని ఎంత బట్టీపట్టారనేది కాదు, నేర్చుకున్న జ్ఞానాన్ని నిజ జీవితంలో ఎలా ఉపయోగిస్తున్నారనేదే ప్రధాన ప్రమాణం.

**గణితం, సైన్స్ నైపుణ్యాలు అంచనా వేయాలి**

భారతదేశం 2009లో తొలిసారిగా పీఐఎస్ఏ పరీక్షలో పాల్గొంది. అయితే కేవలం హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల విద్యార్థులే పాల్గొన్నారు. ఫలితం మాత్రం దేశాన్ని తీవ్రంగా నిరాశపరిచింది. 73 దేశాలు పాల్గొంటే భారత్ 72వ స్థానంలో నిలిచింది. ఆ ఒక్క ఫలితం ప్రపంచ విద్యా ప్రమాణాలలో భారత్ ఎంత వెనుకబడి ఉందో స్పష్టం చేసింది. మరింత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే 2009లో తొలిసారి పాల్గొన్న భారత్, అదే చివరిసారి అవుతుందని బహుశా ఎవరూ ఊహించి ఉండరు. ఇక టీఐఎంఎస్ఎస్ పరీక్షలో కూడా భారత్ చాలాకాలంగా పాల్గొనడం లేదు. ఫలితంగా ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే మన విద్యార్థుల గణితం, సైన్స్ నైపుణ్యాలు ఏ స్థాయిలో ఉన్నాయో నిరంతరంగా అంచనా వేసుకునే అవకాశాన్ని కోల్పోతున్నాం. ప్రపంచ దేశాలు ఈ పరీక్షల ఫలితాలను ఆధారంగా చేసుకుని తమ విద్యా విధానాల్లో మార్పులు చేసుకుంటుంటే, మనం మాత్రం ఇంకా బోర్డు పరీక్షలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాం. పాస్ శాతం పెరగడం తప్పు కాదు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణుడు కావాలని కోరుకోవడం కూడా తప్పుకాదు. కానీ ఉత్తీర్ణత శాతం పెరగడం, అభ్యాస నాణ్యత పెరగడం రెండూ ఒకటేకాదని గుర్తించాల్సిన సమయం వచ్చింది.

**విద్యార్థులు జీవితాన్ని ఎదుర్కొనే నైపుణ్యాన్ని అందించాలి**

ఒక విద్యార్థి పదో తరగతి పూర్తిచేసిన తర్వాత సులభంగా చదవలేకపోతే, సాధారణ లెక్కలు చేయలేకపోతే, తనకు తెలిసిన విషయాన్ని కొత్త పరిస్థితుల్లో ఉపయోగించలేకపోతే, అతనికి వచ్చిన మార్కులు సమాజానికి ఎంతవరకు ఉపయోగపడతాయనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిందే. పీఐఎస్ఐ, టీఐఎంఎస్ఎస్ వంటి పరీక్షలకు ప్రత్యేక సిలబస్ ఉండదు. అక్కడ పరీక్షించేది విద్యార్థి ఎంత బట్టీపట్టాడోకాదు, ఎంత అర్థం చేసుకున్నాడు, ఆ జ్ఞానాన్ని నిజ జీవితంలో ఎలా ఉపయోగించగలడు అనేదే. అందుకే భారత్ ప్రపంచస్థాయిలో నిలవాలంటే పాఠ్యపుస్తకాలను మాత్రమే మార్చడం కాదు, బోధనా విధానం, ప్రశ్నాపత్రాల రూపకల్పన, మూల్యాంకన విధానాన్ని కూడా మార్చాల్సిన అవసరం ఉంది. విద్యార్థులు మార్కుల కోసం కాదు, ఆలోచించే సామర్థ్యం కోసం నేర్చుకునే విద్యా వ్యవస్థను నిర్మించినప్పుడే పీఐఎస్ఏ వంటి అంతర్జాతీయ పరీక్షల్లో భారత్ అగ్రస్థానంలో నిలవగలదు. విద్యార్థికి సర్టిఫికెట్ ఇవ్వడం విద్యా వ్యవస్థ బాధ్యతలో ఒక భాగం మాత్రమే. కానీ జీవితాన్ని ఎదుర్కొనే నైపుణ్యాన్ని ఇవ్వడమే అసలైన బాధ్యత. 99.07 శాతం ఉత్తీర్ణత ఒక విజయమే. అయితే అంతశాతం మంది విద్యార్థులు ప్రపంచ ప్రమాణాలైన పీఐఎస్ఏ, టీఐఎంఎస్ఎస్ వంటి పరీక్షల్లోనూ అదేస్థాయి ప్రతిభ కనబరిచినరోజే, మన విద్యావ్యవస్థ నిజంగా ప్రపంచ స్థాయికి చేరుకుందని గర్వంగా చెప్పగలం. పాస్ శాతాలను కాదు, అభ్యాస నాణ్యతను పెంచేదిశగా అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైంది.

- రక్షిత్ వర్మ

# వన్ విష్ విల్లో.. అసలు కథ ఇదే!

"ఒక్క కోరిక కోరే అవకాశం వస్తే మీరు ఏం కోరుకుంటారు?" ఈ ప్రశ్న ఎవరినడిగినా వెంటనే ఓ సమాధానం చెప్తారు. అయితే అదే కోరిక మీ జీవితాన్నే తలకిందులు చేస్తే? ఇదే కాన్సెప్ట్‌తో రూపొందిన హారర్ మూవీ 'అబ్సెషన్'లో కనిపించే 'వన్ విష్ విల్లో' ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.







వన్ విష్ విల్లో అనేది సినిమాలో కనిపించే విల్లో చెక్కతో చేసిన చిన్న వస్తువు. దాన్ని విరిచి ఒక కోరిక కోరితే అది నెరవేరుతుందని కథ చెప్తుంది. అయితే జీవితంలో ఒక్కసారి మాత్రమే దీన్ని ఉపయోగించొచ్చు. కానీ ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. కోరిక నెరవేరినా, అది మనం అనుకున్నట్లు కాకుండా అనుకోని పరిణామాలకు దారితీస్తుంది. ఈ ఆలోచనకు 1902లో డబ్ల్యూ. డబ్ల్యూ. జాకబ్స్ రాసిన ప్రసిద్ధ కథ 'ది మంకీస్ పా' ప్రేరణ అని దర్శకుడు కరీ బార్కర్ చెప్పారు. ఈ సినిమాలో బేర్ అనే యువకుడు, నిక్కీ తనను అందరికంటే ఎక్కువగా ప్రేమించాలని కోరుకుంటాడు. వన్ విష్ విల్లోను ఉపయోగించిన తర్వాత అతని కోరిక నెరవేరుతుంది. కానీ ఆ ప్రేమ క్రమంగా ప్రమాదకరమైన వ్యామోహంగా మారి, వారి జీవితాలను భయానకంగా మార్చేస్తుంది.

నిజానికి వన్ విష్ విల్లో అనేది నిజమైన శాపగ్రస్త వస్తువు కాదు. సినిమా కోసం ప్రత్యేకంగా రూపొందించిన కల్పిత వస్తువు మాత్రమే. అయితే ప్రేక్షకులు నిజమని నమ్మేలా దీనిని సాధారణ గిఫ్ట్‌లా డిజైన్ చేశారు. అంతేకాదు, ప్రత్యేక వెబ్‌సైట్, పాతకాలపు ప్యాకేజింగ్, ఉత్పత్తి వివరాలతో నిజంగా అమ్ముతున్న వస్తువులా ప్రచారం చేశారు. ఈ వినూత్న మార్కెటింగ్ వల్ల చాలామంది ఇది నిజంగానే ఉందని భావించారు.

అభిమానుల కోసం ఫోకస్ ఫీచర్స్ అధికారిక వెబ్‌సైట్‌లో దీని కలెక్టిబుల్ రెప్లికాలను 6.99 నుంచి 14.99 అమెరికన్ డాలర్ల (సుమారు రూ. 600 - రూ.1,300) ధరకు అమ్మారు. కొద్దిరోజుల్లోనే ఇవన్నీ అమ్ముడుపోయాయి. ప్రస్తుతం అఫీషియల్ స్టాక్ లేకపోయినా ఈబే వంటి రీసేల్ వెబ్‌సైట్లలో ఇవి ఎక్కువ ధరలకు లభిస్తున్నాయి. మొత్తానికి కథ, డిజైన్, తెలివైన మార్కెటింగ్ కలిసి ఒక కల్పిత వస్తువును ప్రపంచవ్యాప్తంగా వైరల్ చేశాయి. వన్ విష్ విల్లో ఇప్పుడు కేవలం సినిమా ప్రాపర్టీ మాత్రమే కాదు.. హారర్ అభిమానుల మధ్య హాట్ టాపిక్‌గా మారింది.

# గురువుస్థానంలో ఉండేవారు జాగ్రత్త వహించాలి

విశ్వాసం


**యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః**
**స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే**

ఉత్తమ పురుషులు చేసే పనులనే సామాన్యులు ఆచరిస్తారు. వారినే ప్రమాణంగా గ్రహిస్తారని భగవద్గీత చెప్తోంది. సాక్షాత్తు శ్రీకృష్ణుడు.. 'ముల్లోకాలలో నేను చేయవలసిందేమీ లేదు, సాధించదగినదీ, సాధించవలసినదీ లేదు. అయినా నేను కర్మను విడిచి పెట్టను. ఒకవేళ నేను కర్మను విడిచిపెట్టాననుకో, అసంఖ్యాక జనం నన్నే అనుసరించి సోమరులవుతారు. ఆ కారణంగా లోకనాశనం తప్పదు' అని స్వయంగా పలికాడు.

అజ్ఞానంతో ఉన్నవాడు తను చేసిన పనికి ప్రతిఫలాన్ని ఆశిస్తాడు. అదే జ్ఞాని అయినవాడు ప్రతిఫలం ఆశించకుండా లోక క్షేమం కోసం పని చేసి తీరతాడు. జనక మహారాజు వంటి రాజర్షులు వారు చేయవలసిన కర్మను అంటే పనులను నిరంతరం విడిచిపెట్టకుండా ఆచరించి, ఆత్మసిద్ధిని అందుకున్నారు. (ఉపశ్రీ భగవద్గీత నుంచి)

జనక మహారాజు రాజ్యంలో ఉండే సామాన్య ప్రజలు సైతం వారు చేయవలసిన ధర్మబద్ధమైన పనులకు దూరం కాకుండా, వాటి మీదే మనసు నిలిపి ఉంచటమే జనక మహారాజు లక్ష్యం. పరిపాలకులు సత్యమార్గంలో నడిస్తే, ప్రజలు కూడా సత్య మార్గంలోనే నడిచితీరతారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న నాయకులు - గురువులు - మార్గదర్శకులు.. ఆదర్శవంతమైన, బాధ్యతాయుతమైన ప్రవర్తనను కలిగి ఉండాలి.

మానవులు ప్రధానంగా అనుకరణ స్వభావులు. ఇతరులను చూసి అనుకరించడానికి ఎక్కువ ఆసక్తి చూపుతారు. ప్రజలంతా పరిపాలకులను, శిష్యులు గురువులను, పిల్లలు పెద్దలను అనుసరిస్తారు. 'శ్రేష్ఠులైనవారు చేస్తున్నారు కనుక అది సరి అయినది అయి ఉంటుంది' అని దానిని ఆచరణకు స్వీకరిస్తారు. పెంపుడు జంతువులు.. తమ యజమానిని అనుకరిస్తాయి. ఏది చెప్తే అది చేస్తాయి. అలా అవి మానవులను అనుకరించి తదుపరి జన్మల్లో మానవ జన్మలెత్తుతాయని పరిశోధనలు చెబుతున్నాయి.



'యథా రాజా తథా ప్రజా' 'ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా' అని సామెతలు అందరికీ తెలిసినవే. ఒక గొర్రె ఎటు నడిస్తే, మిగిలిన గొర్రెలన్నీ దాని వెనుకే నడుస్తాయి.. అని కూడా తెలిసిందే. అజ్ఞానులైన మార్గదర్శకులు చేసే పని వల్ల, అతడిని అనుసరించేవారంతా గొర్రెలలాగే ప్రవర్తిస్తారు.

పెద్దవాళ్లే తప్పు చేస్తే, పిల్లలు ఆ తప్పును అనుకరించకుండా ఎలా ఉంటారు.

ఇందుకు ఉదాహరణగా ఒక కథ చెప్తారు.


అనగనగా ఒక ఊరిలో ఒక అజ్ఞాని ఉన్నాడు. తనను తాను గొప్పవాడు అనుకున్నాడు. ఒకసారి ఒక రాగి చెంబు తీసుకుని గంగా తీరానికి స్నానానికి వెళ్లాడు. చెంబును గట్టు మీద ఉంచి స్నానం చేయాలనుకున్నాడు. చెంబును గట్టున పెట్టినప్పుడు ఎవరైనా ఎత్తుకుపోతే ఎలా? అని ఆలోచన చేసి, ఆ చెంబుని ఒడ్డున ఇసుకలో పాతిపెట్టి, పై భాగాన్ని ఇసుకతో శివలింగాకృతితో చేసి, స్నానానికి నదిలోకి దిగాడు. మూడు మునకలు వేసి ఒడ్డుకు వచ్చి చూసేసరికి, అక్కడ వందల సంఖ్యలో శివలింగాలు కనిపించాయి. తాను అలా చెంబును ఒడ్డున పాతిపెట్టడం చూసిన అక్కడివారు, 'స్నానం చేయడానికి ముందు ఇలా చేయాలేమో' అనుకుని అతడిని అనుసరించారు. ఆ అజ్ఞాని ఎందుకు అలా చేశాడో ఆలోచించకుండా, అతడు చేసినట్లే చేయాలేమో అని భావించారు. 'శాస్త్ర ప్రామాణికంగా చెప్పినవాటిని మాత్రమే ఆచరించాలి' అని భగవద్గీత చెప్పినదానిని అనుసరించకుండా, అయోగ్యులు చెప్పిన అంశాలను, అజ్ఞానులు అనుసరించిన మార్గాన్ని అనుసరించడం వల్ల ఏమాత్రం మేలు చేకూరదు. శాస్త్రం చెప్పిన విధివిధానాలనే శాస్త్రప్రమాణంగా ఆచరించాలని చెప్తారు పెద్దలు.

రామాయణంలో రాముడు సత్యానికి, ధర్మానికి కట్టుబడి, శాస్త్ర వచనాలను అనుసరించడం వల్లే నేటికీ రాముడు మనకు ఆదర్శప్రాయంగా నిలబడ్డాడు. రాముడు అనుసరించిన మార్గం నిత్యం అనుకరణీయం.

**- డా. పురాణపండ వైజయంతి**

## మాట – ఆట 335

నిర్వహణ: సంభంకాడి గంగాధర్




### ఆధారాలు


| అడ్డం | | నిలువు | |
|---|---|---|---|
| 1. కైలాసంలో శివుని ఉద్యానవనం | (3) | 1. వరునికిచ్చే కానుక | (2) |
| 4. కటిక చీకటి | (4) | 2. అశ్వగార్దభాలకు పుట్టే సంకర జీవి | (6) |
| 7. ఇతరుల స్పర్శ వల్ల కలిగే నవ్వుతో కూడిన పులకరింత | (5) | 3. సంపద | (3) |
| 8. భారతీయ మహిళల సంప్రదాయ వస్త్రం | (2) | 4. విఘ్నం | (4) |
| 9. గొంతు బొంగురుపోవడం | (2) | 5. పార్వతీదేవి | (4) |
| 10. వాల్మీకి విరచిత ఇతిహాసం | (4) | 6. క్షత్రియ జాతి సంహారానికి పూనుకున్నవాడు | (6) |
| 12. పేరు తర్వాత పలికే గౌరవ శబ్దం | (2) | 11. కృష్ణునిపై పగబట్టిన కంసుని మామ | (5) |
| 13. జీవి భౌతిక రూపం | (2) | 13. విశ్వనాథుని క్షేత్రం | (2) |
| 14. ఆచూకీ, కూపీ | (2) | 16. నూరవ | (2) |
| 15. ఆదాయం | (3) | 17. సన్నని | (2) |
| 16. కుందేలును తన ఉపరితలంపై కలవాడు | (2) | 18. భారతంలో శిఖండి పూర్వపు జన్మ | (2) |
| 19. మనువాడినది | (3) | 20. శిల తలకిందులైంది | (2) |
| 21. ఉత్తర దిక్పాలకుని పుత్రుడు | (6) | 21. నాడి | (2) |
| 24. నది | (2) | 22. సన్నని మూతి కలిగిఉండే మట్టి కుండ | (2) |
| 25. నది ఒడ్డు | (2) | 23. శ్రీకృష్ణుని పెద్ద భార్య | (3) |
| 27. 'నాకు మాత్రమే' అన్న కుంచిత భావన | (2) | 25. నదీ తీర క్షేత్రం | (2) |
| 29. లెక్కల శాస్త్రం | (3) | 26. వడ్డీ వ్యాపారి | (2) |
| 31. కానుక | (4) | 27. ఒకానొక నక్షత్రం | (2) |
| 33. నైరుతి దిగ్గజం | (4) | 28. అంజనీ పుత్రుడు | (5) |
| 34. నిప్పు | (2) | 29. పోవుట, పయనం | (3) |
| 36. శ్రీకృష్ణుని పెంచినవాడు | (3) | 30. బతుకమ్మ పువ్వు | (3) |
| 39. బాగా ధనమున్నవాళ్లు | (5) | 31. బూడిద | (2) |
| 40. తప్పు చేస్తే కోరవలసింది | (4) | 32. మొక్కజొన్న | (2) |
| 41. పడిపోవుట, నాశం | (3) | 34. ఆరాటం, తీవ్ర వాంఛ | (3) |
| | | 35. ఆలోచనలకు నిలయం | (3) |
| | | 37. కూతురు | (3) |
| | | 38. చెక్కిలి, బుగ్గ | (2) |

## పిలగాండ్లు

### రంగులు వేయండి

చుక్కలన్నీ కలిపి రంగులు వేయండి.





### ఇంగ్లిష్ నేర్చుకుందామా?

ఈ పజిల్‌లో హాలోవీన్‌కు సంబంధించిన పదాలున్నాయి. అవేంటో వెతకండి.

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| M | O | O | N | P | W | C | O | S | T | U | M | E | M | E |
| T | M | U | T | V | W | Q | S | P | I | D | E | R | K | G |
| B | Q | A | V | Y | T | Y | I | C | W | B | G | E | S | K |
| W | E | R | E | W | O | L | F | O | A | S | K | U | L | L |
| R | H | A | L | L | O | W | E | E | N | N | K | A | N | Z |
| Q | N | V | W | M | B | D | R | X | C | K | D | A | Q | Y |
| W | Z | I | L | Y | U | G | K | Q | V | P | E | Y | J | U |
| I | Q | T | W | B | O | F | V | X | J | L | C | W | Z | O |
| T | P | N | H | L | A | G | A | S | T | O | O | M | O | R |
| C | B | O | N | E | S | T | M | L | O | O | F | A | M | T |
| H | Y | C | T | P | X | E | P | S | A | H | F | L | B | R |
| E | N | R | Z | I | Q | C | I | J | I | A | I | G | I | O |
| Z | A | O | Q | M | O | M | R | Y | P | Y | N | B | E | L |
| M | Q | B | L | A | H | N | E | R | F | G | P | N | V | L |
| V | P | D | Y | U | Q | I | F | G | H | O | S | T | J | S |

### తేడాలు గుర్తించండి

ఈ రెండు బొమ్మల మధ్య ఆరు తేడాలున్నాయి. వాటిని కనిపెట్టండి.





# మొసలి కన్నీరు

ఒకరోజు సాయంత్రం తాతయ్య వరండాలో కుర్చీలో కూర్చుని ఉండగా, మనవరాలు ఉజ్వల, మనవడు శరత్ పరుగున వచ్చి ఆయన పక్కన చేరారు. "తాతయ్యా.. ఇందాక టీవీలో ఒకాయన రాజకీయ నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని అంటుంటే విన్నాం. అసలు మొసళ్లు కూడా మనలాగే ఏడుస్తాయా?" అని అడిగింది ఉజ్వల సందేహంగా. తాతయ్య నవ్వి, "అవునమ్మా! మొసళ్లు ఏడుస్తాయి. కానీ ఆ ఏడుపు వెనుక ఒక వింత కథ, ఒక శాస్త్రీయ నిజం ఉన్నాయి. చెప్తాను వినండి" అంటూ కథ మొదలుపెట్టాడు.

అనగనగా ఒక పెద్ద మడుగులో ఒక ముసలి మొసలి ఉండేది. అది చాలా తెలివైనది, అంతకంటే ఎక్కువ మోసకారి. ఒకరోజు ఒక జింక దాహంతో ఆ మడుగు దగ్గరకు వచ్చింది. ఒడ్డున కదలకుండా పడి ఉన్న మొసలిని చూసి జింకకు అనుమానం వచ్చింది. అది రాయా లేక మొసలా అని తేల్చుకోలేక జింక అక్కడే ఆగిపోయింది. జింక తనని గమనిస్తోందని గ్రహించిన మొసలి, తను రాయిలాగే నటించాలని నిశ్చయించుకుని అస్సలు కదలకుండా బిగుసుకుపోయింది. సరిగ్గా అప్పుడే ఒక పావురం ఎగురుకుంటూ వచ్చి, మొసలిని రాయి అనుకుని దాని తల మీద వాలింది. అది చూసిన జింక, "పావురమే దాని మీద వాలిందంటే అది ఖచ్చితంగా రాయే అయి ఉంటుంది" అని నమ్మి, నిశ్చింతగా నీళ్లు తాగడానికి ముందుకు వెళ్లింది.

జింక తల దించి నీళ్లు తాగుతున్న సమయంలో, మొసలి ఒక్కసారిగా నోరు తెరిచి జింక మీద దాడికి లేచింది. ఆ ఊహించని పరిణామానికి పావురం భయపడి టపటపామని రెక్కలు ఆడిస్తూ ఒక్కసారిగా పైకి ఎగిరిపోయింది. ఆ రెక్కల చప్పుడు విని జింక అప్రమత్తమై, మొసలి నోటికి చిక్కకుండా ఒకే గెంతుతో అడవిలోకి పారిపోయింది. ఆహారం దొరకలేదని మొసలి నిరాశతో ఒడ్డుకు వచ్చి కళ్ల వెంట నీళ్లు కార్చసాగింది. అప్పుడే అక్కడికి ఒక నీటి ఏనుగు వచ్చింది. మొసలి కళ్లలో నీళ్లు చూసి అది బాధపడుతోందని భ్రమపడి, "ఏమైంది మిత్రమా! ఎందుకు ఏడుస్తున్నావు?" అని జాలితో అడిగింది.



మొసలి మెల్లగా తన కపట బుద్ధితో.. "మిత్రమా! నాకు చాలా జబ్బుగా ఉంది. సింహం మాంసం తింటేనే నా జబ్బు తగ్గుతుందని ఒక వైద్యుడు చెప్పాడు. కానీ నాకు వేటాడే శక్తిలేక ఇలా ఆకలితో అలమటిస్తున్నాను" అని అబద్ధం చెప్పింది. అమాయకపు నీటి ఏనుగు కరిగిపోయి, "సరే, ఏడవకు నేను ఎలాగైనా నీ కోసం సింహం మాంసం తెచ్చిపెడతాను" అని మాట ఇచ్చింది. ఇదంతా చెట్టు చాటు నుంచి వింటున్న జింక బయటకు వచ్చి, "నీటి ఏనుగు మిత్రమా! ఆ మొసలి కన్నీళ్లు చూసి మోసపోకు. అది నిన్ను ప్రమాదంలో పడేయాలని చూస్తోంది. సింహం నీళ్ల కోసం వచ్చినప్పుడు నువ్వు దానితో పోరాడితే, మీ ఇద్దరిలో ఎవరు చనిపోయినా ఈ మొసలికి లాభమే. కష్టపడకుండా దానికి ఆహారం దొరుకుతుందని ఇలాంటి నాటకం ఆడుతోంది" అని అసలు నిజాన్ని బయటపెట్టింది.

తాతయ్య పిల్లల వైపు చూస్తూ, "చూశారా పిల్లలూ! నిజానికి మొసళ్లు మనలా ఏడవ్వు. శాస్త్రీయంగా చూస్తే, మొసళ్లు ఆహారాన్ని నమిలేటప్పుడు, వాటి దవడలను బలంగా కదిలించినప్పుడు వాటి దవడ కండరాలు కంటి దగ్గర ఉండే గ్రంథుల మీద గట్టిగా ఒత్తిడి తెస్తాయి. ఆ ఒత్తిడి వల్ల కళ్ల నుంచి నీరు దానంతట అదే బయటకు వస్తుంది. ఇది ఒక సహజమైన శారీరక ప్రక్రియ మాత్రమే, అంతేకానీ అది జాలిపడి కార్చే కన్నీరు కాదు. అందుకే ఎవరైనా లోపల చెడు ఆలోచనలు పెట్టుకుని, పైకి ఏడుస్తూ నటించే వాళ్లను చూసి మన పూర్వీకులు మొసలి కన్నీరు అనే జాతీయాన్ని సృష్టించారు" అని వివరించాడు.


అది విన్నాక ఉజ్వల, శరత్‌లు.. "ఓహో! ఇదా అసలు విషయం.." అని ఒక కొత్త విషయాన్ని తెలుసుకున్న సంతోషంతో చప్పట్లు కొట్టారు.

**- డా. పోతగాని సత్యనారాయణ**

మీరూ లైఫ్‌కి పిల్లల కథలు పంపాలి అనుకుంటున్నారా? అయితే.. కథను హామీపత్రంతోపాటు featureseditor@v6velugu.com కి మెయిల్ చేయండి.

## జవాబులు


తేడాలు గుర్తించండి



ఇంగ్లిష్ నేర్చుకుందామా?




## మాట- ఆట 334 సమాధానం



కొన్ని విజయాల వెనుక గొప్ప పరిచయాలు ఉంటాయి. మరికొన్ని విజయాలు మాత్రం త్యాగం, నమ్మకం, ఓర్పు, నిరంతర ప్రయత్నం మీద నిలబడతాయి. నటి దివ్యభారతి సినీ ప్రయాణం అలాంటి కథల్లో ఒకటి. రీసెంట్‌గా లింగం అనే తమిళ సినిమాలో నటించిన దివ్య, తన పాత్రకు మంచి ప్రశంసలు అందుకుంది.

పరిచయం

# పరిచయాల కంటే.. పట్టుదలే ముఖ్యం

తమిళనాడులోని కోయంబత్తూరులో పెరిగిన దివ్యభారతికి చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఇష్టమే. కానీ సినిమా రంగంలోకి రావాలనే లక్ష్యంతో పెరిగిన అమ్మాయి కాదు. ఇంట్లో సినిమా నేపథ్యం లేదు. నిర్మాతలు, దర్శకులు, నటులతో పరిచయాలు లేవు. కుటుంబ బాధ్యతలను తన తల్లి ఒంటరిగానే మోసి తనను చదివించారని ఆమె ఎన్నోసార్లు గుర్తు చేసుకుంది. తన జీవితంలో వచ్చిన ప్రతి అవకాశానికి తల్లి చేసిన త్యాగమే పునాది అని ఆమె చెప్పింది.



**చదువే మొదటి ప్రాధాన్యం**

చిన్నప్పటి నుంచే చదువుకు ప్రాధాన్యం ఇచ్చిన దివ్యభారతి, సత్యమంగళంలోని బన్నారి అమ్మన్ ఇంజినీరింగ్ కాలేజీలో ఐటీ విభాగంలో ఇంజినీరింగ్ పూర్తిచేసింది. చదువు పూర్తయ్యాక చాలామందిలాగే ఉద్యోగం గురించి ఆలోచించింది. అయితే కాలేజీ రోజుల నుంచే ఫొటో షూట్‌లు, ఫ్యాషన్ షోల్లో పాల్గొనడం వల్ల ఆమె ఆసక్తి క్రమంగా ఆ రంగం వైపు మళ్లింది. ఆ ఆసక్తి ఆమె జీవితాన్ని పూర్తిగా మార్చేసింది.

**అందాల పోటీల నుంచి నటన వైపు**

2015లో జరిగిన పలు అందాల పోటీల్లో విజేతగా నిలిచి గుర్తింపు తెచ్చుకుంది. 2016లో 'ప్రిన్సెస్ ఆఫ్ కోయంబత్తూర్' బిరుదు కూడా అందుకుంది. అయితే ఈ విజయాలు వచ్చిన వెంటనే సినిమా అవకాశాలు రాలేదు. గుర్తింపు రావడం ఒకటి, అవకాశాలు దక్కడం మరోటి అని అప్పుడే ఆమెకు అర్థమైంది. తరచూ యాక్టింగ్ ఆడిషన్స్‌కు హాజరవుతూ, కొత్త అవకాశాల కోసం ఎదురుచూస్తూ గడిపిన రోజులు ఎన్నో ఉన్నాయి. అవి ఆమెకు సహనాన్ని నేర్పాయని అంటోంది దివ్య.

**సినిమాల్లోకి రావాలా? వద్దా?**

మొదట్లో సినిమాల్లో నటించాలా? వద్దా? అనే సందేహం తనకు ఉండేదని దివ్యభారతి ఓ సందర్భంలో చెప్పింది. కానీ 'బ్యాచిలర్' కథ విన్న తర్వాత ఆమె ఆలోచన మారింది. పాత్ర నచ్చడంతో స్క్రీన్ టెస్ట్‌లో పాల్గొంది. అందులో తను ఎంపికైంది. అలా ఆమె తొలి సినిమా ప్రారంభమైంది. మొదటి సినిమానే కావడంతో దాన్ని ఎంతో సీరియస్‌గా తీసుకుంది. దాదాపు మూడు నెలలపాటు నటనలో ప్రత్యేక శిక్షణ తీసుకుంది. పాత్రను అర్థం చేసుకోవడం, భావోద్వేగాలను సహజంగా వ్యక్తం చేయడం, కెమెరా ముందు నమ్మకంగా ఎంతో హార్డ్ వర్క్ చేసింది.



**పాత్రల ఎంపికలో రాజీ లేదు**

'బ్యాచిలర్' తర్వాత ఆమె సినిమాలతో పాటు డిజిటల్ ప్లాట్‌ఫాం కోసం రూపొందిన కథల్లోనూ నటించింది. తక్కువ సినిమాలే చేసినా, తనకు నచ్చిన పాత్రలనే ఎంచుకోవాలనే నిర్ణయాన్ని మాత్రం మార్చుకోలేదు. త్వరగా ఎక్కువ సినిమాలు చేయడం కంటే, నటిగా గుర్తుండిపోయే పాత్రలు చేయాలనే ఆలోచనతోనే ముందుకు సాగుతున్నట్లు ఆమె చాలాసార్లు చెప్పింది.

**'లింగం'లో పొన్మలర్**

ఆమె తాజా ప్రయాణంలో మరో ముఖ్యమైన అడుగు 'లింగం'. ఇందులో పొన్మలర్ పాత్రలో కనిపించింది. బయటకు ప్రశాంతంగా కనిపించే ఈ పాత్రలో లోపల ధైర్యం, సహనం, మనోబలం దాగి ఉంటాయి. ఈ పాత్ర గురించి మాట్లాడిన దివ్యభారతి.. భావోద్వేగాలను మాటల కంటే చూపులతోనే ఎక్కువగా వ్యక్తం చేయాల్సి వచ్చిందని తెలిపింది. అందుకే పాత్రను పూర్తిగా అర్థం చేసుకోవడానికి దర్శకుడితో చాలాసార్లు చర్చించినట్లు చెప్పింది. ప్రతి సన్నివేశాన్ని సహజంగా చేయాలనే ఉద్దేశంతోనే నటించానని, షూటింగ్ టైంలో సహనటులు, మూవీ టీం అందించిన సహకారం తనకు ఎంతో ఉపయోగపడిందని తెలిపింది.

**జర్నీ కొనసాగుతూనే ఉంది..**

దివ్యభారతి కథలో సంచలనాలు కనిపించవు. కానీ నిశ్శబ్దంగా సాగిన ఒక ప్రయాణం కనిపిస్తుంది. కోయంబత్తూరులో ఇంజినీరింగ్ పూర్తిచేసిన ఒక అమ్మాయి.. మోడలింగ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. అందాల పోటీల్లో గుర్తింపు సంపాదించింది. ఎన్నో ఆడిషన్స్ చేసింది. తనకు వచ్చిన తొలి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంది.

అవకాశం కోసం ఎదురుచూడటం ఒక పరీక్ష అయితే, ఆ అవకాశం వచ్చిన తర్వాత దాన్ని నిలబెట్టుకోవడం మరో పరీక్ష. ఈ రెండు పరీక్షల్లోనూ ఓర్పు, క్రమశిక్షణ, నమ్మకం ఉంటేనే ప్రయాణం ముందుకు సాగుతుంది అని ఆమె జర్నీ చెప్తోంది.



**ప్రయాణం పూర్తికాలేదు..**

**'బ్యాచిలర్' విడుదలైన తర్వాత దివ్యభారతికి మంచి గుర్తింపు వచ్చింది. కొత్త కథానాయికగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. కానీ మొదటి సినిమా విజయం తర్వాత అవకాశాలు వరుసగా వస్తాయని అనుకున్న ఆమెకు త్వరలోనే వాస్తవం అర్థమైంది. ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ... "మొదటి సినిమా విజయవంతమైతే తర్వాత అవకాశాలు వాటంతట అవే వస్తాయని అనుకున్నాను. కానీ ప్రతి అవకాశానికి మళ్లీ ప్రయత్నించాల్సిందేనని తర్వాత అర్థమైంది" అని చెప్పింది. ఆ ఒక్క మాటే ఆమె సినీ ప్రయాణాన్ని అద్దంలా చూపిస్తుంది.**

# స్ట్రీమ్ ఎంగేజ్

## హ్యాకర్ ఎవరు?



టైటిల్ : ప్రీతమ్ అండ్ పెడ్రో
డైరెక్షన్ : అవినాశ్ అరుణ్, అమిత్ సత్యవీర్ సింగ్
కాస్ట్ : అర్షద్ వార్సీ, వీర్ హిరానీ, విక్రాంత్ మాస్సే, మోనా సింగ్, బోమన్ ఇరానీ, శృతి మరాఠే
ప్లాట్‌ఫాం : జియో హాట్‌స్టార్

గోవాలో తన తాతయ్యతో కలిసి ఉంటూ వాక్యూమ్ క్లీనర్లు అమ్మే పని చేస్తుంటాడు ప్రీతమ్ (వీర్ హిరానీ). కానీ అతను మామూలు వ్యక్తి కాదు.. టెక్నాలజీలో దిట్ట. ఓ ఏటీఎం దొంగతనం కేసును ఛేదించడంలో పోలీస్ ఆఫీసర్ పెడ్రో (అర్షద్ వార్సీ)కి సాయం చేస్తాడు. దీంతో ఇద్దరి మధ్య మంచి స్నేహం ఏర్పడుతుంది. తర్వాత పెడ్రోను సైబర్ సెల్‌కు బదిలీ చేస్తారు. అదే సమయంలో స్పోర్ట్స్ మినిస్టర్ కుమారుడు వినీత్ కిడ్నాప్ అవుతాడు. రూ.5 కోట్లు ఇవ్వాలని కిడ్నాపర్ డిమాండ్ చేస్తాడు. ఈ కేసు వెనుక ఓ తెలివైన హ్యాకర్ ఉన్నాడని ప్రీతమ్ గుర్తిస్తాడు. కేసు దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ ప్రీతమ్ గతానికి సంబంధించిన కొన్ని షాకింగ్ నిజాలు బయటపడతాయి. మరోవైపు పెడ్రో జీవితాన్ని వెంటాడుతున్న ఓ విషాదం కూడా కథలో కీలకంగా మారుతుంది. అసలు వినీత్‌ను కిడ్నాప్ చేసింది ఎవరు? హ్యాకర్‌కు ప్రీతమ్‌తో ఉన్న సంబంధం ఏంటి? చివరకు ఈ కేసును వాళ్లు ఎలా ఛేదించారు? అనేదే మిగతా కథ.

## ఐదు ఆత్మల మిస్టరీ

టైటిల్ : కరక్కం
డైరెక్షన్ : సుభాష్ లలిత సుబ్రహ్మణియన్
కాస్ట్ : శ్రీనాథ్ భాసి, ఫెమీనా జార్జ్, ప్రవీణ్ టీజే, అభిరామ్ రాధాకృష్ణన్, షాన్ రోమీ, సిద్ధార్థ్ భరతన్, జీన్పాల్ లాల్
ప్లాట్‌ఫాం : సోనీలివ్



ధనుష్ (శ్రీనాథ్ భాసి) ఒక డాన్సర్. సంపాదన పెద్దగా లేకపోవడంతో ఇంట్లో అందరి మాటలు పడుతుంటాడు. ఆ బాధను అతని లవర్ పింకీ (ఫెమీనా జార్జ్) ప్రేమతో మర్చిపోతుంటాడు. అలాంటి సమయంలో ఖాజా (ప్రవీణ్) పరిచయం అవుతాడు. న్యూ ఇయర్ రోజు వీళ్లిద్దరూ బాగా తాగి స్మశానానికి చేరతారు. మత్తులో అక్కడే పడిపోయి, తర్వాత మెల్లగా లేచి బయటకు వస్తారు. కానీ వెళ్లే ముందు సమాధులపై ఉన్న ఐదు ఇత్తడి శిలువలు దొంగిలిస్తారు. ఆ క్రమంలో ధనుష్ తన రూమ్ కీ కూడా అక్కడే వదిలేస్తాడు. తర్వాత ఆ శిలువలను అమ్మడానికి వెళ్లగా వాటిని కొనేవాడు వర్గీస్ చనిపోతాడు. కీ కోసం మళ్లీ స్మశానానికి వెళ్లిన వీళ్లకు అక్కడ పోలీసులు కనిపిస్తారు. అదే సమయంలో శిలువలు తీసిన వాళ్లను ప్రేతాత్మలు వెంటాడతాయని ఫాదర్ చెప్పడంతో వాళ్లలో భయం మొదలవుతుంది. అప్పటినుంచి నిజంగానే ఐదు ఆత్మలు ధనుష్, ఖాజాలను వేటాడటం మొదలుపెడతాయి. అసలు ఆ ఐదు ప్రేతాత్మలు ఎవరు? వాళ్లు ఎందుకు వీళ్లను వెంటాడుతున్నారు? చివరికి ధనుష్ వాళ్ల నుంచి ఎలా బయటపడ్డాడు? అనేదే మిగతా కథ.

## సుబ్బు మిషన్ సక్సెస్ అయ్యిందా?



టైటిల్ : సూపర్ సుబ్బు
డైరెక్షన్ : మల్లిక్ రామ్
కాస్ట్ : సందీప్ కిషన్, మిథిలా పాల్కర్, మురళీ శర్మ, బ్రహ్మానందం, మానస చౌదరి, గెటప్ శ్రీను
ప్లాట్‌ఫాం : నెట్‌ ఫ్లిక్స్

సుబ్రహ్మణ్యం అలియాస్ సుబ్బు (సందీప్ కిషన్) తన తల్లిదండ్రులు, మేనమామతో కలిసి ఉంటాడు. సెక్స్ ఎడ్యుకేషన్‌పై చిన్నప్పటి నుంచే ఆసక్తి ఉన్న సుబ్బు, తండ్రి కుక్కుటేశ్వరరావు (మురళీ శర్మ) సాయంతో ఓ స్కూల్‌లో తాత్కాలిక ల్యాబ్ అసిస్టెంట్‌గా చేరతాడు. కానీ కొన్ని కారణాల వల్ల ఆ ఉద్యోగం పోయే పరిస్థితి వస్తుంది. అదే సమయంలో ప్రిన్సిపాల్ మధుసూదనరావు (బ్రహ్మానందం) అతని ఆసక్తిని గుర్తించి, లైంగిక అవగాహన కల్పించే కార్యక్రమం కోసం మాకీపూర్ గ్రామానికి పంపిస్తాడు. అక్కడి ప్రజలు మూఢనమ్మకాలతో జీవిస్తూ, సెక్స్ ఎడ్యుకేషన్ గురించి ఏ మాత్రం అవగాహన లేకపోవడం సుబ్బుకు షాక్ ఇస్తుంది. మరోవైపు దివ్యతో అతని పెళ్లి కుదురుతుంది. మాకీపూర్‌లో స్వాతి (మిథిలా పాల్కర్) పరిచయం కావడంతోపాటు, కొందరు ప్రమాదకర వ్యక్తులతో కూడా అతను తలపడాల్సి వస్తుంది. అసలు మాకీపూర్‌లో సుబ్బుకు ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి? వాటిని అతను ఎలా ఎదుర్కొన్నాడు? చివరకు తన లక్ష్యంలో విజయం సాధించాడా? అనేదే ఈ సిరీస్ కథ.

**తొలితరం కార్మికులను గౌరవించాలి**

1970 దశకంలో ధైర్యసాహసాలతో స్వదేశాన్ని విడిచి గల్ఫ్ దేశాలకు వెళ్లిన తొలి తరం గల్ఫ్ కార్మికులు భారతదేశ ఆర్థికాభివృద్ధికి విశేషంగా దోహదపడ్డారు. ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ కుటుంబాలను ఆదుకున్న వారి జీవిత అనుభవాలు, పోరాట గాథలను ప్రభుత్వం నమోదు చేసి భావితరాలకు చరిత్రగా అందించాలి.

- మంద భీంరెడ్డి, వైస్ చైర్మన్, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ

అది 1970. తెలంగాణలోని పలు జిల్లాల్లో కరవు, పేదరికం, ఉపాధి లేమి ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. రోజువారీ కూలి పనులతో కుటుంబాన్ని పోషించడం కూడా కష్టంగా మారింది. దాంతో చాలామంది గల్ఫ్ దేశాల వైపు అడుగులు వేశారు. ఎడారిలో చెమటోడ్చి సంపాదించిన ప్రతి రూపాయి.. కుటుంబాల అభ్యున్నతికి పునాది అయింది. ఆరు దశాబ్దాల తర్వాత ఆ తొలి తరం గల్ఫ్ కార్మికుల జీవితాలను తిరిగి పరిశీలిస్తే.. అది కష్టాలు, కన్నీళ్లు, త్యాగాలు, విజయాలతో నిండిన ఓ అపూర్వ గాథ.



# పాలేరు నుంచి పటేల్ వరకు..

గల్ఫ్ దేశాల్లో వలసకార్మికులు పంపిన డబ్బుతో గ్రామాల్లో అప్పులు తీరాయి. గుడిసెల స్థానంలో పక్కా ఇళ్లు నిర్మించుకున్నారు. పాలేరుగా పనిచేసిన వారు.. భూస్వాములయ్యారు. అంతకంటే గొప్ప మార్పు.. తదుపరి తరంలో కనిపించింది. ఈ విజయాల వెనుక మాత్రం కనిపించని ఎన్నో త్యాగాలు ఉన్నాయి. సంవత్సరాల తరబడి కుటుంబాలకు దూరంగా జీవించడం.. పండుగలు, పిల్లల పెరుగుదల, కుటుంబ వేడుకలు అన్నింటినీ కోల్పోవడం.. ప్రమాదాలు, అనారోగ్యం, ఒంటరితనం.. ఇవన్నీ ఆ తరం గల్ఫ్ కార్మికుల జీవితంలో విడదీయరాని భాగమయ్యాయి. అయితే వారు మాత్రం.. "మా కష్టం వృథా కాలేదు. మా పిల్లలు మాలాంటి జీవితం గడపకూడదనేదే మా లక్ష్యం" అంటున్నారు. తెలంగాణలో గల్ఫ్ వలసల చరిత్ర.. కేవలం విదేశాలకు వెళ్లిన కార్మికుల కథ కాదు. అది ఆకలి నుంచి ఆత్మగౌరవానికి సాగిన ప్రయాణం.

**సముద్రాన్ని దాటి ఎడారి దేశానికి చేరి 49 ఏళ్లు..**

మనరాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి గల్ఫ్ దేశాలకు కార్మికుల వలస 1970వ సంవత్సరం నుంచి ఆరంభం అయింది. అప్పట్లో కార్మికులు సముద్రం మీదుగా షిప్‌లలో ప్రయాణాలు చేసి గల్ఫ్ దేశాలకు వెళ్లారు. అలా వెళ్లిన వాళ్లలో జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మైతాపూర్ గ్రామానికి చెందిన మిట్టపెల్లి గంగారాం ఒకరు. ఆయన గల్ఫ్ దేశానికి పడవ ప్రయాణం చేసి 49 ఏళ్లు అయింది. నాటి పరిస్థితులు తన జీవితాన్ని ఎలా మార్చాయో ఆయన మాటల్లోనే తెలుసుకుందాం.





"అది 1963వ సంవత్సరం. నేను మా గ్రామంలోని పటేల్ నారాయణ దొర దగ్గర పాలేరుగా పశువులు కాసేవాడిని. ఎంత పనిచేసినా పైసలు చాలక ఇల్లు గడిచేది కాదు. దీంతో నా భార్య బుచ్చమ్మ కూడా పొలం పనులకు వెళ్లాల్సి వచ్చింది. ఇక లాభంలేదనుకుని ఆ తర్వాత నేను పాలేరు పని వదిలి పొట్ట పోసుకునేందుకు బొంబాయిబాట పట్టాను.

**బొంబాయి టూ గల్ఫ్**

బొంబాయి వెళ్లి బట్టల మిల్లులో పవర్ లూమ్ కార్మికుడిగా చేరాను. ఉన్నట్టుండి ఒకరోజు బట్టల మిల్లుకు తాళం వేసి బంద్ పెట్టారు. దీంతో నా ఉద్యోగం పోయింది. బొంబాయిలో పని దొరక్కపోవడంతో 1977లో ఏజెంట్‌ను బతిమాలితే పాస్ పోర్టు, వీసా ఇప్పించాడు. దాంతో రూ.1,100లు పెట్టి ఓడలో బొంబాయి నుంచి 9 రోజులు ప్రయాణించి టార్గెట్ ఇంజనీర్ కంపెనీ తరపున సొబతు వాళ్లతో కలిసి దుబాయ్‌కి వెళ్లా. అయితే నాకు చదువులేదు. ఆ దేశంలోని భాష తెలియదు. మండే ఎండలు.. మరో వైపు కఠినమైన శ్రమ.. అయినా నా కుటుంబం కోసం అన్నింటినీ భరించా. నాకు వచ్చిన కొద్దిపాటి ఎలక్ట్రీషియన్ పనిచేస్తూనే మరోవైపు లేబరు పనులు చేశా. బువ్వలేక నీళ్లు తాగి ఆకలికి ఓర్చుకున్న రోజులూ ఉన్నాయి. ఉండటానికి ఠికానా కూడా సరిగా ఉండేది కాదు.

**సఫాయి పని వచ్చింది**

దుబాయ్‌లో 18 నెలలు పనిచేశాక నాకు అబుదాబి సిటీ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుడిగా కాంట్రాక్టు ఉద్యోగం వచ్చింది. రోజూ సముద్రం పక్కన ఉన్న హిల్టన్ హోటల్ ముందున్న కార్నేకు రోడ్డును ఊడ్చే డ్యూటీ. పొద్దుగాలంతా రోడ్లు ఊడ్చేవాడిని. రాత్రి కాగానే మార్కెట్‌కు వెళ్లి హమాలీగా మూటలు మోసేవాడిని. హమాలీగా పనిచేసినందుకు 6 నుంచి 12 దిర్హామ్ లు వచ్చేవి. దీంతోపాటు పారిశుద్ధ్య కార్మికుడిగా శుక్రవారాలు సెలవైనా నేను నెలకు నాలుగు శుక్రవారాలు కూడా ఓవర్ టైం పనిచేశా. అప్పట్లో ఒక దిర్హామ్ అంటే మన కాడ రెండు రూపాయలు వచ్చేది. అలా మూడేళ్లపాటు ఇంటికి రాకుండా పనిచేశా. రెండేళ్లకొకసారి ఇంటికి వచ్చి భార్య పిల్లలను చూసుకుని వెళ్లేవాడిని.

**పటేల్ దగ్గర పొలం కొన్నా..**

**ఆ దేశంలో దిర్హామ్ దిర్హామ్ కూడబెట్టిన డబ్బును నా భార్యకు పంపించేవాడిని. మేం పడిన కష్టం మా పిల్లలు పడకూడదని మేమిద్దరం అనుకున్నాం. అలా కూడబెట్టిన డబ్బు రూ. 24 వేలతో నేను పనిచేసిన పటేల్ అయిన నారాయణ దొర దగ్గర ఎకరం 6వేల రూపాయలు చొప్పున నాలుగు ఎకరాలు కొన్నా. ఆ భూమిలో మామిడితోట వేశా. అలా 18 ఏళ్లపాటు గల్ఫ్ దేశంలో పనిచేస్తూనే డబ్బు జమ చేసి మొత్తం15 ఎకరాల భూమి కొన్నా. ఇప్పుడు ఆ భూమి ఎకరం ధర రూ.60 లక్షలయ్యింది. సాగుభూమితోపాటు ఆరు గుంటల ఇంటి జాగా కూడా కొన్నా. ఆ స్థలంలో పెంకులతో ఇల్లు, రేకులతో పశువుల కొట్టం కట్టిన.**

**అప్పట్లో పైసలు లేక నా పిల్లల్ని చదివించలేకపోయా. దీంతో వాళ్లు పొలం పనుల్లోకి దిగారు. నాకు పెద్ద కొడుకు రాజారాం, చిన్న కొడుకు ప్రభాకర్. ఇద్దరూ పొలాన్ని దున్నుకుంటూ జిందగీ నడుపుతున్నారు. నా కూతురు మణెవ్వకు పెళ్లి చేశా. నానా కట్టాలు పడి భూములు కొనడం వల్ల నా పిల్లల బతుకు బాగు అయింది. 1996లో గల్ఫ్ నుంచి 2 లక్షలు తీసుకొచ్చా. దాంతో పొలాలు, ఇంటి జాగాలు కొన్నా. ఎన్నో కట్టాలు పడి పిల్లల్ని చూసుకున్న నా భార్య బుచ్చవ్వ పాణం బాలేక కాలం చేసింది. నా వయసు 70 ఏళ్లు దాటినా ఇంటి దగ్గరే గేదెలు, ఆవులు చూసుకుంటున్నా. నా మనవళ్లు ఇద్దరూ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదివి విదేశాలకు వెళ్లారు. నాకు భగవంతుడు కల్పించిన అవకాశం నాకు జీవితంలో కష్టపడినా సంతృప్తిగా ఉంది అంటున్నాడు గంగారం.**



ఒకప్పుడు పొద్దున్నే కాకుల కూతలతో మేల్కొనే హైదరాబాద్.. ఇప్పుడు ఇదే నగరంలో కాకులను వెతకాల్సిన పరిస్థితి వచ్చిందా? ఈ ప్రశ్నకు సమాధానం కనుగొనేందుకు హైదరాబాద్ బర్డ్ అట్లాస్ శాస్త్రీయ సర్వే స్టార్ట్ చేసింది. ఈ నెల 4న మొదలైన సర్వే 26వతేదీ వరకు కొనసాగనుంది. డబ్ల్యుడబ్ల్యుఎఫ్ ఇండియా, హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ , దక్కన్ బర్డర్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఈ ఏడాది జీహెచ్ఎంసి, తెలంగాణ అటవీ శాఖ కూడా మద్దతు ఇస్తున్నాయి.

# కాకి కనబడుట లేదు!

హైదరాబాద్‌తోపాటు దీని పరిసర ప్రాంతాల్లో ఉన్న పక్షి జాతులను క్రమపద్ధతిలో నమోదు చేసే లక్ష్యంతో హైదరాబాద్ బర్డ్ అట్లాస్ ఏర్పాటైంది. పక్షుల పరిశీలకులు, ప్రకృతి పరిరక్షకులు, వాలంటీర్లు, ఫొటోగ్రాఫర్లు అంకితభావం, ఉత్సాహంతో 180 సబ్ సెల్స్‌లో సర్వే చేపట్టారు. ఇప్పటికే మూడు సీజన్ల సర్వే పూర్తి కాగా ప్రస్తుతం 4వ సీజన్ కొనసాగుతోందని హైదరాబాద్ బర్డింగ్ పాల్ ప్రధానకార్యదర్శి రాజీవ్ ఖండేల్ వాల్ చెప్పారు. సిటీలోని బర్డ్స్ హాట్ స్పాట్లలో వివిధ జాతుల పక్షుల పరిరక్షణ ప్రయత్నాల కోసం శాస్త్రవేత్తలు, పక్షుల పరిరక్షకులు, ఫొటోగ్రాఫర్లు విధాన రూపకర్తలకు ఉపయోగపడేలా విలువైన సమాచారాన్ని ఈ పక్షుల సర్వేలో సేకరిస్తున్నారు. అడవులు, గడ్డి మైదానాలు, చిత్తడి నేలలు, పార్కులు, విభిన్న ఆవాసాల్లో ఈ పక్షుల సర్వే సాగుతుంది. 45 గ్రిడ్‌లుగా విభజించి సర్వే చేపట్టారు.

**అంతరిస్తున్న కాకులపై అధ్యయనం...**

సాధారణంగా ఎక్కడ చూసినా కనిపించే పక్షిగా భావించి కాకులను పెద్దగా నమోదు చేయరు. అయితే ఇటీవల నగరంలో వాటి సంఖ్య తగ్గుతోందన్న అభిప్రాయాలు బలపడటంతో ప్రత్యేక అధ్యయనం ప్రారంభించామని రాజీవ్ చెప్పారు. పక్షి కనపడకపోతే అది కేవలం ఒక జాతి సమస్య కాదు, నగర పర్యావరణ సమతుల్యతకు హెచ్చరికగా పరిగణించాలని పక్షి పరిశీలకులు చెప్తున్నారు. కాకులు నిజంగానే కనుమరుగవుతున్నాయా లేదా కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయా అనేది తెలుసుకోవడానికి పక్షుల ప్రేమికులు ప్రయత్నిస్తున్నారు.

**ఎన్ని జాతుల పక్షులున్నాయంటే...**

హైదరాబాద్ బర్డ్ అట్లాస్ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో శాస్త్రవేత్తలు మూడు సీజన్లలో పక్షుల సర్వే చేశారు. గతేడాది ఫిబ్రవరి నెల సర్వేలో



67 వేల పక్షులను డాక్యుమెంట్ చేశారు. వ్యక్తిగత పక్షుల గణనలో పావురాలు ఎక్కువగా ఉన్నాయని తేలింది. నగరంలోని పక్షుల హాట్ స్పాట్లలో 195 రకాల పక్షులు నగరంలో ఉన్నాయని సర్వేలో వెల్లడైంది. జులై నెల సర్వేలో 166 రకాల పక్షులను గుర్తించారు. స్థానిక జాతులు, సంతానోత్పత్తి పక్షులపై దృష్టి సారించి వీటిని రికార్డు చేశారు. రుతుపవనాల సమయం పక్షులకు బ్రీడింగ్ సీజన్‌గా గుర్తించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో జరిపిన సర్వేలో నగరంలో 214 పక్షిజాతులను రికార్డు చేశారు. ఈ సర్వేలో పెద్ద కాళ్లతో కూడిన అరుదైన పక్షులను కనుగొన్నారు.

సిటీలో కాకుల జాడ కోసం శాస్త్రీయ సర్వేలు నిర్వహించాల్సిన పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఈ సర్వే కాకుల సంఖ్యపై స్పష్టత ఇవ్వడమే కాకుండా, నగర జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలకు మార్గదర్శకంగా నిలవనుంది.



**సలీం అలీ స్ఫూర్తితో..**

**ప్రఖ్యాత పక్షి శాస్త్రవేత్త సలీం అలీ నిజాం ప్రభుత్వ ఆహ్వానంతో హైదరాబాద్ రాష్ట్రంలోని అడవులు, జలాశయాలు, వివిధ ప్రాంతాలను సందర్శించి పక్షి జాతులను నమోదు చేశారు. ఆ పరిశోధనల్లో 1930 సంవత్సరంలో హైదరాబాద్ రాష్ట్ర పక్షిజాలంపై శాస్త్రీయ సమాచారం వెలుగులోకి వచ్చింది. 90 ఏళ్ల తర్వాత హైదరాబాద్ బర్డ్ అట్లాస్ నగర పక్షులపై మరో సమగ్ర సర్వే చేపట్టింది. 1931 ప్రాంతంలో సలీం అలీ హైదరాబాద్‌లో చేపట్టిన బర్డ్ రీసెర్చ్ తర్వాత, నగర స్థాయిలో ఇంత విస్తృతంగా జరుగుతున్న బర్డ్ సర్వే ఇదే తొలిసారి అని పక్షి పరిశీలకులు చెప్పారు. గత సర్వేల్లో నగరంలో 214 పక్షి జాతులు నమోదు కావడం హైదరాబాద్ జీవవైవిధ్యానికి నిదర్శనం.**

**బెస్ట్ బర్డ్ హాట్‌స్పాట్**

**హిమయత్‌సాగర్ దగ్గరలో ఉన్న కొత్వాల్‌గూడ ఎకో పార్క్ ఆసియాలోనే అతిపెద్ద పక్షుల కేంద్రాల్లో ఒకటి. ఇక్కడ అమెజాన్, ఆస్ట్రేలియా, ఆఫ్రికా వంటి ప్రాంతాల నుంచి వలస వచ్చిన అరుదైన పక్షులు కనిపిస్తుంటాయి. మియాపూర్ దగ్గర్లోని అమీన్‌పూర్ చెరువు బర్డ్ వాచర్‌లకు ఇష్టమైన ప్రదేశం. ఇక్కడకు ప్రతి ఏటా విదేశీ వలస పక్షులు, కొంగలు, బాతులు భారీగా వస్తుంటాయి. కృష్ణకాంత్ పార్క్, నెహ్రూ జూలాజికల్ పార్క్, లోటస్ పాండ్‌లో పక్షుల కిలకిలరావాలు వినిపిస్తుంటాయి. అన్నారం నేచర్ అవేర్‌నెస్.. సెంటర్ పక్షులు, సీతాకోకచిలుకలకు నిలయం. మంజీరా వన్యప్రాణుల అభయారణ్యం విదేశీ వలస పక్షులు, కొంగలు, నీటి పక్షులకు ఫేమస్. కేబీఆర్ పార్క్, ఇందిరా, సంజీవయ్య పార్క్‌లు, సిటీ శివార్లలోని జాతీయ పార్క్‌లు పక్షులకు నిలయాలుగా మారాయి.**